₹ 10/-

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-2 సంచిక - 2 పక్షపత్రిక జనవరి16-31, 2011




## అవినీతిని పారద్రోలుదాం
## విశాఖ వీధుల్లో వర్షంలోనూ
## కదం తొక్కిన యువత

# కూకట్‌పల్లి పర్యవేక్షణలో జేపీ



















జీవించడం వల్ల గొప్పగా ఏదీ గణనలోకి రాదు. కాని మన అల్పకాలపు జీవితంలో మనం ఏం చేశాం అన్నదే గణనలోకి వస్తుంది.

– జవహర్‌లాల్ నెహ్రూ

## లోపలి పేజీల్లో...


శ్రీ కృష్ణ కమిటీ – ఆరు మార్గాలు.................. 5

కాలం కోరుతున్న సమన్వయం....................11

అసెంబ్లీలో జేపీ ప్రసంగం...............................13

మార్చేది మీరే.............................................. 19

భవిష్యత్తు మీ చేతుల్లో.................................. 20

యువత రాజకీయాల్లోకి రావాలి................... 21

రైతులు పంట పండించడం మానేస్తే............ 22

వ్యవసాయం – మహిళల పాత్ర..................... 24

ఆంధ్ర తెలంగాణా సమస్యను పరిష్కరించాలి.. 26

భారతదేశ చరిత్ర రెండు భాగాలు................. 27

కృష్ణ ట్రిబ్యునల్ తీర్పు................................ 28

అవినీతిపై పోరుకు కదిలిన విద్యార్థి సంఘాలు.29

రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు.................. 30

జిల్లాల సమాచారం...................................... 31


# 2010 నుంచి పాఠాలు నేర్చుకుంటే 2011లో భారత్ భవిష్యత్తు బాగుంటుంది

సంపాదకీయం

**2010 సం**వత్సరం భారతదేశంలో వరుస కుంభకోణాలకేకాకుండా ఆర్థిక పునరుత్తేజానికి, రాజ్యాంగసంస్థల కీలక పాత్రకు కూడా వేదికగా నిలిచింది. గత వైఫల్యాలు, సంక్షోభాల నుంచి భారత్ సరైన పాఠాల్ని నేర్చుకుని, దిద్దుబాటు చర్యల్ని చేపడితే వచ్చే దశాబ్దంలో ఉజ్వల భవిష్యత్తుకు అవకాశముంటుంది.

2–జీ స్పెక్ట్రం కుంభకోణం, కామన్వెల్త్ క్రీడల్లో భారీ దోపిడీ, న్యాయవ్యవస్థపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థికమాంద్యాన్ని తట్టుకుని అభివృద్ధిని నమోదు చేసిందంటే... అది కేవలం ప్రజల సత్తా మూలంగానే సాధ్యమైంది. అదేసమయంలో ఒక క్రమపద్ధతిలో సంస్కరణల్ని చేపట్టి, దేశాన్ని స్థిరమైన అభివృద్ధి బాటలో నిలిపేందుకు విలువైన అవకాశాలను ప్రభుత్వం చేజేతులా జారవిడించింది. వ్యవస్థ అలాంటి నిరాశాపూరిత పరిస్థితుల్లో ఉన్నా అయోధ్య కేసులో న్యాయవ్యవస్థ, 2–జీ స్కాంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఆశాకిరణాలుగా నిలిచాయి.

రాజ్యాంగవ్యవస్థలన్నింటి స్వయంప్రతిపత్తిని పరిరక్షించి, పెంపొందించి, పటిష్టం చేయటం 2011లో దేశం ముందున్న తొలి కర్తవ్యం.. ఉన్నత న్యాయవ్యవస్థలో నిజాయతీని, విలువల్ని పరిరక్షించేందుకు 'జాతీయ జ్యుడీషియల్ కమిషన్' ఏర్పాటు అత్యవసరం.

దేశాన్ని కుదిపేసిన కుంభకోణాల్ని వ్యవస్థ ప్రక్షాళనకు ఒక అవకాశంగా భావించాలని, విలువైన ప్రకృతి వనరుల్ని పోటీ బిడ్డింగ్ ద్వారా మాత్రమే కేటాయించి, ఆశ్రిత పక్షపాతానికి, అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శక్తివంతమైన, 'స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్ (ఐ.ఎ.సి.సి)'ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

వ్యవసాయంలో వ్యవస్థాపరమైన సంక్షోభం నుంచి వ్యవసాయాన్ని బైటపడేసేందుకు ప్రభుత్వం నిర్దిష్ట విధానాల్ని అమలుచేయాలి. రైతులకు మెరుగైన ఆదాయం కోసం లైసెన్స్– పర్మిట్ వ్యవస్థ నుంచి రైతుల్ని విముక్తి చేసి వారికి మెరుగైన ఆదాయానికి గ్యారంటీ ఇవ్వాలి.

ఏటా కనీసం 1కోటి మంది యువతకు వృత్తి నైపుణ్యాలను అందించే ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలి.

"దేశం ముందున్న సవాళ్ల దృష్ట్యా ఈ లక్ష్యాలన్నిటినీ నూతన సంవత్సరంలోనే చేపట్టాల్సి ఉంది. వాటిని చేపట్టటం పూర్తిగా సాధ్యం. ఎందుకంటే అందుకు కావలసిన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం మనకు పుష్కలంగా ఉన్నాయి. వాటిని సాధించాలనే సంకల్పం, కృతనిశ్చయం ప్రభుత్వానికి ఉంటే చాలు". ❍

**గెలుపునకు తుది ఉండదు. ఓటమి ఎన్నటికీ అపాయకారి కాదు- కావలసిందంతా ధైర్యమే**

– మెక్ డొనాల్డ్

**లోక్‌సత్తా టైమ్స్** - కొత్త రాజకీయ పక్షపత్రిక

*జనవరి 16-31, 2011 సంపుటి - 2 సంచిక - 2*

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082
ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**

# స్పందన

5 సంవత్సరాల కాలానికి ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు, పూర్తికాలం ప్రజల ఆకాంక్షలమేర శ్రమించి, సమాజాభివృద్ధికి తోడ్పడాలి. కాని మన భారత పార్లమెంటరీ వ్యవస్థలో, ఈ మధ్య కాలంలో క్రొత్త పోకడలు చోటు చేసుకుంటున్నాయి. స్వార్థం రాజకీయ నాయకులు సెంటిమెంటు బలంతోనో లేక ధనమదంతోనో చీటికి మాటికి రాజీనామాలు చేసి తిరిగి ఎన్నిక కాగలుగుతున్నారు. దీనివల్ల ఎంతో ప్రజాధనం వృధా అవుతోంది. సమస్యలకు తగు పరిష్కారాలు వెతకాలి తప్ప, ఒక సమస్య వేరొక సమస్యకు దారితీయరాదు. కుయుక్తులతో, కుతంత్రాలతో ప్రభుత్వాలను బెదిరించేందుకు రాజీనామాలు చేస్తున్న రాజకీయ నాయకులకు, పార్టీలకు ఎన్నికల కమీషన్ తగు బుద్ధి చెప్పాలి. చట్టపరమయిన ఎన్నికల సంస్కరణలతో ఇటువంటి విపరీత చేష్టలకు ముగింపు పలకాలి.

**డా॥ వంక వెంకట రామదాస్** (ఎమ్.డి)
తణుకు (పశ్చిమగోదావరి జిల్లా)

**అలవాట్లు అబ్బడం మన చేతిలోనే ఉంది. ఎలాంటి అలవాట్లు ఏర్పరచుకుంటే అలా తయారవుతాము** – నెహ్రూ

మీరూ రాయండి : *లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.*

# రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన రచనల్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 5వ, 20వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు

## మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా

ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఇం. నం. 5-10-180/ఎ&ఎ1, బ్యాండ్‌లేన్స్
హిల్‌ఫోర్ట్ రోడ్, హైదరాబాద్ - 500 004
ఫోన్: 040-2323 1818
loksattatimeslsp@gmail.com

## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా టైమ్స్ అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది. మీ దగ్గరలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాలను గాని, హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయాన్ని గాని సంప్రదించగలరు. ఫోన్: 040-2323 1818.

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ- మెయిల్ చెయ్యవచ్చు.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# ఆరుమార్గాలు




## మొదటి మార్గం

**యథాతథ స్థితి కొనసాగింపు**

- ★ సమస్యను ప్రాథమికంగా శాంతి భద్రతల సవాలుగా పరిగణించి, కేంద్రం పెద్దగా జోక్యం చేసుకోకుండా అదుపుచేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి వదిలేయాలి.
- ★ ఈ ప్రతిపాదనకు ప్రాతిపదిక గత 54 ఏళ్ల తెలంగాణ చరిత్రే. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ తలెత్తినపుడల్లా ఆయా మార్గాలకు ప్రభుత్వంలో, పార్టీ వ్యవస్థలో తగిన స్థానమిస్తూ రాజకీయంగానే పరిష్కరించేవారు.
- ★ వేర్పాటువాద భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసేందుకు 'తెలుగు జాతి ఆత్మగౌరవం' ముందుకు తీసుకురావడం మా దృష్టికి వచ్చింది. దాని ఫలితంగా తెలంగాణ డిమాండ్ సద్దుమణిగిందే తప్ప అదృశ్యం కాలేదు. 2000 తర్వాతి పరిస్థితుల్లో తిరిగి తలెత్తడానికి కారణం పాతదే. పెద్ద మనుషుల ఒప్పందాన్ని పాక్షికంగా అమలు చేయడం, ఉద్యోగాల విషయంలో 1975 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం, ప్రాంతాల మధ్య విద్యా ప్రమాణాల్లో తేడాలు, సాగునీటి ప్రాజెక్టుల్లో ధర్మబద్ధమైన వాటా నిరాకరించడం, తెలంగాణ ఆర్థికాభివృద్ధిని నిర్లక్ష్యం చేశారన్న అభిప్రాయం... ఇవన్నీ ఆజ్యం పోశాయి.
- ★ వీటన్నింటికి మించి భావోద్వేగపరమైన కారణాలు ఉన్నాయి. ఎప్పటినుంచో నానుతున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో అనుబంధం ఉంది.
- ★ ఆర్థికాభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా నిర్లక్ష్యం చేసినట్లు నిజమైన ఆధారలేవీ లభించలేదు. అయితే ప్రభుత్వోద్యోగాలు, విద్య, సాగునీటి సౌకర్యాల విషయంలో ఇప్పటికీ కొన్ని ఆందోళనలు నెలకొన్నాయి. వీటి విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోకుండా భావోద్వేగాలను సంతృప్తి పరచలేం.

**పర్యవసానాలు :**

- ★ తెలంగాణలో ఆందోళనలు చెలరేగి, కొంతకాలం కొనసాగుతాయి.
- ★ నిర్దుష్ట డిమాండ్లపై విభిన్న ప్రాంతాల్లో చెదురుమదురు ఆందోళనలు మరింతకాలం కొనసాగుతాయి.
- ★ గద్దర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రజా ఫ్రంట్ తెరాసతో చేతులు కలపడంతో ఉద్యమాలు తీవ్రంగా, భావోద్వేగపూరితంగా రూపుదాల్చే అవకాశం ఉంది.
- ★ తక్షణమే హైదరాబాద్‌లో, చుట్టుపక్కల జనజీవనం స్తంభిస్తుంది. నగరం ప్రతిష్ఠ మరోసారి ప్రభావితం అవుతుంది. ఆర్థికాభివృద్ధి రేటు ప్రశ్నార్థకం అవుతుంది.
- ★ ఈ ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై రాజీనామా చేయాలని ఒత్తిడి పెరుగుతుంది. మళ్లీ రాజకీయ సంక్షోభం వస్తే మావోయిస్టు ఉద్యమం పుంజుకొనే ప్రమాదం ఉంది.

**కమిటీ అభిప్రాయం**

**ఇలాంటి పరిస్థితుల్లో యథాతథ స్థితిని కొనసాగిస్తూ, వూరుకోవడం ఆచరణలో సాధ్యం కాదు. కొంత జోక్యం తప్పనిసరి. యథాతథ స్థితి ఒక ప్రతిపాదన మాత్రమే. మేం దానికి చిట్టచివరి ప్రాధాన్యం మాత్రమే ఇస్తున్నాం.**

## రెండవ మార్గం

**రాష్ట్రాన్ని సీమాంధ్ర, తెలంగాణాలుగా విడగొట్టి, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం. కాలక్రమంలో రెండు రాష్ట్రాలు సొంతంగా తమ రాజధానులను అభివృద్ధి చేసుకోవడం.**

- ★ చారిత్రకంగా హైదరాబాద్ కీలక స్థానాన్ని, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆర్థికంగా నగర ప్రాధాన్యాన్ని ఈ ప్రతిపాదన సూచిస్తోంది.

★ ఐటీ హబ్‌గా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాని స్థానాన్ని బట్టి హైదరాబాద్ అభివృద్ధికి చోదకశక్తిగా గౌరవం అందుకుంటోంది.

★ స్థానిక సంస్థలతోపాటు జాతీయ అంతర్జాతీయ సంస్థలు రంగంలోకి దిగడంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది.

★ పక్కనే రంగారెడ్డి జిల్లాలో పరిశ్రమలు కేంద్రీకృతం కావడంతో కోస్తా రాయలసీమ నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున పెట్టుబడిదారులు ఆకర్షితులయ్యారు.

★ ప్రభుత్వరంగ పరిశ్రమలు, జాతీయ సంస్థలు, సైనిక స్థావరాలు, రక్షణ సంస్థలు హైదరాబాద్ చుట్టుపక్కలే ఉన్నాయి.

★ వలసలతో నగరం జనాభా స్వరూపం మారిపోయింది. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు మొత్తం నగర ప్రజల్లో మూడో వంతు వరకు ఉన్నారు.

★ ఆటంకం లేని అభివృద్ధి ద్వారా ఈ నగరం మరింత మందికి ఉపాధి కల్పించగలదు.

★ ఇతర ప్రాంతాలతో హైదరాబాద్ అనుసంధానం పెరగాలి. స్థిరత్వం, నిలకడ కలిగిన వ్యాపార వాతావరణం కల్పించాలి.

**బ్రసెల్స్‌తో పోలిక**

బెల్జియంలోని బ్రసెల్స్ మహానగరంతో హైదరాబాద్ పరిస్థితిని పోల్చవచ్చు. ఉత్తర ఫ్లెమాండ్ ప్రాంతంలో ఉన్న బ్రసెల్స్‌పై పెత్తనం ఎవరిదనే విషయమై 1968లో బెల్జియంలో ఆందోళనలు పెచ్చరిల్లాయి. దాంతో బెల్జియంను రెండు సంస్కృతులు, మూడు ప్రాంతాలతో కూడిన దేశంగా ప్రకటించారు. బెల్జియం జనాభా కోటి మంది. 60 లక్షల మంది ఉత్తరాన ఉంటారు. ఫ్లెమిష్ భాష మాట్లాడతారు. 40 లక్షల మంది దక్షిణ బెల్జియంలో ఉంటారు. ఫ్రెంచి భాష మాట్లాడతారు. కొద్దిమంది జర్మనీ భాష మాట్లాడే వారు కూడా ఉన్నారు. ఆ విధంగా బెల్జియం మూడు భాషల జాతులకు చెందిన సమాఖ్యగా మారింది. బ్రసెల్స్‌లో రాజధానిగా పరిగణించే పరిమిత ప్రాంతానికి ప్రత్యేక పాలన, న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అక్కడ రెండు భాషలకు సమాన ప్రాధాన్యం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం మీద ఒకే సంస్కృతి ఉంది. తొలి భాషాప్రయుక్త రాష్ట్రం. అయితే, దినదిన ప్రవర్ధమానం అవుతున్న నగరం కోసం రెండు బలమైన వాదనలు పోటీ పడుతుంటే... కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడమే ఎక్కువమందికి తోచే పరిష్కారం. రాష్ట్రాన్ని రెండుగా విడగొట్టేట్లయితే హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి, కొన్నాళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి. రెండు రాష్ట్రాలు క్రమంగా తమ సొంత రాజధానులను ఏర్పాటు చేసుకుంటాయి. మహానగరం ఆదాయం కేంద్రానికి వెళుతుంది. కాబట్టి కేంద్రం నుంచి అందే గ్రాంట్ల పంపకానికి సంబంధించి తెలంగాణ, కోస్తా, రాయలసీమ ప్రాంతాల ప్రజలకు అంగీకర యోగ్యమైన ఫార్ములాను రూపొందించాలి.

**పర్యవసానాలు**

★ ఈ ప్రతిపాదన తెలంగాణ వారి కన్నా కోస్తా, రాయలసీమ ప్రజలకు ఎక్కువగా నచ్చుతుంది. హైదరాబాద్‌లో వారి ఆర్థిక ప్రయోజనాలకు రక్షణ లభిస్తుంది. నిజానికి వారికి అత్యంత ఇష్టమైన ప్రతిపాదన హైదరాబాద్ కేంద్రంగా సమైక్య రాష్ట్రం ఉండటమే.

★ ఈ ప్రతిపాదనతో తెలంగాణ ఉద్యమం ఉధృతం అవుతుంది. నగరాన్ని తెలంగాణలో కలపాలంటూ ఒత్తిడి చేసి పాలనను స్తంభింపజేసే ప్రమాదం ఉంది.

★ ఇప్పటిదాకా హైదరాబాద్‌తో కోస్తా రాయలసీమ ప్రజలకు ఉన్న భౌగోళిక అవిచ్ఛిన్నత తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తెగిపోతుంది. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలు మధ్యలోకి వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యమకారులు నగరంలోకి నీళ్లు, ఆహారం రాకుండా అడ్డుకోగలరు.

★ హైదరాబాద్ కలపకుండా తెలంగాణ ఏర్పడితే ప్రత్యేక రాష్ట్రం సాధించామన్న తృప్తి తెలంగాణవాదులకూ ఉండదు. తీవ్ర అసంతృప్తి చెలరేగుతుంది. ఆందోళనలు, సమస్య కొనసాగుతాయి. తక్షణ ఆందోళనలు చెలరేగే ప్రమాదం ఉంది.

**కమిటీ అభిప్రాయం : ఇది ఆచరణలో సాధ్యం కాదు.**

## మూడవ మార్గం

**రాష్ట్రాన్ని రాయల-తెలంగాణ, కోస్తాంధ్ర అనే రెండు రాష్ట్రాలుగా విడగొట్టాలి. హైదరాబాద్‌ను రాయల - తెలంగాణ రాజధానిగా చెయ్యాలి.**

★ రాయలసీమలోని కొన్ని వర్గాలు సమైక్యాంధ్ర తర్వాత రెండో ప్రతిపాదనగా దీన్ని పెట్టాయి.

★ ముస్లిముల సంక్షేమం, అభివృద్ధి కోణంలో సమైక్యాంధ్రనే గట్టిగా కోరుతున్న ఎంఐఎం కూడా రాష్ట్రాన్ని విడగొట్టాల్సి వస్తే తెలంగాణ, రాయలసీమలను కలపాలని వాదిస్తోంది. రాయలసీమలో 12 శాతం ముస్లిములున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తీసేస్తే ఇతర జిల్లాల్లో ముస్లిములు 8 శాతమే ఉన్నారు. రాయల–తెలంగాణలో ముస్లిములు రాజకీయంగా ఎక్కువగా ప్రభావం చూపగలరు.

★ రాయల – తెలంగాణకు మద్దతుగా రెండో వాదన వెనుకబాటుకు సంబంధించినది. మూడు ప్రాంతాల్లో అత్యధికంగా వెనుకబడింది. రాయలసీమేనని గణాంకాలు చెబుతున్నాయి.

★ తాగు, సాగునీటి కోసం తెలంగాణమీదే ఆధారపడాలి. విద్య ఉపాధికి హైదరాబాద్ అవసరం. రెండు ప్రాంతాల మధ్య సామాజిక సారూప్యతలు ఎక్కువ. అందుకే కోస్తాంధ్ర, తెలంగాణల మధ్య ఎంచుకోవాల్సి వస్తే రాయలసీమ ప్రజలు తెలంగాణనే ఎంచుకొనే అవకాశం ఉంది.

★ ఆర్థిక, సామాజిక కోణాల్లో చూస్తే రాయల తెలంగాణ నిర్వహణీయ ప్రతిపాదనేనని భావిస్తున్నాం.

★ ఈ ప్రతిపాదనను ఎంఐఎం తప్ప తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, వర్గాలు వ్యతిరేకిస్తాయి. తాము రాజకీయావకాశాలను దక్కించుకోవడంలో వెనుకబడటానికి సీమ నాయకత్వమే కారణమని, తమ భూవనరులను కొల్లగొడుతున్నది వారేనని తెలంగాణ నేతలు గట్టిగా నమ్ముతున్నారు. కమిటీ మాట్లాడిన తెలంగాణ నేతల్లో ఒక్కరు కూడా ఈ ప్రతిపాదనకు సుముఖంగా లేరు. అందరూ గట్టిగా వ్యతిరేకించారు.

★ ఈ ప్రతిపాదనను సమైక్యాంధ్ర వాదులు కూడా అంగీకరించరు.

**పర్యవసానాలు :**

★ ఆయా పార్టీల్లోని (హిందూ-ముస్లిం) మతతత్వ శక్తులు విజృంభించే ప్రమాదం ఉంది.

★ దీనికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంత ప్రజలు ఉద్యమించరు అని కచ్చితంగా చెప్పే పరిస్థితి లేదు.

**కమిటీ అభిప్రాయం : ప్రతిపాదన ఆర్థికంగా సమర్థనీయంగా ఉన్నప్పటికీ 3 ప్రాంతాలను సంతృప్తిపరిచే పరిష్కారం ఇవ్వలేదు.**

## నాల్గవ మార్గం

**రాష్ట్రాన్ని సీమాంధ్ర, తెలంగాణలుగా విడదీయాలి. హైదరాబాద్ మహానగరాన్ని కేంద్రపాలిత ప్రాంతం (యు.టి)గా ప్రకటించాలి. నల్గొండ-మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దుల్లోని 20 మండలాలను యు.టి.లో భాగంగా చేయాలి. తద్వారా హైదరాబాద్ యు.టి.ని సీమాంధ్రలోని గుంటూరు, కర్నూలు జిల్లాల సరిహద్దులతో భౌగోళిక అనుసంధానం చేయాలి. రెండింటికీ హైదరాబాదే రాజధాని. ఇది రెండో ప్రతిపాదన కొనసాగింపు. అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ ప్రత్యేకతను చాటే ప్రతిపాదన ఇది.**

★ నగర సరిహద్దులను ఇటీవలే సవరించారు. ఎంసీహెచ్‌గా ఉన్నపుడు మున్సిపల్ పరిధి 175 చదరపు కిలోమీటర్లు ఉండగా, జీహెచ్ఎంసీగా మారిన తర్వాత 625 చదరపు కిలోమీటర్లకు పెంచారు. హుడా స్థానంలో హెచ్ఎండీఏ వచ్చింది. దానికి ముఖ్యమంత్రి నేతృత్వం వహిస్తున్నారు. 7073 చదరపు కిలోమీటర్ల-దాదాపు గోవా రాష్ట్రానికి రెట్టింపు - భూభాగం హెచ్ఎండీఏ సొంతం. నాలుగో ప్రతిపాదన ప్రకారం భౌగోళిక అనుసంధానం చేస్తే హెచ్ఎండీఏ పరిధి 12,430 చదరపు కిలోమీటర్లు అవుతుంది.

★ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, తద్వారా జాతీయాభివృద్ధికి హైదరాబాద్ ప్రాంతం కీలకం. దాని జీడీపీ ప్రధానంగా ఆధునాతన సేవలు, రవాణా రంగం నుంచి వస్తోంది. 1999-2000లో వీటివాటా 43 శాతం ఉండగా, ఇప్పుడు 58 శాతానికి చేరింది.

★ ఆంధ్రప్రదేశ్ ప్రధాన సాఫ్ట్‌వేర్ కేంద్రం హైదరాబాదే. జాతీయ సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో 15 శాతం ఇక్కడి నుంచే వెళ్తున్నాయి. ఇక్కడ మౌలిక వసతులు, రియల్ ఎస్టేట్ బాగా అభివృద్ధి చెందుతున్న రంగాలు.

★ ఈ నగరానికి రాష్ట్రమంతటితో చక్కటి సామాజిక అనుబంధం ఉంది. నగరానికి ఉన్న విస్తృత రవాణా వసతులు, ఇతర ప్రాంతాల నుంచి వలసలే ఇందుకు సాక్ష్యం.

★ గతంలో కర్ణాటక, మహారాష్ట్రల నుంచే బయటి రాష్ట్రాల వలసలు ఉండేవి. ఇప్పుడు తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా వలసలు బాగా పెరిగాయి. హైదరాబాద్ ఇప్పుడు జాతీయ ఆర్థిక వ్యవస్థతో మమేకం కావడంతో ముంబాయిని తలపిస్తోంది.

★ దేశానికి కూడా హైదరాబాద్ వ్యూహాత్మకంగా కీలకం. అత్యున్నత స్థాయి మేధోసంస్థలు, దేశ భద్రతకు వ్యూహాత్మకంగా కీలక సంస్థలకు ఇది కేంద్రం.

★ అందుకే విస్తరించిన కేంద్రపాలిత ప్రాంతాన్ని ప్రతిపాదించాం. ఈ ప్రతిపాదన వల్ల రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకూ హైదరాబాద్‌తో భౌగోళికంగా అనుసంధానం ఏర్పడుతుంది. చండీగఢ్ తరహాలో తెలంగాణ, సీమాంధ్రులకు హైదరాబాదే రాజధాని అవుతుంది. యు.టి.కి పరిపాలన, పోలీసు, ఇతర అధికారులందర్నీ ప్రస్తుత రాష్ట్ర కేడర్ నుంచే తీసుకోవచ్చు. మౌలిక వసతుల అభివృద్ధికి తగినంత భూమి లభిస్తుంది.

★ కోటిమంది ప్రజలు, విశాల భూభాగంతో కూడిన హైదరాబాద్‌కు చండీగఢ్, ఢిల్లీల పాలనా వ్యవస్థలను సమ్మేళనాన్ని అమలు చేయొచ్చు. సొంత శాసనసభ ఉండొచ్చు.

★ చండీగఢ్, ఢిల్లీల చుట్టుపక్కల పట్టణాలు అభివృద్ధి చెందినట్టుగా హైదరాబాద్ చోదకశక్తితో తెలంగాణ, కోస్తా రాయలసీమల్లో ఆర్థిక, ఉపాధి రంగాలు గణనీయంగా అభివృద్ధి చెందుతాయి.

★ భవిష్యత్తులో ఎప్పుడైనా ప్రత్యేక రాయలసీమ డిమాండ్ రావొచ్చు. అప్పుడు నిర్ణయం తీసుకోవాల్సి వస్తే దాని రాజధానిని కూడా ఇక్కడ ఏర్పాటు చేయొచ్చు.

★ కేంద్ర పాలిత ప్రాంతం నుంచి వచ్చే ఆదాయం కేంద్రానికే చెందుతుంది కాబట్టి కొత్త రాష్ట్రాలతో కేంద్రం చర్చించి పరస్పరం అంగీకార యోగ్యమైన పంపిణీ సూత్రాన్ని రూపొందించుకోవచ్చు.

**పర్యవసానాలు :**

★ మొదట్నుంచి తెలంగాణలో అంతర్భాగమైన హైదరాబాద్‌ను పొరుగు రాష్ట్రంతో కలిపి ఉమ్మడి రాజధానిగా తెలంగాణవాదులు హర్షించక పోవచ్చు.

★ నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 20 మండలాల్ని యు.టి.లో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉంది. తక్షణ ఉద్యమాలు తలెత్తొచ్చు. నిజానికి ఆ 20 మండలాల్లో వూహించని అభివృద్ధి జరుగుతుంది.

★ హైదరాబాద్‌ను రాష్ట్ర రాజధానిగా పరిగణించి దశాబ్దాలుగా దాని అభివృద్ధికి దోహదం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ సమాజంలోని వివిధ వర్గాలు యు.టి.గా మారడాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది.

**కమిటీ అభిప్రాయం :**

★ అనేక సానుకూల అంశాలున్నా దీన్ని అందరూ ఆమోదించేలా రాజకీయ ఏకాభిప్రాయం సాధించటం కష్టమే.

★ హైదరాబాద్ కలిసునా లేకున్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మావోయిస్టు కార్యకలాపాలు పెరుగుతాయి.

## ఐదవ మార్గం

**రాష్ట్రాన్ని సీమాంధ్ర, తెలంగాణగా విభజించటం. తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంటుంది. సీమాంధ్రకు మరో కొత్త రాజధానిని ఏర్పాటు చెయ్యటం.**

★ ప్రస్తుతానికి హైదరాబాద్ కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాలకూ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది.

★ కాలక్రమంలో సీమాంధ్రకు వేరే రాజధానిని ఏర్పాటు చేయాలి.

★ కొత్త రాజధాని ఏర్పాటుకు భారీగా నిధులు కావాలి కాబట్టి ఆ మేర కేంద్రమూ సాయం చేయాలి.

★ తీవ్రనిర్లక్ష్యానికీ, వివక్షకూ గురవుతున్నామని అభిప్రాయపడుతున్న అధికసంఖ్యాక తెలంగాణ ప్రజల మనోభావాలను ప్రాధాన్యమిస్తూ వారి డిమాండ్లను ఆమోదించినట్లే అవుతుంది.

★ కమిటీ తెలంగాణ ప్రాంతంలో జరిపిన పర్యటనల్లో తెలంగాణ ప్రజలు అత్యధిక సంఖ్యలో ఈ ప్రత్యేక డిమాండుని సమర్థిస్తున్నారు. కొద్ది మంది వ్యతిరేకిస్తున్నారు. తటస్థులూ పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.

**అనుకూలురు :**

వరంగల్, పశ్చిమ ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, దక్షిణ అదిలాబాద్, మెదక్‌లోని సిద్దిపేట ప్రాంతం, నల్గండలో కొన్ని ప్రాంతాలు, మహబూబ్‌నగర్, రంగారెడ్డిలో కొన్ని భాగాలు, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు, నిరుద్యోగ యువత, లాయర్ల, ఎన్జీవోలు ఎలుగెత్తి ఉద్యమిస్తున్నారు.

**తటస్థులు :**

హైదరాబాద్ స్థానికులు, ఎంఐఎం వర్గాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కోస్తాంధ్ర, రాయలసీమ, కర్ణాటకలను ఆనుకుని ఉన్న సరిహద్దు మండలాల ప్రజలు, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో సెటిలర్ల గ్రామాలు, సీమాంధ్ర నుంచి, ఇతరత్రా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన వారు.

★ ఉత్తర తెలంగాణలోని అధిక సంఖ్యాక గిరిజనులు, ముఖ్యంగా కొండ ప్రాంతాల వారంతా తమకు ప్రత్యేకంగా 'మన్యసీమ' కావాలని కోరుకుంటున్నారు. ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లోని కొండప్రాంతాన్నంతా కలిపి ఒకే పరిపాలనా గొడుగు కిందకు తేవాలన్నదీ ఉన్నది.

★ ఎస్సీలు, బీసీలు, మైనారిటీలు.. తమకు దక్కాల్సిన రాజకీయ అవకాశాలు, ఆర్థికాభివృద్ధి, రిజర్వేషన్ సదుపాయాల గురించి వాదన వినిపిస్తున్నారు.

**పర్యవసానాలు :**

★ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తీవ్రమైన, హింసాత్మకమైన ఉద్యమాలు చేలరేగే అవకాశం ఉంటుంది.

★ హైదరాబాద్ భవితవ్యం, నీటి వనరుల పంపిణీ సమస్యలపై వెంటనే ఉద్యమాలు రేగుతాయి.

★ తక్షణం రాజీనామాలు చేసి సమైక్య ఆంధ్ర కోసం పోరాడాల్సిందిగా ప్రజల నుంచి సీమాంధ్రలోని ప్రజా ప్రతినిధులపై ఒత్తిళ్లు తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది.

★ రాయలసీమనూ విభజించాలన్న డిమాండూ త్వరలోనే వూపందుకోవచ్చు.

★ నక్సలిజం, మత ఛాందసవాదాలు పెరిగిపోతాయన్న అనుమానాలున్న నేపథ్యంలో అంతర్గత భద్రత అనుమానంలో పడుతుంది.

★ దేశవ్యాప్తంగా వేర్పాటు డిమాండ్లు బలం పుంజుకొంటాయి. భాషా ప్రాతిపదికను ఏర్పడిన ఒక రాష్ట్రాన్ని ముక్కలు చెయ్యాలన్న రాజకీయ డిమాండ్లకు కేంద్రం తొలిసారిగా తలొగ్గినట్లు అవుతుంది.

★ ఏ ప్రాంతానికైనా తన రాజకీయ ప్రతిపత్తి ఎలా ఉండాలో నిర్ణయించుకునే అధికారం తనకే ఇవ్వచ్చా? అన్న విస్తృత కోణంలో చూడాలి.

★ సరుకు రవాణా వంటి విషయాల్లో ఒకప్పుడున్న అంతర్రాష్ట్ర అవరోధాలు, అడ్డుగోడలు మళ్ళీ పెరిగిపోవచ్చన్న భావనా ఉంది. స్థానిక పన్నులు, ఎంట్రీ ట్యాక్సులు, సెస్సులు పెరిగిపోయి స్వేచ్ఛా వాణిజ్యానికి అవరోధంగా మారొచ్చు. వ్యాపారం, సరుకులు, సేవల ధరలూ పెరిగిపోవచ్చు. స్థానిక చట్టాల కారణంగా.. పొరుగు రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య సరుకుల కదలికలపైనా నియంత్రణలు పెరిగిపోవచ్చు. ఇలాంటి భయాందోళనలు, అనుమానాలు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల్లో చాలా బలంగా ఉన్నాయి. తమ వాణిజ్యాలకు కేంద్రంగా ఉంటున్న హైదరాబాద్‌ను తెలంగాణలో భాగంగా చేసేస్తే ఇక అది అందుబాటులో లేకుండా పోతుందన్న భయాలూ ఉన్నాయి. జనం, వ్యాపారాలు ఎక్కువగా కేంద్రీకృతమైన హైదరాబాద్‌ను కోల్పోవటం ద్వారా సీమాంధ్ర ప్రజలు అతిపెద్ద మార్కెట్‌ను కోల్పోయినట్టూ అవుతుంది. ఈ కోణం నుంచి చూసినప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌ను విభజించటమన్నది.. కొత్తగా ఏర్పడే రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి విఘాతంగానే తయారవుతుంది. అన్ని వైపులా భూభాగమే ఉన్న తెలంగాణకు విశాఖ వంటి పోర్టులు అందుబాటులో లేకుండా పోతాయి, తూర్పు తీరంతో సంబంధాలు తెగి ఆర్థికంగా నష్టాలూ సంభవించవచ్చు. కోస్తాతీరంలో భారీఎత్తున సహజ చమురు, వాయు నిక్షేపాలు వెలుగులోకి వస్తూ ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణను వేరు చేసేకంటే.. రాష్ట్రాన్ని సమైక్యంగా కొనసాగించటం వల్ల ఇరుప్రాంతాల వారూ వీటిద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. మొత్తమ్మీద.. హైదరాబాద్‌తో సహా ప్రత్యేక తెలంగాణను ఏర్పాటు చేస్తే ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగానే ఉంటుంది. పైగా దేశంలోని చాలారాష్ట్రాల కంటే ఇక్కడ జీడీపీ ఎక్కువగా కూడా ఉండే అవకాశం ఉంది.

★ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం.. సుదీర్ఘ కాలంగా కొనసాగుతుండటం, ప్రస్తుతం ఎంతో తీవ్రంగా, ఉద్వేగభరితంగా కూడా మారిన నేపథ్యంలో... ఈ డిమాండును నెరవేర్చకపోతే అదలాగే కొనసాగే అవకాశం ఉంది. (కఠినంగా, చాకచక్యంగా, దృఢంగా నిలువరించే ప్రయత్నం చేస్తే తగ్గే అవకాశం లేకపోలేదు, దాని గురించి ఆరో ప్రతిపాదన కింద సవివరంగా చర్చించాం) కాబట్టి ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవచ్చు. పెద్ద మనుషుల ఒప్పందం (1956)లోని కీలకాంశాలను అమలు చెయ్యకపోవటం, నీటిపారుదల పథకాల అమల్లో కొంత నిర్లక్ష్యం చూపటం, విద్యాపరమైన అవకాశాలు అరకొరగా (హైదరాబాద్ మినహాయించి) ఉండటం, రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చెయ్యటంలో అనవసరపు తాత్సార ధోరణి వహించటం.. ఇలాంటివన్నీ కలిసి తెలంగాణ ప్రాంత ప్రజల మనుసుల్లో తాము తీవ్ర వివక్షకూ, దాష్టీకానికీ గురవుతున్నామన్న భావనను కలిగిస్తున్నాయి, ప్రస్తుతం అది తీవ్రమైన ఆవేశకావేశాల దశకు చేరుకుంది. కాబట్టి ప్రత్యేక తెలంగాణ డిమాండు పూర్తిగా అన్యాయమైనదేం కాదు. అది కొంత వరకూ పరిశీలనార్హమైనదే. హైదరాబాద్‌తో సహా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చెయ్యాలనే గనక తీర్మానిస్తే... హైదరాబాద్‌లో స్థిరపడిన కోస్తాంధ్ర, రాయలసీమ, ఇతర తెలంగాణ జిల్లాల వారి భయాలను, ఆందోళనలను, వారి పెట్టుబడులు, ఆస్తులు, ఉద్యోగ ఉపాధి అవకాశాల వంటివన్నీ కచ్చితంగా పరిగణనలోకి తీసుకుని.. వారికి తగినంత భరోసాలు కల్పించటం అవసరం. ముఖ్యంగా కొత్త రాష్ట్రంలో తమ రక్షణకూ, భద్రతకూ అత్యధిక ప్రాధాన్యం ఉంటుందన్న విశ్వాసం వారిలో కల్పించటం చాలా చాలా అవసరం. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అన్నది ఆ ప్రాంతానికి చెందిన అధిక సంఖ్యాకులను సంతృప్తి పరిచేదే అయినప్పటికీ... దానివల్ల పైన పేర్కొన్న ఎన్నో తీవ్రస్థాయి సమస్యలు తలెత్తే అవకాశమూ ఉందని కమిటీ అభిప్రాయానికి వచ్చింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వల్ల మిగతా రెండు ప్రాంతాల్లో తలెత్తే పరిణామాలను విస్మరించటానికి లేదు.

**కమిటీ అభిప్రాయం :**

**'ప్రత్యేక తెలంగాణ' ఏర్పాటును.. సంపూర్ణంగా సమర్థించదగ్గ ప్రప్రథమ ప్రతిపాదనగా భావించటం లేదు. దీన్ని రెండో ఉత్తమ అవకాశంగానే భావిస్తున్నాం. పూర్తిగా అనివార్యమైతేనే.. మూడు ప్రాంతాల మధ్య సామరస్యంగా సయోధ్య సాధించగలిగితేనే... ఈ విభజన చేయవచ్చుని మేం సిఫార్సు చేస్తున్నాం.**

## ఆరవ మార్గం

**రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచటం. తెలంగాణ సామాజిక - ఆర్థిక అభివృద్ధికి, రాజకీయ సాధికారతకూ నిర్దుష్టమైన రాజ్యాంగ బద్ధచర్యలు తీసుకోవాలి. అధికారాలతో చట్టబద్ధమైన తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటు చెయ్యాలి.**

★ మూడు ప్రాంతాల సంక్షేమానికి 'అభివృద్ధి' అత్యంత కీలకమైన అంశం. దీన్ని సాధించటానికి లోతైన, విస్తృతస్థాయి ఆర్థిక – రాజకీయ 'వికేంద్రీకరణ' అవసరం.

★ ఇక్కడో రాజధాని, అక్కడో రాజధాని.. ఇక్కడో అసెంబ్లీ.. అక్కడో అసెంబ్లీ.. మంత్రులు..కోర్టులు, సంస్థలు.. పరిపాలనా యంత్రాంగాలు.. ఇలా అన్నీ ఒకటికి రెండు ఏర్పాటు చెయ్యాల్సిన అవసరం లేదు.

★ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల శ్రేయస్సుకూ 'సమైక్యత' కీలకం. రాష్ట్రాన్ని ముక్కలు చెయ్యటం వల్ల ప్రస్తుత సమస్యలకు సుస్థిర పరిష్కారాలు లభించే అవకాశం లేదు.

★ చట్టబద్ధ 'తెలంగాణ ప్రాంతీయ మండలి' ఏర్పాటు ద్వారా సమైక్యతను సాధించవచ్చు. 1956 నాటి పెద్దమనుషులు ఒప్పందం స్ఫూర్తిగా దానికి తగినన్ని నిధులు, అధికారాలు కల్పించాలి. రాష్ట్ర శాసనసభ ఆయా అంశాలపై చట్టాలు చెయ్యాలంటే ముందు ఈ మండలి సిఫార్సులు చేయాలి. తనకు అప్పగించిన అంశాలపై చట్టాలు చేయాలని సూచిస్తూ ప్రాంతీయ మండలి కూడా ప్రభుత్వానికి తీర్మానాలు పంపొచ్చు. వాటిపై అసెంబ్లీలో చర్చించి చట్టాలు చేస్తారు. ప్రాంతీయ మండలికీ, అసెంబ్లీకి భేదాభిప్రాయాలు వస్తే పరిష్కరించేందుకు గవర్నర్ సారధ్యంలో, సమాన సంఖ్యలో ఇరు ప్రాంతాలకు చెందిన సభ్యులతో ఏర్పడే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచెయ్యాలి. ఈ ఉన్నత కమిటీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్, శాసనమండలి ఛైర్మన్, విపక్ష నేతలు, తెలంగాణ ప్రాంతీయ మండలి ఛైర్మన్, రాజకీయ న్యాయవేత్త.. సభ్యులుగా ఉండాలి.

★ ప్రణాళిక, ఆర్థికాభివృద్ధి, నీటిపారుదల, విద్య, వృత్తి విద్య, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం.. ఇలాంటి కీలక రంగాలన్నింటినీ మండలికి అప్పగించాలి. మండలి ఛైర్మన్‌గా వ్యవహరించే ఎమ్మెల్యేకు క్యాబినేట్ మంత్రి హోదా కల్పించాలి. మండలికి ప్రత్యేక సచివాలయం ఉండాలి.

★ తెలంగాణ ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పటానికి పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక ప్రాంతంవారు ముఖ్య మంత్రి అయితే ఉప ముఖ్యమంత్రి పదవి మరో ప్రాంతానికి ఇవ్వటం వంటి ప్రాధాన్య చర్యలు చేపట్టాలి.

★ పెద్ద మనుషుల ఒప్పందంలోని అంశాలను నిర్లక్ష్యం చేయటం ఆరంభించిన నాటినుంచే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వూపందుకొంది. ప్రతిపాదిత ప్రాంతీయ మండలితో ఇవన్నీ చక్కదిద్దొచ్చు.

★ మూడు ప్రాంతాల వేగవంతమైన అభివృద్ధి ఎక్కడా వెనుకబాట పట్టకుండా ఉండేందుకు, జాతీయ దృక్పదాన్ని దృష్టిలో ఉంచుకుని 'సమైక్య ఆంధ్ర'ను సిఫార్సు చేస్తున్నాం. చిత్తశుద్ధితో పటిష్టమైన రాజకీయ, పరిపాలనా చర్యల ద్వారా సమైక్యత సాధించాలి. అది అందరి శ్రేయస్సుకు ముఖ్యం. ఇదే రాష్ట్రంలో సాధ్యమైనంత ఎక్కువ మందికి సంతృప్తిని కలిగిస్తుంది. దీనికి అందరినీ ఒప్పించటం సాధ్యమే. హైదరాబాద్ భవిష్యత్తుపై కమ్ముకున్న అనిశ్చితి కూడా దీంతో తొలగిపోతుంది.

★ జల వనరుల పంపిణీ, నిర్వహణల్లో ఎక్కడా పొరపొచ్చాలు రాకుండా చూసేందుకు 'నీటి నిర్వహణ బోర్డు', 'నీటిపారుదల ప్రాజెక్టులు అభివృద్ధి కార్పొరేషన్' వంటి సాంకేతిక సంస్థలను ఏర్పాటు చేయాలి. ఇదంతా తెలంగాణ ప్రజలు లేవనెత్తుతున్న అనుమానాలు నివృత్తి అయ్యేలా... వారికి సంతృప్తి కలిగించే పద్ధతిలో జరగాలి.

**పర్యవసానాలు :**

★ 'ప్రత్యేక తెలంగాణ' అనే చిరకాల వాంఛ నెరవేరదు కాబట్టి మొదట్లో రాజకీయ నాయకులు, ఇతర బృందాలు, సంస్థలు, తెలంగాణ ప్రజల్లో అధిక సంఖ్యాకులు తీవ్రంగా వ్యతిరేకించటం తథ్యం.

★ తెలంగాణ వస్తే లక్షలాది ఉద్యోగాలు వచ్చేస్తాయన్న భరోసాల్లో తేలియాడుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత, తెలంగాణ వస్తే వేగంగా పదోన్నతులు వచ్చేస్తాయని ఆశపడుతున్న ఎన్జీవోలు, లాయర్లు, రైతులు.. వీరంతా ఈ ప్రతిపాదనతో ఏమాత్రం సంతృప్తి చెందకపోవచ్చు, హింసాత్మకమైన ఉద్యమాలకూ దిగొచ్చు.

★ రాజకీయ సంక్షోభం సృష్టించేందుకు రాజీనామాలు చెయ్యాల్సిందిగా వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఒత్తిడి పెరిగిపోవచ్చు. తక్షణం తలెత్తే ఈ ఉద్యమ పరిణామాలను నెగ్గుకురావటం నాయకత్వానికి కూడా పెద్ద సవాల్‌గా తయారవ్వచ్చు. వీటన్నింటి గురించీ శాంతి భద్రతలు, అంతర్గత భద్రతకు సంబంధించిన విభాగాల్లో కొంత సవివరంగా చర్చించాం. ఒకసారి అభివృద్ధి నమూనా గురించి, రాష్ట్రం సమైక్యంగా ఉంటే ఒనగూడే ప్రయోజనాల గురించి ప్రజలకు అర్థమయ్యే కొద్దీ... ప్రభుత్వానికి ఉద్యమాలను నియంత్రిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగానూ, అన్ని రకాలుగానూ అభివృద్ధి పథంలో తీసుకువెళ్లటం తేలిక అవుతుంది.

★ మేం ప్రతిపాదించిన ఈ నమూనా వల్ల రాయలసీమ నుంచి కూడా ఇలాంటి ప్రత్యేక మండలి కోసం డిమాండ్లు వచ్చే అవకాశం ఉంది. మా అంచనాల ప్రకారం రాయలసీమ అత్యంత వెనకబాటును అనుభవిస్తున్న ప్రాంతం. ఉత్తరకోస్తా నుంచి, గిరిజన ప్రాంతాల నుంచి కూడా ఇలాంటి డిమాండ్లే రావచ్చు. ఈ ప్రతిపాదనకు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల నుంచే కాదు, హైదరాబాద్ నగరంలోని వర్గాల నుంచి కూడా ఆమోదం లభిస్తుందని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

★ సమైక్య ప్రతిపాదనను అమలు చెయ్యటంలో కష్టనష్టాలు ఎదురవ్వటం తథ్యం.

**కమిటీ అభిప్రాయం :**

★ **మొత్తమ్మీద ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తి సత్ఫలితాలను ఇచ్చేది, మూడు ప్రాంతాల ప్రజల సామాజిక, ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడేది ఈ ప్రతిపాదనేనని నిర్ధారణకు వచ్చాం.**

★ **జాతీయ దృక్పథంతో చూసినప్పుడు ఇదే మా ముందు అత్యుత్తమ పురోగామి మార్గంగా నిలబడుతోంది.**

★ **అధికార వికేంద్రీకరణతో, అందరి శ్రేయస్సును కాంక్షిస్తూ సమ్మిళిత అభివృద్ధి సాధించాలన్న జాతీయ లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోయేందుకు అవసరమైన నమూనాను ఈ ప్రతిపాదన ముందుకు తెస్తోంది. దేశంలోని ఇతరత్రా ప్రాంతాల్లో తలెత్తుతున్న ప్రాంతీయ, విభజన ఆకాంక్షలను సంతృప్తి పరచటానికి కూడా ఈ నమూనా ఉపకరిస్తుంది. ❍**

**(ఈనాడు సౌజన్యంతో...)**

# కాలం కోరుతున్న సమన్వయం

పుస్తకాలు జీవితాలను మార్చవు. అయితే అవి ప్రపంచం పట్ల మన దృక్పథాన్ని మార్చగలుగుతాయి. అర్థశాస్త్ర విద్యార్థిగా, పారిశ్రామికీకరణ ద్వారా మన గ్రామీణ సమాజాలలో మౌలిక మార్పును సాధించవచ్చునన్న భావనను పరిపూర్ణంగా విశ్వసించే వాణ్ణి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా నగరాలకు వెలుపల నివసిస్తున్న ప్రజల జీవిత స్థితిగతులను మెరుగు పరచవలసివుందని భావించేవాణ్ణి. మధ్య భారతంలోని గోండ్ గిరిజనుల జీవితం పై వెర్రియర్ ఎల్విన్ రాసిన 'లీవ్స్ ఫ్రమ్ ది జంగిల్' అనే గ్రంథాన్ని చదవడం తటస్థించింది. దీనితో పాటు ఎల్విన్ ఇతర గ్రంథాలనూ చదివాను. నిరక్షరాస్యులే కావచ్చు. భౌతిక సంపదలు లేకపోవచ్చు గాని గిరిజనులకు సమున్నతమైన కళా, సాంస్కృతిక సంప్రదాయాలు ఉన్నాయన్న సత్యాన్ని ఎల్విన్ పుస్తకాలు చాటి చెప్పాయి. ఆదివాసులు, అనాగరికులుగా మనం కొట్టివేసే ఈ గిరిజనులు ప్రకృతితో ప్రగాఢంగా మమేకమవుతారు. వారి సామాజిక సంఘీభావం పరిపూర్ణమైంది. ప్రకృతితో తాదాత్మ్యత, సామాజిక సంఘీభావం విషయంలో గిరిజనుల నుంచి మన నాగరిక ప్రపంచం నేర్చుకోవల్సింది చాలా వుంది.

కోల్‌కతా లో చదువుకొంటున్న కాలంలో అక్కడి ప్రొఫెసర్ల ప్రభావంతో నేను మార్క్సిస్టునయ్యాను. నా తల్లితండ్రుల తరానికి ఆరాధనీయుడైన జవహర్‌లాల్ నెహ్రూ ఆదర్శవాదం నాకెంత మాత్రం నచ్చేదికాదు. అసహనానికి లోనవుతుండేవాణ్ణి. దేశవ్యాప్తంగా సామాజిక జీవితంలో కొట్టొచ్చినట్టు కనపడే పేదరికం. అసమానతలను రూపుమాపడంలో నెహ్రూ ఆదర్శవాదం సఫలమయిందా మరి? ఒకసారి డెహ్రాడూన్ వెళ్ళినపుడు జార్జి ఆర్వెల్ గ్రంథం 'హోమేజ్ టు కెటలోనియా'ని కొన్నాను. ఆ రాత్రంగా ఆ పుస్తకాన్నే చదివాను. స్పానిష్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను, స్టాలిన్ ఆదేశాల ప్రకారం నడుచుకున్న కమ్యూనిస్టులు ఎలా నిర్లక్ష్యం చేసిందీ ప్రత్యక్షంగా గమనించిన ఆర్వెల్ సరళవచనంలో అసాధారణ స్పష్టతతో ఆ పుస్తకంలో వివరించారు. తెల్లవారు జామున ఆ పుస్తక పఠనాన్ని ముగించేటప్పటికి నేను మార్క్సిజాన్ని త్యజించి మళ్ళీ సోషల్ డెమొక్రాట్ నయ్యాను.

నా దృక్పథాన్ని మార్చివేసిన మరో పుస్తకం 'ట్రూత్ కాల్డ్ దెమ్ డిఫరెంట్ లీ' గురుదేవ్ రవీంద్రుడు, మహాత్మా గాంధీల మధ్య వివిధ అంశాలపై జరిగిన చర్చలకు సంబంధించిన గ్రంథమిది. ప్రపంచంలో భారత్ స్థానం, దేశ వ్యవహారాల్లో ఆంగ్ల భాష పాత్ర, దేశభక్తుల్లో రోజూ, ఒక గంటపాటు తప్పనిసరిగా నూలు వడకాలా ఇత్యాది అంశాలపై రవీంద్రుడు మహాత్ముడి మధ్య అనేక ఆసక్తికరమైన వాదోపవాదాలు జరిగాయి. వారి మేధో నైశిత్యం, నైతిక వ్యక్తిత్వాలకు అద్దం పట్టే చర్చలవి.

అవసరమైతే తమ అభి[ప్రాయాలను మార్చుకోవడానికి వారు వెనకాడబోరని ఆ చర్చలు స్పష్టం చేశాయి.

ఎల్విన్ ఒకప్పుడు భారతదేశంలో బాగా [ప్రఖ్యాతుడైన రచయిత టాగోర్, గాంధీ, ఆర్వెల్‌లు [ప్రపంచ వ్యాప్తంగా సువిఖ్యాతులు, ఆంగ్లంలో వివిధ అంశాలపై పలు [గ్రంథాలు రాశారు. [ప్రతిష్ఠాత్మక [ప్రచురణ సంస్థలు వారి [గ్రంథాలను [ప్రచురించాయి. [ప్రపంచం పట్ల నా దృక్పథాన్ని మార్చిన నాలుగో పుస్తకం రచయిత పైన పేర్కొన్న వారి మాదిరి గా సువిఖ్యాతుడు కాదు. సొంత రాష్ట్రమైన కర్ణాటక వెలుపల ఎవరికీ ఆయన గురించి తెలియదు. 1990ల తొలినాళ్ళలో బెంగుళూరులోని ఒక పుస్తకాల దుకాణంలో 'ది ఫ్లేమింగ్ ఫీట్' అనే ఒక చిన్న పుస్తకం  శీర్షిక మాదిరిగానే అందులోని వ్యాసాలు – డాక్టర్ అంబేద్కర్ గురించి రాసినవి – కూడా చాలా ఆసక్తిదాయకంగా ఉన్నాయి. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కల్చరల్ రీసెర్చ్ అండ్ యాక్షన్' అనే సంస్థ [ప్రచురించిన 'ది ఫ్లేమింగ్ ఫీట్' రచయిత డి.ఆర్. నాగరాజ్ బెంగుళూరు విశ్వవిద్యాలయంలో కన్నడ ఆచార్యులు ఆయన తొలి ఆంగ్ల [గ్రంథమే 'ది ఫ్లేమింగ్ ఫీట్' 1980, 90ల్లో దేశ రాజకీయాల వలే 1930లు, 40ల్లోని భారత రాజకీయాలు కూడా గాంధీ, అంబేద్కర్‌లను విరోధులుగా నిలిపాయి. 1980ల్లో మహాత్మాగాంధీపై బహుజన సమాజ్ పార్టీ తీ[వస్థాయిలో సైద్ధాంతిక దాడిని [ప్రారంభించింది. దళితులకు సంరక్షకుడుగా వ్యవహరించడం ద్వారా గాంధీ వారి విముక్తికి అడ్డుకున్నారనేది బిఎస్‌పి ఆరోపణ. ఇక హిందుత్వ సైద్ధాంతిక వేత్త అరుణ్ శౌరీ, డాక్టర్ అంబేద్కర్‌ను వలస పాలకులకు కాకారాయుడుగా అభివర్ణిస్తూ 600 పేజీల సుదీర్ఘ మహా విసుగు పుట్టించే [గ్రంథాన్ని రాశారు.

నాగరాజ్ ఒక విభిన్న విశిష్ట మేధావి. గాంధీ అంబేద్కర్‌లు ఇరువురినీ ఆయన అభిమానించారు. భిన్న సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన కారణంగా ఈ మహానాయకులిరువురికీ తమ జీవిత కాలాల్లో రాజకీయ విరోధులు కాకుండా ఉండడం అనేది అసాధ్యమయింది. అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం ముగించుకొని అంబేద్కర్ స్వదేశానికి వచ్చే నాటికే భారత జాతీయోద్యమానికి తిరుగులేని నాయకుడుగా మహాత్మాగాంధీ వెలుగొందుతున్నారు. దళిత నేపథ్యం నుంచి వచ్చిన అసాధారణ యువ మేధావి అంబేద్కర్ కాం[గెస్‌లో చేరడమంటే రాజకీయాల్లో తనను తాను ఒక అ[ప్రధాన స్థానానికి నెట్టివేసుకోవడమే అవుతుంది. నాగరాజ్ ఇలా వ్యాఖ్యానించారు. 'కాం[గెస్‌లో ఉంటూ ఒక హరిజన నాయకుడు అందరికీ ఆమోదయోగ్యమైన కార్యాచరణ విధానాలను రూపొందించే అవకాశం చాలా తక్కువ' కనుకనే అంబేద్కర్ గాంధీ నేతృత్వంలోని భారత జాతీయ కాం[గెస్‌కు వ్యతిరేకంగా తన [ప్రజల విముక్తికి సొంత రాజకీయ పార్టీ నేర్పాటు చేసుకున్నారు.

తమ చర్చలు, వాదోపవాదాల ద్వారా గాంధీ, అంబేద్కర్‌లు ఒకరినొకరు ఎలా పరివర్తన చెందించుకొంది నాగరాజ్ తన [గంథంలో నిరూపించారు. కుల వివక్షకు ఉన్న వ్యవస్థాపరమైన మూలాలను గాంధీ మరింత నిశితంగా అర్థం చేసుకోగా ఆర్థిక అవకాశాల మాదిరిగానే నైతిక పునరుద్ధరణ అనేది దళితుల విమోచనకు చాలా కీలకమన్న సత్యాన్ని అంబేద్కర్ గుర్తించారు. " మనలో బాగా పాదుకుపోయిన దురభి[ప్రాయాల' (ఇవి గాంధీ, అంబేద్కర్‌లలో ఎవరో ఒకరిని మా[తమే అనుసరించేలా [ప్రోత్సహిస్తాయి) పైనే కాక 'అనుకూలాలోచన(విష్‌ఫుల్ థింకింగ్–ఇది దళిత సమస్యకు గాంధీ, అంబేద్కర్‌లలో ఎవరో ఒకరు మా[తమే సమ[గ పరిష్కారాన్ని ఇవ్వగలరని విశ్వసిస్తుంది) పై కూడా పోరాడడం ద్వారా మా[తమే మనం ఆ ఇరువురినీ గౌరవించగలమని" నాగరాజ్ రాశారు.

వర్తమాన దృష్టి కోణం నుంచి చూస్తే గాంధీ అంబేద్కర్‌ల దార్శనికతల మధ్య తప్పనిసరిగా ఒక సమన్వయాన్ని సాధించవల్సిన అవసరమున్నదని నాగరాజ్ పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా రాశారు. 'దళితుల విముక్తి విషయమై  గాంధేయ, అంబేద్కర్ దృక్పథాలు రెండూ పాక్షికంగా మా[తమే సత్యాలు, స్పర్ధిస్తున్న ఈ రెండు దార్శనికతలూ ఇంకా ఒక దానినొకటి సంపూర్ణంగా అర్థం చేసుకోలేదు. ఇది ఆధునిక భారతదేశ చరి[తలో ఒక గొప్ప వైరుధ్యం' టాగోర్, గాంధీ, ఆర్వెల్, ఎల్విన్‌ల మాదిరిగానే నాగరాజ్‌ను చదవడం ఒక దివ్య అనుభవం. గాంధీ, అంబేద్కర్‌లు తమ జీవితకాలంలో [ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ ఈ వర్తమాన భారతీయ దృష్టికోణం నుంచి ఆ ఇరువురినీ భాగస్వాములుగాను, సహకారులుగాను పరిగణించాలనే సత్యాన్ని గుర్తించడానికి ఆయన నాకు నేర్పారు. అసంపూర్ణంగా మిగిలిపోయిన దళితుల విముక్తి అనే మహోన్నత కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి ఆ ఇరువురి మహానాయకుల వారసత్వం ఎంతైనా అవసరం.

మేధావిగా, రాజకీయ విశ్లేషకుడుగా పరిణతి పొందుతున్న నాగరాజ్ 1998లో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. 'ది ఫ్లేమింగ్ ఫీట్' ను మరికొన్ని అము[ద్రిత వ్యాసాలతో కలిపి ఇటీవలే [ప్రచురించారు. నాగరాజ్ పూర్వ విద్యార్థి పృథ్వీ దత్తాచం[ద శోభి ఈ కొత్త ఎడిషన్‌ను తీసుకువచ్చారు. 'సమరశీల గాంధేయ సం[ప్రదాయం కొరవడడం, (హిందూ ధర్మం వెలుపల చరి[తను అన్వేషించుకోవడంలో) ఒక దళిత గుర్తింపును ఆవిష్కరించుకోవడం, పర్యావరణ, దళిత, గిరిజన ఉద్యమాలకు ఒక సమైక్య వేదికను నిర్మించుకోవల్సిన అవసరం మొదలైన అంశాలపై వ్యాసాలు ఈ కొత్త ఎడిషన్‌లో అదనంగా ఉన్నాయి. ని[ష్క్రమించిన 2010 సంవత్సరంలో మన దేశంలో [ప్రచురితమైన సాహిత్యేతర [గంథాలలో 'ది ఫ్లేమింగ్ ఫీట్' చాలా ముఖ్యమైనది. ఆధునిక భారతదేశం సమాజం రాజకీయాలలో ఆసక్తి ఉన్న వారందరూ తప్పక చదవవలసిన [గంథమది ❍

**రామచంద్రగుహ** (ఆం[ధ్రజ్యోతి సౌజన్యంతో..)

# రైతు సమస్యలపై జేపీ అసెంబ్లీలో చేసిన ప్రసంగం

## యధాతథంగా....

అధ్యక్షా! రాష్ట్రంలో మీ ఇష్టమొచ్చిన జిల్లాకి వెళ్ళండి. మీ ఇష్టమొచ్చిన గ్రామానికి వెళ్ళండి, మీ ఇష్టమొచ్చిన పంట పండించే రైతు దగ్గరకు వెళ్ళండి. నేను ఖచ్చితంగా చెబుతున్నాను. ప్రతి రైతు కంటా కన్నీరు, ప్రతి రైతు కంఠంలో జీర, ప్రతి రైతు గుండెల్లో వేదన! ఇది పండుగ జరుగుతుంటే ఉండే పద్ధతి కాదు అధ్యక్షా! వ్యవసాయరంగంలో ఉన్న వాళ్ళు ఎప్పుడెప్పుడు పారిపోదామా అనుకుంటున్నారు. ఎన్నో సర్వేలు రుజువు చేస్తున్నాయి. నెలకి 5000/- రూపాయలు గనక ఎక్కడన్నా మీరు పట్నంలో ఏర్పాటు చేస్తే ఇవాళ రైతుల్లో నూటికి డెభ్భైమంది మేము పట్టణాలకి పోతాం రూ॥5000 నెలకి వస్తే చాలు అధ్యక్షా, పారిపోతాం అంటున్నారు. రైతు బిడ్డలు లక్షలాది మంది పొట్టచేత బట్టుకొని నగరాలకి వలసపోతున్నారు. ఇంత మందిమి ఇక్కడ వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చాం. అధ్యక్షా! బహుశా ముత్యం రెడ్డి గారు ఇంకో ఇద్దరు ముగ్గురున్నారేమో, వారిని మినహాయిస్తే వ్యవసాయాన్ని ఇవాళ్ళ చేస్తున్న వాళ్ళు గానీ, మన పిల్లలు వ్యవసాయం చేస్తే బాగుండనుకునేవాళ్ళు గానీ ఈ శాసనసభ్యులం ఎంత మందిమి ఉన్నాం అధ్యక్షా? వ్యవసాయం పండుగగా లేదు అధ్యక్షా! వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. ముందు దాన్ని గుర్తించకపోతే తాత్కాలికమైన మాట్లు వేసే ప్రయత్నం చేస్తే ఏదో ఈ పూటకి మనం కాలం గడపచ్చుగానీ దేశంలో 65% జనాభాని పూర్తిగా దగా చేసిన వాళ్ళం అవుతాం. అధ్యక్షా! దీనికి దృష్టాంతం చెప్పాలి. ఈవేళ ఒక్కసారి తలసరి ఆదాయం తీసుకోండి. కేవలం వ్యవసాయ రంగంలో ఉన్న పాపానికి రైతులు గానీ, కౌలుదారులు గానీ, గుత్తేదారులు గానీ, వ్యవసాయ కూలీలు గానీ 65-70% మంది. వారి తలసరి ఆదాయం అధ్యక్షా! పదిహేను వేల రూపాయలు ఇవాళ. మిగిలిన రంగాల్లో ఉన్న కారణంగా ఆ 35% మంది తలసరి ఆదాయం లక్షా అయిదు వేల రూపాయలు. అక్షరాలా! లెక్కలు వేసుకోండి అధ్యక్షా! ఇది అవాస్తవమైనట్లైతే నేను ఉపసంహరించుకుంటాను. ఏడు రెట్లు ఎక్కువున్నది. వ్యవసాయం బయట ఉన్న 35-40 శాతం మంది తలసరి ఆదాయం వ్యవసాయం మీద ఆదారపడే వారితో పోలిస్తే 7 రెట్లు ఎక్కువున్నది అధ్యక్షా! 7వ వంతు తలసరి ఆదాయం ఉంటే, ఎక్కడ అధ్యక్షా పండుగ? ఇక్కడితో అవట్లేదు.

ఇదే పరిస్థితి - గత 10,20 ఏళ్ళుగా ఉన్న పరిస్థితే ఈ రాష్ట్రంలో ఈ దేశంలో కొనసాగితే 2020 నాటికి వ్యవసాయ రంగంలో ఉన్న వారి తలసరి ఆదాయం అధ్యక్షా, 18,000 రూపాయలు అవుతుంది. ఇవాల్టి రూపాయి విలువ ప్రకారం వ్యవసాయేతర రంగాల్లో ఉన్న వారి ఆదాయం 2 లక్షల 50 వేల రూపాయలు అవుతుంది. అంటే సుమారుగా 14-15రెట్లు కాబోతోంది. అంటే ఈ దేశంలో సాంఘిక, సామాజిక సంక్షోభానికీ, రాజకీయ అస్థిరతకీ, ఆర్థిక మాంద్యానికీ ఇవాళ గట్టి పునాదులు వేస్తున్నాం అధ్యక్షా. దీని మొత్తానికీ కారణం - ఈ మాటంటే బాధ కలగచ్చు ఈ సభలో కొంతమందికి - ఇన్నేళ్ళుగా ప్రభుత్వాలూ, పార్టీలూ చేపట్టినటువంటి దగాకోరు విధానాలు - దాన్లో అనుమానం ఏ మాత్రం లేదు దృష్టాంతం చెప్తాను. దృష్టాంతం లేకుండా ఒక్క ఆరోపణ కూడా చెయ్యను.

అధ్యక్షా! నా దగ్గర exhibits ఉన్నాయి. కోర్టులో సాక్ష్యం కోసం ఇచ్చినట్టు exhibits తీసుకొచ్చాను నేను. 1991లో ప్రపంచ ప్రసిద్ధ "ది ఎకానమిస్ట్" పత్రిక ఒక వ్యాఖ్య చేసింది. 1991 మే 4వ తేదీన. భారతదేశంలో ప్రభుత్వాలన్నీ కూర్చొని వ్యవసాయ రంగాన్ని దగా చేద్దాం, నాశనం చేద్దాం అని ఒక కుట్ర పన్నినట్లైతే ఏం చేసుండే వాళ్ళో ఇప్పటిదాకా భారతదేశంలో స్వతంత్రం వచ్చాక వ్యవసాయానికి అదే చేశారు అని. కుట్ర పన్నలేదు అధ్యక్షా కుట్ర పన్నకపోయినా పన్నినట్టుగా ఫలితాలు వచ్చాయి. 1991 నుంచి 20 ఏళ్ళలో పరిస్థితి మరింత దారుణమైంది. 2 కారణాలుగా వ్యవసాయేతర రంగాలు ఆర్థిక సరళీకరణ వల్ల చాలా వేగంగా పెరుగుతుండగా వ్యవసాయం అత్తెసరుగా 2% అభివృద్ధి సాధించింది అధ్యక్షా. ఈ 20 ఏళ్ళలో భారత దేశంలో! రెండోది - ప్రపంచ వాణిజ్య ఒప్పందం ద్వారా వ్యవసాయంలో రేటు ఎక్కడ వస్తే అక్కడ రేటిచ్చే ఏర్పాటు చేస్తామని ఈ ప్రభుత్వాలూ పార్లమెంట్లూ నమ్మబలికాయి. రైతులు - వ్యవసాయం మీద ఆధారపడేవాళ్ళకి ప్రమాణం చేసినాయి అధ్యక్షా Solemn pledge చేశాయి పార్లమెంట్లు. పూర్తిగా దాన్ని ఉల్లంఘించి ధరల్ని తగ్గించటమే వ్యవసాయంలో రైతులకి ఆదాయం లేకుండా చెయ్యటమే మా లక్ష్యం అని బస్తీమే సవాల్ అని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. దీన్లో రహస్యం లేదు అధ్యక్షా! చాలా బహిరంగంగా, వ్యవసాయోత్పత్తుల ధరలు తగ్గించటమే లక్ష్యంగా ఇవాళ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. అధ్యక్షా. ఈ 2 కారణాలుగా - ఒక వంక వ్యవసాయేతర రంగాల్లో శరవేగంగా అభివృద్ధి జరుగుతుంటే వ్యవసాయం చాలా మందకొడిగా నడవటం, రెండోది వచ్చిన ఉత్పత్తి ఏమన్నా కనీసం పంట పండినప్పుడు పంట ఎండిపోతే ఎలాగూ దండగే. పంట కుళ్ళితే, వర్షం వస్తే ఎలాగూ దండగే కానీ కనీసం పంట పండిన నాడైనా చిరునవ్వు వస్తుందేమో అనుకుంటే ధర రాకుండా ప్రభుత్వాలు విధానాలు చేపట్టటం వల్ల వాణిజ్యంలో- అధ్యక్షా! కేవలం ఈ రెండు కారణాల వల్ల వ్యవసాయ రంగంలో ఉన్నవారి తలసరి

ఆదాయం మళ్ళీ ఇంకోసారి– ఈ సభ దృష్టికీ, ఈ రాష్ట్ర ప్రజల దృష్టికీ రావాలి అధ్యక్షా! వ్యవసాయ రంగంలో ఉన్నవారి తలసరి ఆదాయం మిగిలిన వారితో పోలిస్తే ఇవాళ 7వ వంతు ఉన్నది, ఇంకో పదేళ్ళలో 14వ వంతు కాబోతోంది. ఇంక ఎక్కడుంది పండుగ? అధ్యక్షా! ఆత్మహత్యల గూర్చి చాలా మాట్లాడుకుంటున్నాం మనం. ధరలు పెరిగితే గగ్గోలు పెడుతున్నాము. వ్యవసాయంలో రైతుకి ఒక రూపాయి వస్తే గగ్గోలు పెడుతున్నాము ఎన్నో సందర్భాల్లో. చాలా బాధాకరమైన ఒక వ్యాఖ్య తెలుసుకున్నాను అధ్యక్షా! వ్యవసాయంలో ఉత్పత్తులకి ధర పెరగటం వల్ల రైతులకి రేటు రావటం వల్లా భారతదేశంలో ఒక్క మనిషి కూడా ఆత్మహత్య చేసుకోలేదు. మళ్ళీ చెప్తున్నాను. గత 10 సంవత్సరాల్లో వ్యవసాయోత్పత్తులకి ధర పెరగటం వల్ల, రైతుకి ఆదాయం పెరగటం వల్ల ఒక్క వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకోలేదు. ధరలు పెరిగాయని, కానీ వ్యవసాయంలో ధరలు రాకపోవటం చేత, ఆదాయాలు పడిపోవటం చేత మూడు లక్షల మంది రైతులు భారత దేశంలో గత పదేళ్ళుగా ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ రంగాన్ని దారుణంగా వంచించటం చేత. తాత్కాలికమైన ఓట్ల వేటలో రైతుకి ఆదాయం రాకుండా మనమే క్రూరమైన విధానాల్ని చేపట్టటం చేత. రైతు నేపథ్యం నుంచే వచ్చామని చెప్పుకున్నా కూడా వ్యవసాయాన్ని ఒక పథకం ప్రకారం నాశనం చెయ్యడం చేత 3 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. అధ్యక్షా! ఇది చిన్న వ్యవహారం కాదు.

కోటీ ఇరవైలక్షల కమతాలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. అంటే కోటీ ఇరవైలక్షల కుటుంబాలు పొలాలకి సొంతదారులుగా ఉన్నారు. 60 లక్షలకి పైగా కుటుంబాలు ఈ రాష్ట్రంలో సొంత పొలం లేకపోయినా నిరుపేదలంతా కూడా నామోషీగా ఉండి, వాళ్ళు కౌలు చేస్తున్నపొలంలో కూలీ కట్టుకోకుండా రైతుకి ఎట్లా ఇస్తున్నారో ఆ కౌలు. ఎలా బ్రతుకుతున్నారో అర్థం కాకుండా ఉంది అధ్యక్షా! కేవలం అక్కడ చేలగట్ల మీద కొంత పశుగ్రాసం వస్తే నాలుగు దూడల్ని పెంచుకొని ఆ పాలమ్ముకొని బ్రతుకుతున్నారు గానీ, కూలీ లెక్క కట్టుకోవటం చేతగాక ఆ కూలీ ఉచితంగా చేసి ఆ పొలంలో పండిస్తున్నారు గానీ, ఒక్క రూపాయి ఆదాయం రావటం లేదు. కోటీ ఎనభైలక్షల కుటుంబాలు ఇవాళ రాష్ట్రంలో ఈ తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాయి. అంటే కుటుంబానికి ఇద్దరు వేసుకున్నా 3,60,00,000 మంది అడల్ట్ సిటిజన్స్ ఉన్నారు అధ్యక్షా! వయోజన ఓటు హక్కు ఉన్నవాళ్ళు ఉన్నారు. వాళ్ళంతా చెట్టుకొక్కరు, పుట్టకొక్కరు – కులం పేరుతో ప్రాంతం పేరుతో పార్టీ పేరుతో పంటపేరుతో ముక్కలయ్యారు గానీ, అందరం ఒకటే కులం – రైతు కులం. అందరం ఒకటే ప్రాంతం – రైతు ప్రాంతం, అందరం ఒకటే పంట – రైతు పంట. అందరం ఒకటే పార్టీ – రైతు పార్టీ అని ముందుకొస్తే అధ్యక్షా! ఈ సభలో చర్చలు అక్కర్లేదు. 24 గంటల్లో ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో వ్యవసాయ విధానాలు మారతాయి. అప్పుడు రైతుకి నిజంగా పండగవుతుంది. అధ్యక్షా! ప్రభుత్వాలు కావాలని వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి ఆదాయం రాకుండా అణిచివేస్తుంటే మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా తొలుత వర్షాలు బాగా పడ్డాయి. పంటలు బాగానే ఉంటాయి అని ఆశిస్తుండగా ఈ సంవత్సరం వరుసగా వచ్చినటువంటి ఈ పెనుతుఫాన్లు చివరికి ఇవన్నీ తట్టుకున్నా కూడా డిసెంబరు మాసంలో 5 నుంచి 8వ తారీఖు వరకూ ఇచ్చినటువంటి అధిక వర్షం – పంట పనల మీద ఉండగా వచ్చిన వర్షం వల్ల – రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో వరి కావచ్చు, ప్రత్తి కావచ్చు, వేరుశనగ కావచ్చు, మిరప కావచ్చు, పొగాకు, పళ్ళు కూరగాయలు కావచ్చు, అపరాలు కావచ్చు – తీవ్రంగా నష్టపోయారు అధ్యక్షా! అయితే తాత్కాలికంగా ఎప్పటికప్పుడు రైతు కంట కన్నీరు కారనిచ్చి ఎప్పటికెయ్యది ప్రస్తుతంబు అనుకున్నట్లైతే ప్రతిసారీ కూడా పరగడుపు అవుతోంది అధ్యక్షా! ఇప్పుడు జరుగుతోంది అదే. కాబట్టి వెంటనే చేపట్టవలసిన చర్యలున్నాయి. దాంతో ఆపితే లాభం లేదు. చాలాసార్లు చూశాం ఈ చర్యలు దాంతో పాటు దీర్ఘకాలిక చర్యలున్నాయి. నిర్దిష్టంగా డిమాండ్ దగ్గరకి వస్తాను అధ్యక్షా! మొట్టమొదట అధ్యక్షా! 2003లో పంట దెబ్బతింటే తుపాను, వర్షాల వల్ల నవంబర్, డిసెంబర్‌లో ఇక్కడ కూర్చున్న ప్రభుత్వం (తెలుగుదేశం) వారు ఆనాడు ఓ మంచి ప్రయత్నం చేశారు. జాతీయ స్థాయిలో వారితో కూర్చొని 20-01-2004న దాన్ని అనుసరించి కనీసం ఇవాళ 30 శాతం దెబ్బతిన్నటువంటి ధాన్యాన్ని ధరతగ్గించకుండా కొనుగోలు చేసే ఏర్పాటు చేయటం పూర్తిగా సాధ్యము, అవసరము. 3% బదులు 6% discoloration ఉన్నా కూడా విధిగా దాన్ని సేకరించే ఏర్పాటు చేయటం సాధ్యము అవసరం.

ఆనాడు అలా సేకరిస్తే ఎఫ్‌సిఐ కి నష్టం జరగలేదు. చివరకు వేలం వేసేస్తే లాభం వచ్చింది అధ్యక్షా! కాబట్టి నష్టపోవాల్సిన అవసరం లేదు. ఇవాళ సంవత్సరానికి ఒక్కొక్క టన్ను మీద 3700 రూపాయల్ని ఎఫ్‌సిఐ కేవలం నిలవుంచడం కోసం ఖర్చు పెడుతున్నప్పుడు – రైతుని ఆదుకోవటం కోసం ఈ రాయితీలు ఇస్తే ఏ విధంగా ఎఫ్‌సిఐ నష్టపోదు, కేంద్ర ప్రభుత్వము నష్టపోదు. వెంటనే ఆ ఏర్పాటు చేయించండి మొట్టమొదటగా.

అధ్యక్షా! Procure చెయ్యాలంటే ఇక్కడ్నుంచీ సరుకులు కదలాలి. సరుకులు కదలాలంటే గోడౌన్లు లేవని అంటున్నారు. తరువాత గోడౌన్స్ కడతాం అంటున్నారు. అది కూడా సభలో చర్చకు వచ్చింది. ఈ రాష్ట్రంలో ఈ బిపిపి ప్రాతిపదికను కూడా గోడౌన్లు కట్టలేక పోయారు. కానీ ఈ కదలిక కావాలంటే అధ్యక్షా! చాలా గట్టి ప్రయత్నం వ్యవసాయరంగం నుంచీ, రైతుల దగ్గర్నించి ఒక ఉద్యమం వస్తే ప్రభుత్వం చాలా ఆలస్యంగా స్పందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని రీతిన భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ లేదు. కేవలం ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రమే రైతు పండించిన ఉత్పత్తిని ప్రక్క జిల్లాకో, ప్రక్క రాష్ట్రానికో తీసుకుపోయి అమ్ముకునే అవకాశం లేకుండా ఆంక్షలు పెట్టి, రైతుకి రేటు రాకుండా నాశనం చేస్తుంటే, పోరాడితే ఎట్టకేలకు డిసెంబర్4న ఒక ఆదేశం ఇచ్చారు. కానీ అదే రోజున దేవుడు వరమిస్తే పూజారి వరమివ్వకుండా

కమీషనర్ ఆఫ్ సివిల్ సప్లయర్స్ ఒక ఆదేశమిచ్చారు. జీవో ఒకటి చెప్తుంటే నిర్నిబంధంగా దేశంలో ఎక్కడ రేటున్నా అమ్ముకునే ఏర్పాటు జరగాలి, సన్నా, ముతకా తేడా లేకుండా బియ్యానికి అని చెప్పి ఆదేశం ఉంటే మళ్ళీ కేవలం లక్షన్నర టన్నులకి మాత్రమే ఇది వర్తిస్తుంది. డిసెంబరు 31లోగా మాత్రమే అని కుడిచేత్తో ఇచ్చినట్టు ఇచ్చి ఎడమ చేత్తో తీసుకుపోయారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని ఆంక్షలు ఎందుకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టి రైతుల కడుపు కొడుతున్నారు? శాశ్వతంగా ఏ నిబంధనలూ లేకుండా మీకు కావల్సింది మీరు Procure చేసుకోండి. మీరు సేకరించండి. దేశంలో ఎక్కడా లేనంత పెద్ద ఎత్తున ఇక్కడ వరిని, బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఆ పైన ఎంత ఉంటే అంత, ఎక్కడ రేటుంటే అక్కడ అమ్ముకునే ఏర్పాటు చేయండి. మీరే కొనాలంటే సరైన రేటుకి కొనుక్కోండి గానీ రైతుకి అన్యాయం చేయబోకండి అధ్యక్షా! అది చేసినా కూడా చాలదు. పెద్దలంతా చెప్పారు కాబట్టి, చెప్పిన మాటే చెబుతుంటే వినేవాళ్ళకి బోరుకొడుతోంది. కొత్త మాటలేం చెప్పట్లేదు. నేను వారికి హామీ ఇచ్చాను. అమ్మా నేను నూటికి 90 పాళ్ళు చెప్పినమాట చెప్పకుండా చెప్తాను కానీ పదిశాతం తప్పదు కొన్ని మాటలు మేము కూడా ఖచ్చితంగా పోరాడుతున్నాం అని చెప్పాలి ఈ విషయాల్లో మేం కూడా కలిసొస్తున్నాం అని చెప్పడం కోసం.

నష్టపరిహారం ఏర్పాటు చెయ్యండి హెక్టారుకి కనీసం 10,000 రూపాయలు తగ్గకుండా ఇన్‌పుట్ సబ్సిడీ ఏర్పాటు చెయ్యండి. రబీపంటకి పూర్తిగా కనీసం మీరు నేలలో చెమ్మ ఉంది కాబట్టి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పంటపండే అవకాశం పుష్కలంగా ఉంది. దాన్ని ఉపయోగించండి. ఖచ్చితంగా అనుకున్న అంచనాలకి తగ్గకుండా ధాన్యం పండుతుంది. కాస్త ఒక 3-5% తేడా ఉంటే కొన్ని ప్రాంతాల్లో ఇతర పంటల్లో ఉండవచ్చు.

ఇవాళ కౌలుదారీ చట్టాన్ని గురించిన ప్రస్తావన వచ్చింది. ఇవాళ రైతు నలిగిపోతున్న దానికంటే ఎక్కువ నలిగిపోతోంది కౌలుదారు, గుత్తేదారు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో 80% కమతాలు కౌలుకి కిందఉన్నాయి. పట్నాలకి కుటుంబాలు పొట్టపట్టుకొని వలసపోతుంటే గ్రామల్లో కౌలుకిస్తున్నారు. కౌలుదారు పరిస్థితి బాగుపడాలంటే ప్రస్తుతం ఉన్న కౌలుదారు చట్టం లాభం లేదు అధ్యక్షా! ఎక్కడికో వెళ్ళక్కర్లా. దీన్ని గుర్తించే ఈ సభలో ఆ చట్టం పనికి రాదని గుర్తించారు కాబట్టే ఇవాళ మీరు ఒక ఉదారమైన చట్టం అటు రైతులకు హక్కులు పోకుండా, ఇటు కౌలుదారుకి తాత్కాలిక హక్కులు కల్పించేట్టుగా ఇప్పుడొక దారుణమైన చట్టం చేసి ఆ చట్టం గనక అమలైనట్లైతే రైతుకి హక్కులు లేకుండా చేసి అలా జరుగుతాయి కబట్టే ఒక్క కౌలు కూడా రిజిస్ట్రేషన్ కాకుండా చేసి కౌలుదారుకి ఏ అవకాశం లేకుండా చేశారు అధ్యక్షా! కౌలుదారుకు ఋణాలు ముట్టాలన్నా, నష్టపరిహారం రావాలన్నా క్రాప్ ఇన్సురెన్స్ కావాలన్నా, ఫుడ్ సబ్సిడీస్ అందాలన్నా ఖచ్చితంగా నిన్న మీరు ఏదైతే ఒక చట్టం చేశారో అలాంటి చట్టాన్ని మొత్తం కౌలుదారులకు వర్తించే రీతిని 5ఏళ్ళకి పైన అని కాకుండా ఎంత కాలమైనా సరే సంవత్సరం కావచ్చు, ఆరునెలలు కావచ్చు, ఒక పంట కావచ్చు, 10 పంటలు కావచ్చు కౌలుదారుకి, రైతుకి మా పొలం పోతుందన్న భయం లేకుండా కౌలుదారులకి నిజమైన భద్రత వచ్చే రీతిగా ఆ చట్టాన్ని చేయండి అధ్యక్షా! చాలా కీలక విషయం. ఒక్క రూపాయి ఖర్చు పెట్టక్కర్లా. 60 లక్షల కుటుంబాల కళ్ళల్లో మీరు ఆనందాన్ని నింపిన వాళ్ళవుతారు. క్రాప్ ఇన్సురెన్సు అధ్యక్షా! ఎన్నో గ్రామాల్లో నేను చూశాను. ఒకప్పటి మండలం అన్నాం. గ్రామానికి వెళ్ళాం. ఇప్పుడే పల్లెల రఘునాథరెడ్డి గారు నాకు చెబుతున్నారు. అనంతపురం జిల్లాలో అందరికంటే ఎక్కువ ఇన్సురెన్స్ డబ్బు అందింది. కానీ అదే జిల్లాలో మీరు చూస్తే 2" లక్షల హెక్టార్లు వేరుశనగపంట దెబ్బతింటే. 300 గ్రామాల్లో పదిశాతం మాత్రమే దెబ్బతిన్నదన్న కారణంగా నిజంగా ఇవాళ నష్టపోమోయిన రైతులకి పరిహారం అందే పరిస్థితి లేదు. బలవంతంగా 8% - ప్రతి పక్షం పెద్దలు చంద్రబాబు నాయుడుగారు చెప్పారు. 4" నుంచి 8% దాకా వసూలు చేస్తున్నారు. కానీ నిజంగా పంట నష్టపోతే ఆ గ్రామం మొత్తం నష్టపోలేదు కాబట్టి ఆ పంట లేకపోతే క్రాప్ ఇన్సురెన్స్ ఆ మండలానికి ఆ జిల్లాకి వర్తించలేదు కాబట్టి వాళ్ళకి డబ్బు లేకుండా పోతోంది. కాబట్టి రెండు పనులు ఖచ్చితంగా జరగాలి.

రైతునే యూనిట్‌గా తీసుకోండి. గ్రామంమంతా పోతేనో మండలమంతా పోతేనో ఇస్తామని అంటే - చాలా విచిత్రమైనది అధ్యక్షా ఇది. కార్ ఇన్సురెన్స్ చేస్తే నా కార్ ఇన్సురెన్స్ అయితే, దొంగతనం జరిగితే ఊళ్ళో అన్ని కార్లూ బాగున్నాయి కాబట్టి ఇన్సురెన్స్ ఇవ్వం అనటం లేదే. లైఫ్ ఎన్సురెన్స్ అయితే అబ్బే మీరొక్కళ్ళు, చచ్చిపోతే లాభంలేదు, ఊళ్ళో అందరూ చావలేదు కాబట్టి మీ కొక్కళ్ళకి ఇవ్వం అనటం లేదే. అలాగే ఇళ్ళు కాలితే ఇన్సురెన్స్ పెట్టుకుంటే ఊరంతా తగలడలేదు కాబట్టి మీకు ఇవ్వం అనటం లేదే. రైతుకు కూడా అదే రీతిన ఆఫ్టరాల్, కోటీ ఇరవైలక్షల కమతాలున్నాయి. కోట్ల మంది వ్యక్తులకి ఇన్సురెన్స్ ఇస్తుంటే కోటి కమతాలకి ఎందుకివ్వలేం మనం? రెండు, అది జరిగేలోగా నిర్భంధంగా ఇచ్చేదుండే - క్రాప్ లోన్ తీసుకుంటే మీకు ఇన్సురెన్స్ డబ్బు అందినా అందక పోయినా కూడా మేం మాత్రం వసూలు చేస్తాం అనేది ఉండే - ఆ చట్టాన్ని మార్చండి. ఇవాళ కొన్ని చోట్ల బ్యాంకులు ఇన్సురెన్స్ డబ్బుని మినహాయించుకొని ఇన్సురెన్స్ కంపెనీ కట్టక పోవటం చేత ఇన్సురెన్స్‌కి అర్హత ఉన్నా కూడా అటువంటి కుటుంబాలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. మీకు వాస్తవాలు కావాలంటే వివరాలతో సహ ఇస్తాను. కాబట్టి ఈ రెండు పద్ధతుల్ని మార్చండి. అధ్యక్షా! ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటి యాక్ట్. ఈ పక్కనుంచీ గౌరవమంత్రివర్యులు గతంలో ఆ శాఖను చూస్తున్నటువంటి వట్టి వసంతకుమార్ గారు గానీ, సునీతా లక్ష్మణరెడ్డిగారు గానీ చాలా గర్వంగా చెప్పుకుంటున్నారు. అద్భుతంగా మేం చేశాం అని ఇవాళ వ్యవసాయ రంగానికి ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటి యాక్ట్ అమలు చేస్తున్న తీరు ఆశనిపాతమైంది అధ్యక్షా! ఏ మాత్రం అనుమానం లేదు. ఏ

గ్రామానికైనా మీరు వెళ్ళండి మొట్టమొదటి డిమాండ్ రైతులనుంచి కౌలుదార్ల నించీ "అయ్యా మాకు రేటివ్వండి" రెండో డిమాండ్ "అయ్యా ఈ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటి యాక్ట్‌ను వ్యవసాయ పనులకు సంధానం చెయ్యండి. ఎక్కడైనా అడగండి మీరు. ఏ గ్రామానికైనా వెళ్ళి – అధికార పక్షం వారూ దయచేసి మీరు చూడండి. EGA చేసినటువంటి ఆ నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో నేను సభ్యుడ్ని. లోతుగా ఆనాడు ముందుచూపుతో పరిశీలించి చెప్పాం. కానీ ఆనాడు మాట వినలా! అందుకే ఈనాడు మూల్యం చెల్లిస్తున్నాం.

మెదక్ జిల్లాలో నవాబ్‌పేట గ్రామం ఉట్నూరు మండలంలో మల్లేశం కేవలం రెండు ఎకరాల రైతు. పంట పండింది. అధ్యక్షా! పంట నాశనం కాలేదు. తుఫాను వల్ల నాశనం కాలేదు. పంటబాగా పండింది. ఆయనకేమో ఈ హార్వెస్ట్ తీసుకుపోవటానికి పాపం దారి లేదు. ఇవాళ మీ EGA వల్ల ఏం జరిగిందంటే ఎప్పుడు లేనిదీ హార్వెస్ట్ దర్శన మిస్తున్నాయి. ప్రతి గ్రామంలో కూడా. పంట కొయ్యడానికి మనుషులు కరువయ్యే పరిస్థితి వచ్చేసింది. కానీ ఇక్కడ దారిలేక పోవటం చేత ఆయన హార్వెస్ట్ తీసుకుపోయే అవకాశం లేకపోవటం చేత పంట రేటు ఎంతొస్తుందో తెలీక, కేవలం 650/– రూపాయలకు మించి బస్తా వడ్లకి రేటు రాకపోయే పరిస్థితి ఉండేసరికి తట్టుకోలేక జేబులోంచి డబ్బుపెట్టి దాన్లో సగమో ముప్పాతికో ఇవాళ కొయ్యడం కోసం ఖర్చు పెట్టలేక చేజేతులా పంటని కాల్చేసుకున్నాడు అధ్యక్షా! తన చేతుల్తో తన పంటని కాల్చుకున్నాడు. ఏ గ్రామానికైనా వెళ్ళండి ఇవాళ వ్యవసాయ కూలీ దొరకటం, వ్యవసాయం కోసం పనిచేసే వాళ్ళు అసాధ్యంగా ఉన్నది.

(objection from rural Development minister)

Clarification needed

ఈ చట్టం (NRGS) తీసుకొచ్చినటువంటి జాతీయ సలహామండలిలో నేను సభ్యుడ్ని. బీదల చేతుల్లో డబ్బు అందాలి. కళకళలాడాలి కానీ వ్యవసాయాన్ని నాశనం చేసి, గ్రామాల్ని వల్లకాడు చేసి బీదలు బాగుపడతారు అనుకుంటే తప్పు. ఆ డబ్బంతా చివరికి తాగుడికి వెళ్తోంది. వ్యవసాయాన్ని బాగు చేసి రైతుల చేతుల్లో ఆదాయాన్ని తీసుకొచ్చి, బీదల చేతుల్లో డబ్బులు పెట్టండి. గ్రామాలు కళకళలాడతాయి. ఆదాయం పెరుగుతుంది, బీదరికం పోతుంది. కాబట్టి డిసెంబర్ 17 నుంచి మళ్ళీ EGA పనులు చేపడుతున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. అధ్యక్షా! రైతు ఇంత దారుణమైన, దీనమైన పరిస్థితిలో ఉంటే ఇప్పుడు వ్యవసాయ పనులు ఇంత తీవ్రంగా వేగిరంగా ఉన్న సమయంలో దండిగా వ్యవసాయ కూలీలకి పని దొరకుతున్న సమయంలో మీరు EGA పెడుతున్నారు. మీరు ప్రకటించిన తేదీని మారిస్తే సంతోషం. ఫిబ్రవరి దాకా ఆపండి. దయచేసి ఆలోచించండి. విషయం తెలుసుకోండి, ఆపండి. రెండు–వ్యవసాయ పనుల్ని దీంతో సంధానం చేస్తే అటు బీదలకీ న్యాయం చేస్తారు. 60 లక్షల మంది కౌలుదారులంతా కూడా నిరుపేదలే EGA కింద వచ్చేవారే వారు వీరు రైతులూ కౌలుదారులూ వ్యవసాయ కూలీలూ వేరు వేరు కాదు అధ్యక్షా! వేరు వేరుగా చూసి సమాజాన్ని కుళ్ళబొడుస్తున్నాం అధ్యక్షా!

ప్రశ్న : ఏ రకమైన అనుసంధానం?

జవాబు : వ్యవసాయ పనులకి పంటని బట్టి వరిపంటైతే 20 లేక 25 పనిదినాలు ఇవ్వండి చెరుకు Labourers కి 50 పనిదినాలు ఇవ్వండి. మరో పంటకి ఆ పంటని బట్టి 30 రోజులు ఇవ్వండి ఆ పనిదినాలు EGAలో చేర్చి ఆ డబ్బురైతుల ద్వారా ఆ కూలీలకి ఖచ్చితంగా యాక్ట్ ప్రకారం అందే ఏర్పాటు చేయించండి. బీదల జేబులోకి డబ్బు వెళుతుంది. రైతులకి ఇబ్బంది లేకుండా ఢిల్లీ నుంచి వచ్చే డబ్బుతో న్యాయం చేసినట్టువుతుంది. గ్రామీణ రంగం బాగుపడుతుంది. నిర్దిష్టమైన సూచనలున్నాయి. లోతుకి వెళదామంటే ఆ పని చేద్దాం.

అధ్యక్షా! ధాన్యం మీద 10శాతం పన్నులు ఈ రాష్ట్రం వేస్తోంది. అధ్యక్షా. 5శాతం రూరల్ డెవలప్‌మెంట సెస్ 4 శాతం వివిటి, 1శాతం ధాన్యంగా, 1శాతం మార్కెట్ సెస్. దేశంలో మరెక్కడా ఇంత పెద్ద ఎత్తున పన్నులు లేవు అధ్యక్షా! ఒక్క ధాన్యం సేకరణలోనే బియ్యం సేకరణలోనే 1500 కోట్ల రూపాయలు ఆదాయం పొందుతున్నారు. రూ॥200 బోనస్ ఇస్తే ఇంత పన్నులొస్తున్నప్పుడు ఆ డబ్బుల్లోంచి ఇవ్వండి. కర్ణాటకలో పన్నులు లేవు అధ్యక్షా! ఒక్క మార్కెట్ సెస్ తప్ప. అయినా కూడా వందరూపాయల బోనస్ ఇచ్చారు. రైతులకి ప్రోత్సాహమివ్వండి. ఇక్కడ కన్నీళ్ళు కారుస్తున్న రైతుకి రేటివ్వండి. ఆదాయమొచ్చే ఏర్పాటు చేయండి.

రెండోది మినిమమ్ సపోర్టు ప్రైస్. ఈ రాష్ట్ర ప్రభుత్వంమే అధికారికంగా రూ॥1680 ఒక క్వింటాలు ధాన్యానికి మద్దతు ధర ఇవ్వమని సిఎసిపి వారికి సూచించారు. రూ॥1290 క్వింటాలుకి ఉత్పత్తి వ్యయం అవుతున్నది కాబట్టి కనీసం రూ॥1680 ఇవ్వమన్నారు. 1030 సన్నధాన్యానికి వెళుతోంది కాబట్టి మినిమమ్ సపోర్ట్ ప్రైస్ కనీసం 500 రూపాయలు పెంచాలి అధ్యక్షా!

పంచదారలో మీరు పైసా ఖర్చు పెట్టక్కర్లా స్టేట్ అడ్వైజరీ ప్రైస్ అధ్యక్షా! కనీసం 2500/–కి తక్కువవున్నా మీరు అడ్వైజరీ ప్రైస్ ఇచ్చినట్లైతే గత సంవత్సరం 50 లక్షల టన్నుల పంచదార దిగుమతి చేసుకోవల్సి వచ్చింది. అలాంటి అవసరం లేకుండా అటు పంచదార పరిశ్రమ, ఇటు చెఱుకురైతూ బాగుపడతారు.

పామోలియన్ ఆయిల్ మీరు చెప్పి బలవంతంగా వేయించారు. ఇవాళ 10–15 సంత్సరాల పంటని అమ్మితే భూమి విలువ కాకుండా లక్షన్నర రూపాయలు పలికే పంటని రైతులు కన్నీళ్ళతో దుఃఖాన్ని ఆపుకుంటూ నరికేసి ఎకరానికి నరకటం కోసం 25వేలు ఖర్చుపెడుతున్నారు. నేను ఈ సభలో ఉన్న మంత్రులకీ సభ్యులకీ స్వయంగా చూపెడతాను. అక్కడి నుంచీ పొలంలో వేయాలంటే 10–15 వేలు అవుతుంది బాగా బలమైనటువంటివి. బాగా

బరువుంటుంది ఒక్కో చెట్టు. విపరీతంగా కన్నీరు కారుస్తున్నారు రైతులు. దారుణంగా ఉంది. కారణమేమిటంటే విదేశాల్నుంచీ విపరితంగా దిగుమతులు చేసుకుంటూ రైతుకి రేటు లేకుండా చేశారు. చివరికి వచ్చే కొద్ది రేటులో కూడా - ఏపంటకీ కూడా లేదు అధ్యక్షా! ఇది సభకీ, మంత్రిగారికీ, ముఖ్యమంత్రిగారికీ పూర్తిగా అర్థం కావాలి. పంట అమ్మినవాడు ఎప్పుడూ VAT కట్టక్కర్లేదు అధ్యక్షా కొనేవాడు కట్టాలి. కానీ పామోలిన్ ఆయిల్ విషయంలో పంటను కొనేవాడు కాకుండా ప్రాసిసింగ్ యూనిట్ కాకుండా కేవలం పంటను అమ్మేరైతు మీద - అసలే ధర రాకుండా ఏడుస్తుంటే - 4% VAT వసూలు చేస్తున్నారు అధ్యక్షా!

ఏరియర్స్ ఉన్నాయి 60 కోట్ల రూపాయలు గతం నుంచీ పెద్దలు రఘువీరా రెడ్డి గారు వ్యవసాయ మంత్రిగా ఉన్న కాలం నుంచీ మార్చి 31 నాటికి 26 కోట్ల రూపాయలు ఏరియర్స్ ఉన్నాయి పామోలిన్ రైతులకి మార్చి 31 తరువాత మళ్ళీ 30 కోట్ల రూపాయలకు పైగా ఏరియర్స్ వచ్చాయి. 60 కోట్ల రూపాయలు ప్రభుత్వాలు అధికారికంగా రైతులకి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వక ఆ రైతులు కన్నీరు కారుస్తున్నారు. మీరు ఇవ్వాలి మీకా బాధ్యత ఉంది. చట్టపరంగా ఎమ్ఐ స్కీమ్‌లో ట్రేడ్ ప్రపంచ వాణిజ్య ఒప్పందంలో సంతకం పెట్టినప్పుడు ఈ దేశప్రజలకీ, వ్యవసాయరంగానికీ, రైతులకీ నిర్నిబంధమైన హామీ ఇచ్చిన ప్రభుత్వం దాన్ని ఉల్లంఘించి ఓట్ల వేటలో వ్యవసాయాన్ని ఎలా నాశనం చేస్తోందో బిపిటి ఇవాళ ప్రపంచంలో 1000, 900, 700 తగ్గకుండా పలుకుతోంది. ఇబ్బడిముబ్బడి కర్ణాటక. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బిపిటి ఉంటే మూడేళ్ళ కాలం నుంచీ ఎగుమతి లేకుండా, రైతుకి ధర లేకుండా చేశారు అధ్యక్షా! వెంటనే విధిగా దాన్ని ఎగుమతి చేసే ఏర్పాటు చెయ్యాలి. ఎందుకంటే ఈ వర్షాల వల్ల పంటపోయినా పదిలక్షల టన్నుల కంటే మీకు ఉత్పత్తి తగ్గదు. రబీలో 2050 ఉత్పత్తి పెరగబోతోంది.

ఉప్పుడు బియ్యం 20 లక్షల టన్నులు - మంత్రివర్యులు దయచేసి గమనించాలి. 3 ఏళ్ళ నుంచీ గోడౌన్లలో మూలుగుతోంది. మార్కెట్ లేక. కొనేవాళ్ళు లేక మూడేళ్ళ నుంచీ ఈ వేళ తడిసిన, చెడిపోయిన ధాన్యం ఉప్పుడు బియ్యం రూపంలో మాత్రమే వెళ్ళే అవకాశం ఉంది అత్యధికంగా మీరేం చెయాలన్నా కూడా మరో 20,30 లక్షల టన్నుల ధాన్యం ఉప్పుడు బియ్యం రూపంలో రాబోతోంది. కాబట్టి ఉప్పుడు బియ్యాన్ని ఎగుమతి చేస్తే కీలకమైన అంశం ఇది. వెస్ట్ ఆఫ్రికాలో, సౌత్ ఆఫ్రికాలో, బంగ్లాదేశ్ చాలా డిమాండ్ ఉన్నది. ఒకప్పుడు 50 లక్షల టన్నుల డిమాండ్ ఉంటే మన దేశమే 20 లక్షల టన్నులు అమ్మేది. కావాలని ఎక్స్‌పోర్టు మార్కెట్ లేకుండా నిషేధించి మనం రైతుల్ని నాశనం చేశాం. మార్కెట్ కోల్పోయాం. ఇవాళ మళ్ళీ ఆ డిమాండ్ మనం తీసుకోవాలి. థాయ్‌లాండ్, పాకిస్తాన్, వియత్నాం మననుంచీ కొట్టుకుపోతున్నాయి మార్కెట్‌ని. కాబట్టి వెంటనే ఉప్పుడు బియ్యాన్ని ఎగుమతి చేసే ఏర్పాటు చెయ్యండి. పెద్ద ఎత్తున ఆ కారణంగా ఉప్పుడు బియ్యాన్ని సేకరించండి.

ఇవాళ కాకినాడ పోర్టులో FOB లో డాలర్లు పలుకుతోంది అధ్యక్షా మీరు గనక ఎక్స్‌పోర్టు మార్కెట్‌ను allow చేసినట్లైతే చెడిపోయిన ధాన్యానికి కూడా ఖర్చులేకుండా ఈ దేశం విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించచ్చు.

ఇక ప్రత్తి. నా దగ్గర ఎక్సిబిట్ ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి గారు ఆయన దగ్గర ఉన్న ఎమ్.పిలందరి పలుకుబడి ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువస్తూ ఉత్తరం రాశారు. "ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి ఎగుమతులను ఆపేసెయ్యాలి. అంతే కాదు ప్రత్తి ధరల్ని గణనీయంగా తగ్గించాలి" అని. అధికారికంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ బాగా ప్రత్తిని ఉత్పత్తి చేసేవి. తమిళనాడు అవసరాన్ని ఆయన కాపాడుకుంటున్నాడు. 42 ఎం.పీలు ఈ రాష్ట్రం నుంచీ ఉన్నారు. ఈ నాలుగు రాష్ట్రాల నుంచీ కలిపితే బహుశా 130-140 మంది ఎమ్.పిలు ఉన్నారు. ఒక రాష్ట్రంలో ఆయన తన రాజకీయావసరాల కోసం ఇంత వత్తిడిని తెస్తుంటే మనమంతా కూడా ప్రభుత్వాలూ, పార్టీలూ తేడా లేకుండా కలిసి గట్టిగా పోరాడి విధిగా ప్రతి ఎగుమతి చెయ్యాలి. అంతర్జాతీయ మార్కెట్లో 8వేల రేటుంటే ఈ రేటు కూడా 8వేల రేటు ఇచ్చెయ్యండి. అప్పుడు ఎగుమతి చెయ్యం అంతే కానీ మీరు రేటివ్వకుండా రైతుని చంపేసి మీరు ప్రత్తిని చంపేసి లక్షల ఎకరాల రైతులకు ఆత్మహత్యలు అత్యధికంగా ప్రతి విషయంలో జరిగింది. రాష్ట్రంలో గానీ దేశంలోగానీ అంచేత ఖచ్చితంగా ఎగుమతుల్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి లేదంటే ఎగుమతి రేటిచ్చే ఏర్పాటు చెయ్యాలి.

పామోలిన్ ఆయిల్ మీద ఇంపోర్ట్ డ్యూటి వెయ్యండి. కోటి టన్నులు దిగుమతి చేస్తుంటే, బియ్యం మీద 10% పన్నులు వేస్తున్న ప్రభుత్వం పామోలిన్ ఆయిల్ మీద ఒక్క రూపాయి కూడా దిగుమతి సుంకం లేకుండా చేసి దాని మీద టన్నుకి 16,000 సబ్సిడీ ఇచ్చి, ఇక్కడ వేరుశనగ కానీ నూనె గింజలుకానీ, పామోలిన్ కానీ ఉత్పత్తి చేస్తున్న వాళ్ళందరి కళ్ళల్లో కూడా కారం కొడుతున్నాము అధ్యక్షా!ఇంపోర్టు డ్యూటి 10% వేసి రైతులకి ఇక్కడే ఇదిగోనయ్యా ఇక్కడే పండించండి, దిగుమతి లేకుండా చేసుకుందాం, మీకు ఎంతైనా రేటిస్తాం అని ప్రోత్సహించండి. 10% ఇంపోర్టు డ్యూటి వేసినట్లైతే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

చేప ఆఖరి అంశం అధ్యక్షా! ఫంగేషియస్ చేప అని ఒకటుంది అధ్యక్షా! నాలుగు నెలల క్రితం రాష్ట్రంలో కిలో అరవై రూపాయలు పలికింది. ఇవాళ 30 కూడా లేదు. విత్తనం నుంచీ, బంగ్లాదేశ్ నుంచీ ఒక్క రూపాయి సుంకం లేకుండా దిగుమతి చేసుకుంటున్నారు. మన ప్రభుత్వాలు ఉన్నది వియత్నాం, బంగ్లాదేశ్ రైతుల కోసమా, భారతదేశంలో రైతుల కోసమా? ఇంపోర్ట్ డ్యూటీ వెయ్యండి. ఈ రైతుల్ని కాపాడండి. మార్కెట్ బయట ఉంటే అమ్మనివ్వరు ఇక్కడ మార్కెట్ తక్కువున్నట్టయితే ఇంపోర్ట్ మాకు ధర వస్తుంటే ఇంపోర్ట్ డ్యూటీ లేకుండా చేసి వాళ్ళనుంచీ పోటీ తీసుకువచ్చి రైతును చంపేస్తున్నారు. ఇంతకంటే దారుణం మరొకటి

లేదు. ఈ నేపథ్యంలో నిరుడు అక్టోబర్‌లో (కాస్ట్ ఎక్స్‌బిట్) 1వ తేదిన 25 లక్షల క్యూసెక్కులు కృష్ణానదిలో ప్రవాహం వచ్చింది. చరిత్రలో ఎప్పుడూ విననంత దానికి ప్రభుత్వాన్ని నిందించం. నేను బహిరంగంగానే సమర్థించాను ప్రభుత్వాన్ని ఎందుకంటే ఆశనిపాతంలాగా అసాధారణమైనటువంటి ప్రకృతి వైపరీత్యం వస్తే ప్రభుత్వానికి ఏమీ ఉపయోగం లేదు. కానీ ఈ సంవత్సరం 25 లక్షలు రావచ్చు. వచ్చే ఏడు రావచ్చు ఆపైన ఏడు రావచ్చు. ఏ విజ్ఞత గల ప్రభుత్వమైనా చెయ్యాల్సింది. ఈ సారి 25 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినట్లైతే ఇదిగో మీకు కరకట్టలు తెగకుండా కాపాడుకుంటాం అని ఖచ్చితంగా ఏర్పాట్లు చెయ్యాలి. లేకపోతే ప్రభుత్వం ఉనికికి అర్థం లేదు. నేను ప్రధాన మంత్రి దృష్టికి తీసుకొస్తే కేంద్ర ప్రభుత్వం నుంచీ నాలుగు పేజీల సుదీర్ఘమైన లేఖ నాకు రాశారు. “ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనతో వస్తే మేం డబ్బు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం” అని. ఏదీ ప్రతిపాదన? కాదు అధ్యక్షా అధికారికమైన లెటర్ ముఖ్యమంత్రిగారికి ఆగస్టు నెలలో కేంద్ర ప్రభుత్వం నుంచీ వచ్చిన లేఖతో పాటు ఉత్తరం రాశాను అధ్యక్షా! వారిని కలిసి చెప్పాను ఇంతవరకు అతీ గతీ లేదు. 25 లక్షల క్యూసెక్కుల వరదొస్తే 15లక్షల క్యూసెక్కులకి మేము ఏదన్నా చేస్తాం అని ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ఎంత హాస్యాస్పదం! ఈ సారి నిరుడంటే అదృష్టవశాత్తూ నాగార్జున సాగర్ గానీ లేదంటే శ్రీశైలం గానీ మొదట్లో నిండలేదు గానీ, అవీ నిండే దాకా వరదని తట్టుకున్నాయి కాబట్టి, ఆ తర్వాత వర్షం ఆగిపోయింది. కాబట్టి తట్టుకున్నాం. అధ్యక్షా! ప్రభుత్వం గొప్పతనం వల్ల కాదు. ప్రకృతి మనల్ని కరుణించింది. ఈ ఏడాదే గనక ఈ రెండు రిజర్వాయర్లూ నిండిన తరువాత 25 లక్షల క్యూసెక్కుల నీళ్ళచ్చినట్లైతే ఇక కృష్ణా, గుంటూరు, నల్గొండ, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలను మనం పట్టలేం. ఆ జిల్లాలను రక్షించుకోలేం. లక్షలమందిరైతులు నాశనమైపోతారు. వందలాది గ్రామాలు జలమయమైపోతాయి. ఇప్పటికైనా మేల్కొనండి. దయచేసి కేంద్రం డబ్బులిస్తామంటోంది. ఈ పథకాల్ని చేపట్టండి. పనికిరాని పథకాలకి ఒక్క చుక్క నీళ్ళు రాకుండా, దోసెడు నీళ్ళు రాకుండా కొద్దిపాటి మట్టి తట్టెడు మట్టి కూడా తియ్యకుండా, వెయ్యికోట్ల రూపాయలు మీరు అవలీలగా మొబులైజేషన్ చేస్తున్నారే. అలవోకగా డిజైన్స్ కోసమే చేస్తున్నారే. అదే 5 జిల్లాల్లో పదుల లక్షల కుటుంబాల్ని ఆదుకోవటానికీ, వేలాది మంది ప్రాణాల్ని కాపాడటానికీ పదులలక్షల ఎకరాల భూమిని రక్షించుకోవడానికీ, ఢిల్లీ డబ్బులిస్తామంటే... దయచేసి ఆ పని చెయ్యండి.

ఈ సభలోనే గతంలో అధ్యక్షులుగా ఉన్నటువంటి మర్రిచెన్నారెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 20 ఏళ్ళ క్రితం ఆయన తెలంగాణా ప్రాంతానికి చెందినా, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఈ డ్రైనేజి సమస్యను గుర్తించి పాకిస్థానీయుడు ఒకాయన ఆనాడు ప్రపంచ బ్యాంక్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా ఉంటే ఆయన్ని ఒప్పించి మొయినుద్దీన్ అమీన్ ఖురేషీ – తరువాత ఆయన పాక్ ప్రధానమంత్రి అయ్యాడు – ఆయన్ని ఒప్పించి కృష్ణా గోదావరి డెల్టాల్లో ఇరిగేషన్ డ్రైనేజీకి పూర్తిగా పునర్వ్యవస్థీకరణ కోసం ఏర్పాట్లు చేశారు. ఇవాళ డిసెంబర్‌లో ఇంత వర్షం పడితే డ్రైనేజీ సరిగ్గా ఉంటే ఇన్ని ఎకరాలు నాశనం కావే? ఇక్కడేమీ గాలి రాలేదే? ఈ సంవత్సరం తుఫాన్లో కూడా గాలి రాలేదే. డ్రైనేజీ వ్యవస్థ సరిగా ఉంటే– ఒకప్పటి పంజాబ్‌లో – ఆనాడు ప్రతాప్ సింగ్ కైరాన్ ముఖ్యమంత్రిగా సర్‌చౌతురామ్ వ్యవసాయమంత్రిగా డ్రైనేజీ చేపట్టారు అధ్యక్షా ఈనాడు డ్రైనేజీ సరిగ్గా ఉంటే తక్కువ ఖర్చుతో వందల కోట్ల, వేలకోట్ల పంటను రక్షించేవాళ్ళం. 20 ఏళ్ళైంది. ఆలస్యమైనా, మళ్ళీ పునర్వ్యవస్థీకరణ పనులు చేపట్టండి.

ఉత్పాదకత పెంచటం కోసం కొన్ని అంశాలున్నాయి. దాన్లోకి నేను వెళ్ళను. మీరు చాలా impatient గా ఉన్నారు కాబట్టి తెలంగాణ ప్రాంతంలో మార్కెట్‌ను చూసినట్లైతే పదిరోజుల పాటు నిరుపేద మహిళలు అక్కడ – నేను దుబ్బాకలో స్వయంగా చూశాను. పెద్దలు ముత్యం రెడ్డి గారి Constituency లో ఇతర ప్రాంతాల్లో చూశాను. ధాన్యం గవర్నమెంటు ఏ రేటిస్తే ఆ రేటుకి అమ్ముకోవడం కోసం 10 రోజుల పాటు అక్కడ ఉంటుంటే పందికొక్కులు, పందులు, కొన్ని చోట్ల గాడిదలు ఏ రక్షణ లేకుండా, వాళ్ళకి ఏరకమైన బాత్‌రూమ్స్ లేవు. డ్రైనేజ్‌లు లేవు – ఇందాక హరీష్‌రావుగారు చెప్పారు. ఈ రోజుల్లో చెమ్మ ఉందని electrical driers లేకపోవడం ఏమిటి అధ్యక్షా! అలాగే Weighing machines లేవు. వెంటనే ప్రతి మార్కెట్‌యార్డులో ఈ పని చెయ్యండి. ప్రజల డబ్బుతోనే రైతులు డబ్బిస్తున్నారు. మార్కెట్ సెస్ వందల కోట్లరూపాయలు మూలుగుతోంది. ఆ పని చెయ్యండి అధ్యక్షా! దయచేసి వ్యవసాయరంగంలో గ్రామీణ ప్రాంతంలోని సంక్షోభాన్ని వెంటనే ఎదుర్కొండి. ఎదుర్కోకపోయినట్లైతే – నేను Cataslysmic గా మాట్లాడటం లేదు, apocalyptic గా మాట్లాడటం లేదు, నిజంగా అత్యంత తీవ్రమైన, దయనీయమైన స్థితిగతులు దీర్ఘకాలంగా ఉన్నాయి. రాజకీయ అస్థిరత తప్పదు, సామాజిక అశాంతి తప్పదు, ఆర్థిక సంక్షోభం తగ్గదు. కాబట్టి రైతుల కోసం, కౌలుదార్ల కోసం కాదు. ఆ గ్రామాల్నించీ లక్షలాదిగా పొట్ట చేతబట్టుకొని తరలి పోతున్న యువత కోసం కాదు, మన భవిష్యత్తు కోసం, మన రాష్ట్రం కోసం, దేశంకోసం. ఆర్థిక వ్యవస్థ బతకటం కోసం ఈ దేశం సగర్వంగా నిటబడటం కోసం ఇవాళ వ్యవసాయాన్ని ఆదుకోకపోతే దీర్ఘకాలిక, స్వల్పకాలిక చర్యలు కలిపి తీసుకోకపోయినట్లైతే ఈ మాటలు మిగులుతాయి కానీ చేతలుండవు. తాత్కాలికంగా కన్నీళ్ళు తుడిచే ప్రయత్నమే తప్ప దీర్ఘకాలిక చర్యలుండవు. ఎప్పటికీ పరకెండిపోకుండా ఇప్పటికైనా మేలుకొని మనందరం కలిపి ఆ చర్యలు తీసుకుంటామని ఆశిస్తూ ఈ అవకాశమిచ్చిన మీకు నమస్కరిస్తూ సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా! ❍



# మార్చేది మీరే

**జేపీతో ముఖాముఖి**

- **యువనాయకత్వం అంటే వారసత్వ రాజకీయం కాదు**
- **ఆదాయం కోసం ఆదర్శాలను వదులుకోవాల్సిన అవసరం లేదు**
- **యువతలో నైపుణ్యాన్ని పెంచే ప్రభుత్వ విధానాలు రావాలి**

*బంగారు భారతాన్ని ఆవిష్కరించే సత్తా నేటి తరానికి ఉందని అన్నారు జయప్రకాష్‌నారాయణ్. ప్రతి సమాజంలో మార్పు అనివార్యమని, అయితే ఎలాంటి మార్పు కావాలన్నది యువతరం నిర్ణయించుకోవాలన్నారు. సమాజహితమైన మార్పు కోసం ప్రయత్నించకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తే అనారోగ్యకరమైన మార్పును అనివార్యంగా ఆహ్వానించాల్సి వస్తుందన్నారు. ఆత్మవిశ్వాసం., ఆత్మగౌరవం ఏ సమయంలో కూడా వదులుకోవద్దని యువతరానికి సూచించారు జయప్రకాష్‌నారాయణ్.*

**ప్ర : యువనాయకత్వం అంటే వారసత్వ రాజకీయమే అన్న ధోరణి నేటి రాజకీయాల్లో ఉంది. ఇంతకు మించి వేరే ప్రత్యామ్నాయం లేదా?**

**జేపీ :** యువతకు నాయకత్వం అంటే ఫలాన నాయకుడి కొడుకో... కూతురో అనే భావన ప్రస్తుతం నడుస్తోంది. వేల కోట్లు సంపాదించే నాయకులు ధనంతోపాటు రాజకీయాన్ని వారసత్వంగా కట్టబెడుతున్నారు. ఈ వైఖరిలో మార్పురావాలంటే 'వ్యక్తి సుఖం.. సమాజ హితం' రెండూ కాంక్షించే నవతరం రావాలి. ప్రజలపై ఆలోచన... ఆర్తిని పెంపొందించుకోవాలి. డబ్బు ప్రలోభాల నుంచి యువతరం బయటకు రావాలి. డబ్బే అన్నిటికీ పరమార్థం కాదు. మన సమాజాన్ని ఉన్నతంగా ఉంచినప్పుడే మనకు గౌరవం అన్న విషయాన్ని గుర్తెరిగితే నేటితరం రాజకీయాల్లో తప్పనిసరిగా రాణించగలుగుతారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా రాజకీయాల్లో రావద్దు. అలా చేస్తే దేశానికి... సమాజానికి భవిష్యత్తు తరాలకు.. తీరని ద్రోహం చేసినవారవుతారు.

**ప్ర : నేటితరం ఆదాయమార్గాలను అన్వేషిస్తుందే కానీ ఆదర్శాలను పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. దీనిపై మీ విశ్లేషణ?**

**జేపీ :** ఆదాయం వేరు ఆదర్శం వేరు కాదు. 'కాలే కడుపులకు అన్నం పెట్టకుండా దేవుడు, దేశం అంటూ నీతి బోధ చేస్తే ప్రయోజనం లేదు. ముందు వారి ఆకలి తీర్చు' అంటాడు స్వామి వివేకానంద. ఆదాయం, ఆదర్శం కలిసి నడవాలి. నేటి యువతరం కాలే కడుపులతో ఉన్నారు. వారి ఆకలి తీర్చుకునే ఆదాయమార్గంతోపాటు, ముందు తరాలకు ఆకలి తీర్చే ఆదర్శ మార్గాన్ని కూడా యువతరం అనుసరించాలి.

**ప్ర : ఇంజనీరింగ్ విద్యపై మోజుతో ఇతర విద్యావిభాగాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీని ప్రభావం మున్ముందు ఎలా ఉండబోతుంది?**

**జేపీ :** సాఫ్ట్‌వేర్ బూమ్‌లో ఇంజనీరింగ్‌లోని మిగిలిన విభాగాలు కూడా బాగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఎప్పుడైనా సమాజంలో సమతుల్యత ముఖ్యం. సాఫ్ట్‌వేర్ బూం కారణంగా తర్వాతి కాలంలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణుల కొరత ఏర్పడే ప్రమాదముంది. ప్రభుత్వం అన్నిటికీ సమానస్థాయిలో ప్రోత్సాహకాలు అందించాలి. మౌళికసౌకర్యాలు కల్పించాలి. సమాజం బాగుండాలంటే ప్రాథమికస్థాయి నుంచే విద్యను పటిష్టపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్ర: ఉపాధికల్పనలో వైఫల్యం యువతను పక్కదోవ పట్టించడంతోపాటు వేరే దేశాలకు వలసపోయేందుకు కారణమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే ఏం చేయాలి?**

**జేపీ :** గత పదిహేను సంవత్సరాల్లో చైనా 14 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తే మన దేశంలో కేవలం 30 లక్షల మందికి ఉపాధి కల్పించగలిగాం. మన వద్ద ఉపాధి అవకాశాలున్నాయి. నిరుద్యోగ యువత ఉన్నారు. వీరి మధ్య లింకు లేదు. ఉపాధి హామీ పనుల పేరిట గుంతలు తవ్వేందుకు వేల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పైసా ఖర్చు పెట్టడం లేదు. ఈ ఓటు బ్యాంకు విధానాలు మారితేనే దేశానికి భవిష్యత్తు ఉంటుంది. అది మారాలంటే యువతరం నడుం బిగించాలి.

**ప్ర : యువజనదినోత్సవం సందర్భంగా యువతరానికి మీరిచ్చే సందేశం.**

**జేపీ :** ఆత్మగౌరవం.. ఆత్మవిశ్వాసం నేటి తరానికి రెండు కళ్లు కావాలి. కులం.. వర్గం.. ప్రాంతం.. వంటి పదాలకు దూరంగా ఉండండి మన జాతి అనే భావనను పెంపొందించుకోండి. విజ్ఞత, విద్య, నైపుణ్యం, శక్తి లేకుండా ఏం చేయలేం. వాటి సాధనకు కృషి చేయండి దేశం పట్ల దేశప్రజల పట్ల ప్రేమను ఆర్తిని పెంచుకోండి. మన కుటుంబాన్ని ఎంత ప్రేమిస్తామో మన దేశాన్ని ప్రజలను అదే స్థాయిలో ప్రేమించండి. భావితరాలకు బంగారు భారతాన్ని కానుకగా ఇచ్చిన ప్రతిష్ఠ మీ సొంతమవుతుంది.

**ప్ర : : వ్యవసాయరంగం వైపు యువత ఆకర్షితులు కాకపోవడానికి కారణాలు ఏమిటి?**

**జేపీ :** ఎక్కడైనా లాభసాటిగా ఉంటే ఎవ్వరైనా ఆవైపు దృష్టిసారిస్తారు. వ్యవసాయరంగం పట్ల ముందుగా మన ప్రభుత్వాలు వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దాలి. ఎవరికైనా ఉన్న ఊరిని వదిలి వెళ్ళాలని ఉండదు కదా? ఉన్న ఊరిలోనే ఉపాధి దొరకాలంటే వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ఊపందుకోవాలి. ఇవన్నీ జరిగితే యువతరం కూడా వ్యవసాయం వైపు చూస్తుంది. ❍

**(ఈనాడు సౌజన్యంతో...)**

# భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది... ఇకనైనా సరైన కార్యాచరణతో కదలండి

## జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు జేపీ బహిరంగ లేఖ

*"మీకూ, దేశానికీ ఉజ్వల భవిష్యత్తు కావాలంటే సరైన దిశగా కార్యాచరణకు ఈవేళే శ్రీకారం చుట్టండి" అని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ యువతకు పిలుపునిచ్చారు. జనవరి 12, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతనుద్దేశించి జయప్రకాష్ నారాయణ్ రాసిన బహిరంగలేఖ:*

**మిత్రులారా,**

జనవరి 12, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.

భారతదేశ జనాభాలో 73శాతం యువత ఉన్నారు. 35 ఏళ్లు పైబడినవారికున్న ఆరుశాతంతో పోలిస్తే 94శాతం భవిష్యత్తు మీదే.

5,000 సంవత్సరాల అవిచ్ఛిన్న సంస్కృతి, నాగరికతకు మీరు వారసులు. భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చే కృషిలో మీరే కీలక భాగస్వాములు.

స్వాతంత్ర్యానంతరం ఎన్ని లోపాలు, సవాళ్లు ఉన్నా మనం ఒక దేశంగా నిలదొక్కుకున్నాం. ప్రజాస్వామ్యాన్ని, సమైక్యతను, లౌకికవాదాన్ని పెంపొందించుకున్నాం. ఆర్థికమాంద్యాన్ని అధిగమించి అభివృద్ధి పథంలో వేగం పుంజుకుంటున్నాం.

మీకు, దేశానికి ఉజ్వల భవిష్యత్తు కోసం మీరు సంపదసృష్టిలో భాగస్వాములు కావాలి. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు ఉంటేనే మీరు ఇది సాధించగలరు. మీ భవిష్యత్తును మలచుకునేందుకు మీరు సంసిద్ధులు కాకపోతే అభివృద్ధిని, రాజ్యాంగం ఇచ్చే గ్యారంటీలను అందుకోలేరు. జ్ఞానం, నైపుణ్యాలు ఉన్నవారిదే, సమాజానికి వస్తువుల్ని, సేవల్ని ఉత్పత్తి చేయగలిగినవారిదే ఈవేళ భవిష్యత్తు.

నాణ్యమైన విద్య, నైపుణ్యాలను సంపాదించాకకూడా మీరు రాజకీయాలలో ఆసక్తిని చూపుతూ బాధ్యతాయుతమైన పౌరునిగా, ఓటరుగా రూపుదిద్దుకోవాలి. గాంధీజీ చెప్పినట్టు... రాజకీయాలు జీవితంలోని ప్రతి రంగంలోనూ వ్యాపించి, పాము చుట్టల్లా మిమ్మల్ని విడవకుండా ప్రభావితం చేస్తుంటాయి. మీ చుట్టూ ఉన్న పరిస్థితులను మెరుగుపరిచేందుకు మీరు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాల్సిందే. కానీ అధికార, ముఠా రాజకీయాలను, రోజువారీ దూషణల, ద్వేషాల రాజకీయాలను తలకెక్కించుకోకండి. రాజకీయాలు సమాజానికి సేవకునిగా ఉండాలి తప్ప సమాజానికి యజమానులుగా మారకూడదని గుర్తించాలి. రాజకీయాలు మన జీవితంలో కీలకపాత్ర పోషిస్తాయి తప్ప మన జీవితాల మీద ఆధిపత్యం చెలాయించకూడదు. తలెత్తుకుని హుందాగా జీవిస్తూ, మీ శక్తిసామర్థ్యాలను వికసింపజేసుకోవటం కోసం మాత్రమే మీ జీవితం.

అవినీతి ఈవేళ విచ్చలవిడి మహమ్మారిలా మారటం, రోజువారీ జీవితంలోనూ అడుగడుగునా కన్పించటం మీ అందరికీ తెలుసు. ప్రభుత్వాల్ని, రాజకీయ పార్టీల్ని, శాసనసభ్యుల్ని, ఉన్నత న్యాయవ్యవస్థను, మీడియాను అవినీతి మసిబార్చింది. అవినీతిని సహించటమంటే, మీ అభివృద్ధిని కాలరాసుకోవటమే. మీ అభివృద్ధిని పణంగా పెట్టే రాజకీయాల్లో, పాలనారంగంలో ఉన్న కొద్దిమంది యధేచ్ఛగా దోపిడీ చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు.

అవినీతిపై పోరాటంతోపాటు, దేశ సమైక్యత, సమగ్రత కోసం కూడా మీరంతా కృషి చేయాలి. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషాన్ని, హింసను రెచ్చగొట్టే శక్తుల చేతిలో మీరు పావులు కావద్దు. మనం కలలు కంటున్న భారతదేశం ఏ కులం, ప్రాంతం, మతం, తెగ లేదా భాష కన్నా గొప్పది. ముక్కలుకన్నా మొత్తం గొప్పది. భారత్‌ను ముక్కలు చేస్తున్న 'సంకుచిత దేశీయ అడ్డుగోడల్ని' కూల్చటం మీ బాధ్యత. మన మాతృదేశ ఐక్యత, సమగ్రతను సుస్థిరపరచుకోవటం, ద్వేషం, అసూయ లేకుండా భారతీయులందరి మధ్య సహోదరభావాన్ని పెంపొందించటం మీ భవిష్యత్తు నిర్మాణానికి ఈవేళ అత్యంత కీలక ప్రాధాన్యతాంశాలు.

మన జాతీయ యువజన దినోత్సవానికి స్ఫూర్తినిచ్చిన వివేకానందుడినే ఆదర్శంగా తీసుకోండి. భారతదేశ ఆధ్యాత్మిక విజ్ఞతను, జాతీయతకు ప్రాతినిధ్యం వహించిన అత్యుత్తమ భారతీయుల్లో ఆయనొకడు.

వివేకానంద చెప్పినట్టు, 'మనం ఈవేళ ఉన్న స్థితికి మనమే కారణం. మనం ఎలా ఉండాలనుకుంటున్నామో అలా మనల్ని తీర్చిదిద్దుకునే శక్తి మనలో ఉంది. మనం ఇప్పుడున్న స్థితికి మన గత చర్యలే కారణమైనప్పుడు, మన ప్రస్తుత చర్యలే మన భవిష్యత్తును రూపొందిస్తాయి. కాబట్టి ఎలా వ్యవహరించాలో మనం స్పష్టంగా తెలుసుకోవాలి.'

మీకు, దేశానికి ఉజ్వల భవిష్యత్తుకు సరైన కార్యాచరణను ఈవేళే ప్రారంభించండి. ❍

**స్వేచ్ఛ ఇవ్వబడదు - తీసుకోబడుతుంది**

– నేతాజీ

# సామాన్య యువత పెద్దఎత్తున రాజకీయాల్లోకి రావాలి

■ **అవినీతి అంతం, ఎన్నారైలకు బ్యాలెట్ ఓటింగ్‌కు పీపుల్ ఫర్ లోక్‌సత్తా ప్రచారోద్యమం**

దేశంలో పెచ్చరిల్లిన అవినీతి, దోపిడీ రాజకీయ సంస్కృతి తమకెంతో ఆందోళన కలిగిస్తున్నాయని, అవినీతిని అంతం చేసి, రాజకీయాల్ని ప్రక్షాళన చేసేందుకు పోరాటాన్ని విస్తృతం చేస్తామని ప్రవాస భారతీయుల సంస్థ 'పీపుల్ ఫర్ లోక్‌సత్తా' (www.peopleforloksatta.org) తెలిపింది. 2-జీ స్పెక్ట్రం కుంభకోణం నేపథ్యంలో అవినీతి అంతానికి చేపట్టిన 'కిల్ కరప్షన్' ప్రచారోద్యమాన్ని, భారత రాజకీయాల్లో తమ వంతు పాత్రకు ఎన్నారైలకు బ్యాలెట్ ఓటింగ్ కోసం చేస్తున్న పోరాటాన్ని జనవరి 7నుంచి ఢిల్లీలో జరిగే ప్రవాస భారతీయ దివస్‌లో తమ ఎజెండాగా వినిపిస్తామని, సంస్కరణల కోసం మద్దతు కూడగడతామని పేర్కొంది.

పీఎఫ్ఎల్ నేతలు పద్మ భూపతిరాజు, మానస మహతి, శరత్ మంగళపల్లి, భారత్‌లో పీఎఫ్ఎల్ సమన్వయకర్త అట్లూరి సుభాషిణి పీఎఫ్ఎల్ కార్యక్రమాలను, భవిష్యత్తు కార్యాచరణను జనవరి 5 న ప్రకటించారు.

పీఎఫ్ఎల్ సభ్యులు మాట్లాడుతూ... తాము అమెరికాలో ఉంటున్నా, భారతదేశంలో తమ మూలాల్ని మర్చిపోలేదని, రాష్ట్రంలో కొన్ని గ్రామాల్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు లోక్‌సత్తా పార్టీ తరుపున కృషి చేస్తామని తెలిపారు. ఈవేళ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే కులం, మతం, ప్రాంతం, భాషతో సంబంధంలేకుండా రాజకీయ విధానాలు కావాలని, అందుకోసం పోరాడేందుకు యువత ముందుకు రావాలని కోరారు. తామంతా డబ్బు, కుటుంబ నేపథ్యంతో సంబంధం లేకుండా లోక్‌సత్తా వేదికగా పనిచేస్తున్నామని, సామాన్యులకు అవకాశం కలిపించే లోక్‌సత్తా పార్టీని ఉపయోగించుకుని రాజకీయాల్ని మార్చేందుకు యువత పెద్దసంఖ్యలో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈవేళ దేశం ఎలా పోయినా పట్టించుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

2006లో లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించినప్పుడు ఒక చిన్న గ్రూపుగా ప్రారంభమైన పీఎఫ్ఎల్, 2009, ఫిబ్రవరిలో రిజిస్టర్ అయి 9 దేశాలకు.. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, జర్మనీ, న్యూజీలాండ్, స్వీడన్, స్విట్జర్లాండ్‌లకు విస్తరించిందని తెలిపారు. అమెరికాలోని బే ఏరియా (కాలిఫోర్నియా), లాస్‌ఏంజిల్స్, న్యూజెర్సీ, బోస్టన్, హూస్టన్, డల్లాస్, షికాగో, వాషింగ్టన్ డి.సి, సియాటెల్ తదితర ప్రాంతాల్లో పీఎఫ్ఎల్‌కు 30కి పైగా శాఖలున్నాయన్నారు.

'కిల్ కరప్షన్' ప్రచారంలో భాగంగా, 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేసి ఖజానాకు కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలని, అవినీతికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని, అటువంటి కుంభకోణాలు భవిష్యత్తులో జరగకుండా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని పీఎఫ్ఎల్ సభ్యులు కోరారు.

అలాగే ఎన్నారై ఓటింగ్ హక్కుకు సంబంధించి ప్రస్తుత బిల్లు తాము స్వయంగా వచ్చి ఇక్కడ ఎన్నికల్లో ఓటు వేయటం తప్పనిసరి చేస్తోందని, దానికి బదులు బ్యాలెట్ ఓటింగ్‌ను ఎన్నారైలకు కల్పించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతూ కూడా పీఎఫ్ఎల్ ఒక ప్రచారోద్యమాన్ని ప్రారంభించినట్టు వారు తెలిపారు.

2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ తరపున పీఎఫ్ఎల్ ప్రచారం చేసింది. 2010 మే, జూన్ నెలల్లో అమెరికాలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తో 'భారత్‌కు పునరుత్తేజం' పేరుతో ఎన్నారైలతో సమావేశాలను పీఎఫ్ఎల్ నిర్వహించింది. సుపరిపాలన, మంచి రాజకీయాలు అనే రెండు అంశాల మీద అక్కడ వివిధ నగరాల్లో జరిగిన ఆ కార్యక్రమాల్లో 10,000మందికి పైగా ఎన్నారైలు పాల్గొన్నారు.

**మిగిలిన పార్టీల విదేశీ శాఖలకు పీఎఫ్ఎల్ పూర్తి భిన్నమైనది: జేపీ**

జేపీ మాట్లాడుతూ... రాజకీయ పార్టీలకు విదేశాల్లో ఉన్న శాఖలకు పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్ఎల్) పూర్తి భిన్నమైనది. ఎన్నికల్లో టికెట్ల కోసం డబ్బు పట్టుకుని వచ్చే సంస్కృతి ఇక్కడ ఉండదు. అలాగే సాంప్రదాయ రాజకీయ పార్టీలలోలాగా కమ్మ, రెడ్డి, కాపు, తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ అనే భేదాలు పీఎఫ్ఎల్‌వారిలో కన్పించవు. వారిలో 80-90శాతం వరకూ యువతీయువకులే ఉన్నారు. దేశంలో కుళ్లిపోయిన రాజకీయాల్ని మార్చాలనే ఒకే ఒక్క లక్ష్యంతో తనకంటే మిన్నగా లోక్‌సత్తా పార్టీ వేదిక మీద వారు పనిచేస్తున్నారన్నారు.

2-జీ స్పెక్ట్రం కేసులో లైసెన్సుల్ని రద్దు చేసి, తిరిగి అంతర్జాతీయ పోటీబిడ్డింగ్ ద్వారా కేటాయించాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో లింగ్డో, గోపాలస్వామి, కృష్ణమూర్తి, అడ్మిరల్ తహిల్యాని, రెబీరో తదితర నిజాయతీకి మారుపేరైన జాతీయ స్థాయి ప్రముఖులతో కలిసి సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ అడ్మిట్ అయింది. జనతా పార్టీ నేత సుబ్రమణ్యస్వామి తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా అందులో కలపవచ్చు. రాబోయే కాలంలో అవినీతిని కట్టడి చేసేందుకు కొన్ని నిర్దిష్ట ఏర్పాట్లకు ఈ పోరాటం నాంది పలుకుతుంది. బోఫోర్స్ కుంభకోణం మీద 23 ఏళ్ల తర్వాత కూడా చర్చిస్తున్నామంటే, సీబీఐ వంటి నేరపరిశోధనా సంస్థలకు స్వయంప్రతిపత్తి లేకపోవటమే. ❍

# రైతులు పంట పండించడం మానేస్తే

- పి. జగన్నాథం నాయుడు

గోధుమలు కావాలంటే ఇతర దేశాల నుంచి అయినా దిగుమతి చేసుకోవచ్చు. వరి పంట అలా కాదు. ప్రపంచ దేశాలలో ఎక్కడా మిగులు పంట లేదు. గిట్టుబాటు ధర లభించడం లేదని రైతు వరిపంట పండించడం మానేస్తే జనం 'అన్నమో రామచంద్రా' అని అల్లాడాల్సిందే. గోధుమల కన్నా వరి ఉత్పత్తి ధర ఎక్కువయిన మద్దతు ధర మాత్రం 1030 రూపాయలే ఉంది. ఈ ధర గోధుమలకు ఇచ్చే ధర కన్నా 325 రూపాయలు తక్కువ. వ్యవసాయం దండగ, లాభం లేదనుకుని రైతు వరి పండించడం మానేస్తే దేశం ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఇప్పటికే పచ్చటి పైర్లతో కళకళలాడాల్సిన పంట పొలాలు చేపలు, రొయ్యలు సాగుకు ఇతర పంటల కిందకు మార్చివేస్తున్నారు. అలా కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో ఇప్పటికే రెండు లక్షల ఎకరాల మేర డెల్టాలో వరిపంట సాగుచేయడం మానేశారని రైతు నాయకులు చెబుతున్నారు.

1960 ప్రాంతంలో హరిత విప్లవ కాలంలో దేశంలో సగటు తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి 179 కిలోగ్రాములు ఉంటే ప్రస్తుతం అది 174 కి.గ్రా. లకు పడిపోయిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది. తలసరి పప్పుధాన్యాల ఉత్పత్తి 1960 లలో 19 కిలోలు ఉండగా ప్రస్తుతం 12 కిలోలకు చేరింది. ఒకవైపు జనాభా పెరుగుదల ఏటా 8 శాతం ఉంటే ఆహార ధాన్యాల వృద్ధిరేటు 8 శాతం తగ్గిపోతున్నదంటే వ్యవసాయరంగంలో ఎంతటి ప్రమాదకరమైన ధోరణులు ప్రబలుతున్నాయో అర్థమవుతుంది. ఇదే పరిస్థితి మరో నాలుగైదు సంవత్సరాలు కొనసాగితే 2011-12 నాటికి తిండిగింజల కోసం విదేశాలవైపు ఎదురుచూడాల్సి వస్తుందని, రైతుల ఆత్మహత్యల పరంపర సాగుతూనే ఉంటుందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే యువకులు వ్యవసాయ క్షేత్రాలవైపు, పొలాలవైపు వెళ్ళడం లేదు. వ్యవసాయ రంగం వైపు కన్నెత్తి చూడటానికి కూడా యువతరం మొగ్గు చూపడం లేదు. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతాంగం వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వవలసిందిగా ప్రొఫెసర్ స్వామినాథ కమిషన్‌ను నియమించడం, ఆయన నివేదికను అందజేసినా, కేంద్రం ఆయన సిఫార్సులను పక్కకు పెట్టడమే ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం ద్వారా రైతుల ఆత్మహత్యలు నివారించాలని ఆయన సూచించారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అధ్యయనానికి వీలుగా యుపిఏ ప్రభుత్వం ఎం.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలో నియమించిన జాతీయ రైతు కమిషన్ 60 కోట్ల వ్యవసాయ కుటుంబాలకు సంబంధించి ఇచ్చిన నివేదికపై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం చూస్తే రైతాంగం పట్ల పాలకులపై ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం అవుతుంది.

వ్యవసాయం అభివృద్ధి జరగాలంటే రైతులకు కనీస నగదు ఆదాయం సమకూర్చాలి. వారి ఆదాయాభివృద్ధినే వ్యవసాయాభివృద్ధికి సూచికగా పరిగణించాలని డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సూచించారు. ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి కనీస గిట్టుబాటు ధరగా నిర్ణయించాలని ఆయన సిఫార్సు చేశారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా పంటల కనీస మద్దతు ధర సమాన నిష్పత్తిలో ఉండాలన్నారు. పంటల కోతల తరువాత ఉత్పాదక ఖర్చు (పొలంలో తొలి దుక్కి మొదలు, సాగు, విత్తనం, నాట్లు, నీరు, ఎరువులు, మందులు, యాజమాన్యంతో సహా పంట ఉత్పత్తులు ఇంటికి చేరేవరకు ఖర్చులు) కు నిర్వహణ ఖర్చు కలిపి కనీస మద్దతు ధర పొందేట్లుగా ఉండాలని స్వామినాథన్ సూచించారు.

వరికి 1500 రూపాయల మద్దతు ధర కావాలని రైతులు రైతు సంఘ నాయకులు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం వరి మద్దతు ధర క్వింటాలుకు 1030 రూపాయలు మాత్రమే ఉంది. రైతుకు గిట్టుబాటు ధర కావాలంటే క్వింటాలుకు 1500 రూపాయలు ఉండాలని, కనీసం మద్దతు ధర ఆ మేరలో చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా బియ్యం ఎక్కువగా పండించేవి ఇండియా, చైనా, వియత్నాం, థాయ్‌లాండ్ దేశాలు మాత్రమే. ప్రపంచ దేశాలకు బియ్యం కావాలన్నా ఈ నాలుగు దేశాలు మాత్రమే ఎగుమతి చేయగలవు. థాయ్‌లాండ్‌లో 50 శాతం, చైనాలో 30 శాతం, ఇండియాలో 20 శాతం చొప్పున ఎగుమతి జరుగుతోంది. మనదేశంలో పండే బియ్యం మాత్రం పెద్దగా ఎగుమతులకు నోచుకోవడం లేదు. పైగా మార్కెట్ ఆంక్షలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం తదితర కారణాల వల్ల రైతులు వరిపంటను పండించడం మానేస్తున్నారు.

1994 వరకు వరి మద్దతు ధర, గోధుమల ధరకన్నా ఎక్కువ ఉంది. పంట ఉత్పత్తికి మద్దతు ధర 1994లో వరిపంటకు 594 రూపాయలు ఉంటే గోధుమలకు 566 రూపాయలు ఉంది. అయితే ఆ తరువాత గోధుమకు మద్దతు ధర వరిపంట

ధరకన్నా మించిపోయింది. రెండు పంటలకు ఉత్పత్తి ఖర్చు దాదాపు ఒకటే అయినా గోధుమలకు ఎక్కువ మద్దతు ధర ఇవ్వడం, వరి మద్దతు ధర తగ్గిపోవడంతో సర్వత్రా ఆందోళన ఏర్పడింది.

వరిపంటపై కేంద్ర ప్రభుత్వం 1994 తరువాత సవతి తల్లి ప్రేమనే చూపిస్తున్నది. 1997-98లో మద్దతు ధర వరికి రూ.445 ఉంటే, గోధుమకు 510 ఉంది. 1998 -99 నాటికి సాధారణ వరి మద్దతు ధర 470 రూపాయాలు, గోధుమ ధర 550 రూపాయలుగా నిర్ణయించారు. తేడా 70 రూపాయల నుంచి 110 రూపాయలకు పెరిగింది. 2006-07 నాటికి గోధుమ మద్దతు ధర 750కు పెంచారు. వంద రూపాయలు బోనస్ ఇచ్చారు. వరి మాత్రం క్వింటాలుకు 645 నుంచి 675కు మాత్రమే పెరిగింది. 175 నుంచి 205 వరకు తేడా వచ్చింది. అంతర్జాతీయంగా గోధుమల ధర పెరగడం వల్ల గోధుమలు క్వింటాలుకు 1545 రూపాయలు చెల్లించి కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్నది. గత సంవత్సరం నుండి గోధుమలకు- వరి మద్దతు ధరలలో భారీ వ్యత్యాసాన్ని తగ్గించారు. ఈ సంవత్సరం వరికి 1030 గోధుమలలో 110 మద్దతు ధర .... వరి పంటకు రైతుకు ఎకరాకు రూ. 16,000లు కనీస పెట్టుబడి అవుతుంది. ఎకరాకు సరాసరి దిగుబడి 25 నుంచి 30 బస్తాలు వస్తుంది. రైతు శ్రమశక్తి, పంటపొలానికి లీజు చెల్లించే పరిస్థితి ఉంటే ఖర్చులు సరాసరి దిగుబడి 25 నుంచి 30 బస్తాలు వస్తుంది. రైతు శ్రమశక్తి, పంటపొలానికి లీజు చెల్లించే పరిస్థితి ఉంటే ఖర్చులు అదనం అవుతాయి. 1500 రూపాయలు క్వింటాలుకు మద్దతు ధర ఉంటేగాని రైతుకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో, నాన్‌డెల్టా ప్రాంతాలలో ఎకరా వరి ఉత్పాదక ఖర్చు 20 వేల వరకు వస్తుంది. వ్యవసాయ పంటలకు ఏమాత్రం గిట్టుబాటు ధరలు లభ్యం కావడం లేదు. గనుకనే పల్లె ప్రాంతాలు నీరసించిపోతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం కేంద్రప్రభుత్వం ప్రకటించిన గోధుమ మద్దతు ప్రకారం ఎకరాకు ఖర్చులు పోను పదినుంచి 12 వేలు గోధుమ పండించే రైతుకు మిగిలేది. అదే వరి విషయంలో రెండువేలు మాత్రమే మిగులుగా తేలింది. రైతు ఉత్తరాది అయినా దక్షిణాది అయినా ఒకటే. గోధుమ, వరి పంటలకు ఖర్చు ఒకటే. సరాసరి ఆదాయం ఒక్కొక్కరికి ఏటాఎకరాకు 25 వేల రూపాయలు కనీసం ఆదాయం ఉండాలనేది కేంద్రప్రభుత్వం. అయితే రైతు కుటుంబానికి కనీసం 5 వేలు అయినా వచ్చే పరిస్థితి లేదు. కనీస మద్దతు ధర వరి రైతుకు క్వింటాలుకు 1500 రూపాయలు ఇచ్చే పక్షంలో దేశవ్యాప్తంగా రైతులకు వచ్చేది అదనంగా 16 వేల కోట్లు మాత్రమేనని తద్వారా 16 కోట్లు కుటుంబాలకు మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

పంజాబ్ హర్యానాలలో రైతుల నుంచి గోధుమలను నేరుగా భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ) కొనుగోలు చేస్తుంది. అయితే రాష్ట్రంలో వరిపంటను మాత్రం రైస్ మిల్లర్ల నుండి కొనుగోలు చేస్తుంది. రైస్ మిల్లర్లు రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

### కాకిలెక్కలతో మద్దతు ధరల మాయ

కనీసం ఎకరా పంటను కూడా సందర్శించకుండానే వ్యవసాయ క్షేత్రాలకు వెళ్ళకనే వ్యవసాయ ఉత్పాదక ఖర్చులు నిర్ధారించి కనీసం మద్దతు ధర ప్రకటిస్తారనే అపవాదు ఎప్పటినుంచో ఉంది. ఎలాంటి పారదర్శకతకూ, వాస్తవాలకు అవకాశం ఇవ్వకుండా జరిపే ఈ కార్యక్రమం కొన్నేళ్ళుగా సాగుతూనే ఉంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ, ప్రభుత్వానికి సంబంధంలేని కనీస మద్దతు ధర నిర్ధారణ కార్యక్రమం రైతుల అభిప్రాయాలకు కూడా అవకాశం ఉండదు. పంట మార్కెట్‌లోకి వచ్చినపుడు ఉత్పాదక ఖర్చులు కలిపి కనీస మద్దతు ధరను ప్రకటించారు. అయితే వచ్చే పంట కాలానికి ముందే ప్రకటిస్తారు.

కేంద్ర ప్రభుత్వానికి చెందిన డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ శాఖ మద్దతు ధరలను నిర్ధారించి వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ (సిఏసిపి)కి సూచిస్తుంది. దేశవ్యాప్తంగా ఆయా పంటలు పండించే రాష్ట్రాల నుంచి నివేదికలు తెప్పించుకుంటుంది. రాష్ట్రాలలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం తయారు చేసిన నివేదికలను కేంద్ర స్టాటిస్టిక్స్ విభాగానికి పంపుతుంది. అయితే ఇవేవీ శాస్త్రీయంగా జరగడం లేదు. వివిధ పంటలకు ధరను నిర్ధారించాలంటే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో 60 మండలాల చొప్పున ఎంపిక చేస్తారు. ప్రతి మండలంలోను 60 ఎకరాలు చొప్పున నమూనాగా తీసుకుంటారు. ఎంపిక చేసుకున్న గ్రామాలకు విస్తరణ అధికారులను పంపి ఆయా పంటలకు ఉత్పత్తి ఖర్చులు ఎంత అవుతున్నాయి. పంటల దిగుబడి ఎంత వస్తున్నది అనే వివరాలకు డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగం అంచనాలు రూపొందించి సిఏసిపికి పంపుతారు. అయితే కింది నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఈ వివరాలు అన్నీ పంపి సరాసరి ధరలను నివేదించడానికి ప్రస్తుతం రెండు సంవత్సరాలు పడుతున్నదని అంటున్నారు. అయితే అధికారులు రూపొందించిన నివేదికలు ఈ సంవత్సరానివైతే రెండేళ్ళ తరువాత నివేదికల ఆధారంగా కేంద్ర కనీస మద్దతు ధర ప్రకటిస్తుందనే విమర్శలున్నాయి. అయితే అధికారులు, రైతులను, సంబంధిత అధికారులను, ఆయా ప్రాంతాలలో కూలిరేట్లు, సాగుధర, ఎరువులు క్రిమిసంహారక మందులు, రైతుల శ్రమలాంటి వేటితోను పనిలేకుండా ఆఫీసులలోనే కూర్చుని తయారు చేస్తారనే విమర్శ ఉంది. ఇలా మద్దతు ధరను నిర్ణయించడం వల్లనే కేంద్ర ప్రభుత్వం నిర్ధారణకు రైతుల ఖర్చులకు పొసగడం లేదు.

### మిల్లర్ల దోపిడీ

డెల్టా ప్రాంతాలలో రైస్ మిల్లర్ల రైతులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల మేరకు చెల్లిస్తున్నప్పటికీ వినియోగదారునికి వచ్చి చేరే బియ్యం ధర ఎక్కువగా ఉండటానికి కారణం రైస్‌మిల్లర్లు, దళారీల వ్యవస్థ ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అయితే రైతుకు 12 రూపాయలు కిలోకు ధర లభిస్తుంటే వినియోగదారునికి 30–35 రూపాయలకు ఎందుకు అమ్మవలసి వస్తున్నదని ప్రశ్నిస్తే ఆసక్తికర విషయాలు తెలిశాయి. మార్కెటింగ్, రెవెన్యూ, ఎఫ్.సి.ఐ. విద్యుత్, పోలీస్, విజిలెన్స్, తూనికల శాఖ, కార్మిక శాఖ, సేల్స్‌టాక్స్, సివిల్ సప్లయ్స్ తదితర అనేక శాఖలకు చెందిన అధికారులు లంచాలు తీసుకోవడమే కారణమనే ఆరోపణలు ఉన్నాయి. రైస్‌మిల్లర్ల నుంచి పై శాఖల అధికారులు గుంజుకునే మామూళ్ళకు తోడు రైస్‌మిల్లర్లు ఆదాయం కూడా తోడయి పంటల ఉత్పత్తులు వినియోగదారులకు చేరేటప్పటికి, ధర తడిసి మోపెడవుతోందంటున్నారు. అయితే ఈ అన్యాయం, దోపిడీలను అరికట్టే పాలకులు మనకు కరువయ్యారు. తరతరాలుగా అదే దోపిడీ, అదే ఉత్పత్తులు, అదే ధరలతో రైతు కుంగి కృశించిపోతుంటే రైసుమిల్లర్లు దళారీలు, అధికారులు బాగుపడుతున్నారు. ❍

# వ్యవసాయం – మహిళల పాత్ర

**- ఎ. అన్నపూర్ణ**

మెట్ట భూములు వ్యవసాయం రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 80 శాతం వుంది. ఎప్పటి నుంచో మహిళలు వ్యవసాయ రంగంలో సగభాగంగా పనిచేస్తూ వస్తున్నారు. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో గుప్త సామ్రాజ్యానికి చెందిన ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త వరాహమిహిరుని కోడలు లీలావతి వ్యవసాయ విధానం గురించి గొప్ప శాస్త్ర పరిజ్ఞానాన్ని అప్పటి సామాన్య ప్రజలకు పద్యరూపంలో వివరించింది. ప్రకృతి సహజమైన మార్పులను ప్రజలు ముందుగానే గమనించాలని పేర్కొంది. ఈ పద్యాలను ఈనాటికీ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాలలో ప్రజలు పాడుకుంటూనే వుంటారు. 2001 జనాభాలెక్కల ప్రకారం 28 శాతం మహిళలు వ్యవసాయానికి సంబంధించిన రంగాలలో పనిచేస్తున్నారు. భారతదేశంలోని వ్యవసాయ కూలీలలో 56 శాతం పురుషులు 44శాతం స్త్రీలు వున్నారు. మహిళల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు తమిళనాడులో 51% మహిళలు 49% పురుషులు వున్నారు. ఇందుకు కారణం పురుషులు గ్రామాలను విడిచిపెట్టి పట్టణాలకు వలసపోయి వేరువేరు పనులు చేపడుతున్నారు. ఇంతేకాక వ్యవసాయ పరిశోధన సంస్థలో 15శాతం నుంచి 20శాతం మహిళా సైంటిస్ట్‌ల సంఖ్య కూడా పెరుగుతోంది. కనుక స్త్రీలకు ప్రాచీన మెట్ట వ్యవసాయ విధానాలను గుర్తుచేయవలసిన ఆవశ్యకత ఉంది.

పల్లెల్లో స్త్రీలు ఇంటిపనులతోబాటు పొలం పనులనూ చేస్తున్నారు. ఎరువులు వేయడం, నీరుపెట్టడం, నేలను చదునుచేయడం, విత్తనాలు శుద్ధిచేయడం, విత్తనాలు చల్లడం, నారుపోయడం, కలుపుమొక్కలను తొలగించడం, పురుగు మందులు చల్లడం, పంటకోయడం కోసిన పంటను ఎండబెట్టి కట్టలుకట్టడం కుప్పవేయడం, నూర్చడం, బస్తాలలో నింపడం లాంటి అనేకపనులు పురుషులతో సమానంగా చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతూ భూసారాన్ని పరిరక్షించడంలో నేర్పు వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ నిర్విరామంగా శ్రమిస్తున్నారు. దీనికి తోడుగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. మెట్టసేద్యంలో నీటికొరత అప్పులబాధ కుటుంబసమస్యలు వారిని వేధిస్తున్నాయి. వీటిని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడడం జరుగుతోంది. అనారోగ్యం, స్త్రీ పురుషుల వేతనాలలో తేడాలు అనుకూలించని వాతావరణంలోని మార్పులు మార్కెటింగ్‌లో పరిజ్ఞానం లేకపోవడం కొద్దిపాటి జల్లులు పడగానే అనుభవం లేకపోవడంతో జ్యేష్ట, ఆషాడ మాసాలలో (జూన్, జూలై నెలల్లో) తొందరపడి విత్తనాలను చల్లడం, విద్యుత్ సరఫరా, రోడ్లు సదుపాయం లేకపోవడం, రసాయనిక ఎరువులు తగిన పరిమాణంలో వాడకపోవడం, మధ్య దళారుల మాయమాటలను నమ్మి మోసపోవడం వంటి సమస్యలతో మహిళలు దిగాలుపడుతున్నారు. మహిళలు ప్రాచీన మెట్ట వ్యవసాయ విధానాలను తెలుసుకున్నట్టయితే వారి సమస్యలు సులువుగా పరిష్కరించుకోగలుగుతారు. విదేశాలలో ఈ పద్ధతుల ద్వారా మంచి పురోభివృద్ధిని సాధించగలుగుతున్నారు.

విత్తనాలను భద్రపరిచే విధానం ఈనాటిది కాదు. పూర్వకాలం నుండీ వచ్చినదే. విత్తనాలను ఏడురోజులు రాత్రివేళలో మంచులో వుంచి పగలు ఎండలో ఎండబెట్టి గోనె సంచులలో నింపాలి. ఆవుపేడతో అలికి వెదురు బొంగులతో తయారు చేసిన గాదెలలో భద్రపరచాలి. కాని నేటి ఆధునికయుగంలో రైతులు పంట కోసిన వెంటనే మార్కెట్‌కి పంపి అమ్మకాలు చేయడం వలన పురుగులు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. మినుములు, కందులు, పెసలు మొదలైన ధాన్యపు విత్తనాలను మూడు లేదా అయిదు రోజులు ఆరబెట్టాలి. గట్టిగా వుండే పత్తివంటి విత్తనాలను ఆవుపేడతో భద్రపరచాలి. విత్తనాలను ఎంపిక చేసేటప్పుడు ఒకే పరిమాణంలో వుండే వాటిని ఎంచుకోవాల్సి వుంటుంది. తేనె,

నెయ్యి, ఆవుపేడ పూసి భద్రపరచాలని పూర్వపువారు చెబుతారు. విత్తనాల సేకరణకు మాఘం, ఫాల్గుణ మాసాలు అనుకూలమైనవి. ఆ సమయంలో ధాన్యానికి నాణ్యత వుంటుంది.

బీర, గుమ్మడి వంటి పాదులకు నీటి నురగ తగిలే ప్రదేశాలు అనుకూలమైనవి. చేపలు కడిగిన నీళ్ళను పాదులవేళ్లలో పోయడం వలన మంచి దిగుబడి లభిస్తుంది. ప్రతి గ్రామంలో పొలం గట్లపైన గడ్డిని పెంచి పశువులకు మేతగా ఉపయోగించి పశు సంపదను వృద్ధి చేసుకోవచ్చు. ఆవులు, గేదెలు, గొఱ్ఱెలు, మేకలు, కోళ్లు, ఎద్దుల పెంటను ఎరువుగా వాడాలి. చెట్లకొమ్మలను, ఆకులను కూడా ఎరువుగా వాడవచ్చు. కుళ్ళిన కూరగాయాలు, చేపల పొట్టు, గడ్డి చెత్త చెదారాన్ని వృధా చేయకుండా పొలాలలో వేసి భూసారాన్ని పరిరక్షించుకోవాలి. వేపచెట్టులో నైట్రోజన్, పాస్ఫరస్, సల్ఫర్, పొటాషియం, కాల్షియం వుంటాయి. ఇవి పంటలకు చెప్పలేనంత మేలు చేస్తాయి. వేపగింజల నూనె క్రిమిసంహారక మందుగా ఉపయోగపడుతుంది. వేపగింజల పొడిని ఎండబెట్టి పొలాలకు జల్లితే భూసారం పెరుగుతుంది. వేపచెట్టు ఆకులతో ధాన్యాన్ని క్రిముల నుండి కాపాడుకోవచ్చు పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాల్లో నేటికీ సింధునాగరికత కాలంలోని ఈ విధానాన్నే అనుసరిస్తున్నారు.

ఈ పద్ధతిలో వ్యవసాయ భూముల్ని అడ్డంగానూ నిలువుగానూ చారికల్లా తవ్వాలి. ఒకసారి నిలువు చారికల్లో పంటలు వేయడం మరోసారి అడ్డం చారికల్లో పంట వేయడం చేస్తారు. తూర్పు పడమరలుగా 30 సెం.మీ వెడల్పుతో ప్రతీ చారికకూ మధ్య 190 సెం.మీ ఖాళీస్థలాన్ని వదిలి వ్యవసాయం చేయడం వల్ల భూమి చాలాకాలం (జీవితకాలం) సారం కోల్పోకుండా వుంటుంది. అంతేకాక పుష్కలంగా ధాన్యాన్ని నిత్యం పండించు కోవచ్చు. దీనినే "కలిబంగన్‌గ్రిడ్" పద్ధతి అంటారు.

## రసాయన ఎరువులు వాడకంలో నష్టాలు

ఎరువులవాడకం వలన ఆరోగ్యానికి ఎంతమాత్రమూ మంచిది కాదు. ప్రతిమనిషికి రోజుకి 8 నుంచి 10 మిల్లీగ్రాముల విషాహారం శరీరంలో ప్రవేశిస్తోందని సర్వేల ద్వారా తెలుస్తోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ పురుగుల మందులను మూడు రకాలుగా విభజించింది. మొదటి రెండు రకాలను అభివృద్ధి చెందిన దేశాలు సైతం నిషేధించాయి ఎప్పుడో! కానీ ఇటీవల అభివృద్ధి చెందే దేశాల్లో వీటిని ఇంకా వినియోగించడం విచారకరం. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా 2 లక్షల 20 వేల మంది పురుగుల మందు ప్రభావంతోనే చనిపోతున్నారు. మహిళలు కూడా పొలాల్లో యూరియా డిఎపిఎండోసల్ఫాన్ వంటి రసాయనాలను చల్లడం వలన స్త్రీలకు కేన్సర్, చర్మ శ్వాసకోశ వ్యాధులు, మోకాళ్ళ నొప్పులు, కీళ్ళనొప్పులు వంటి వ్యాధులు సంక్రమించి తీవ్రమైన అనారోగ్యానికి గురి అవుతున్నారు. భూగర్భజలాలు కూడా విషపూరితంగా మారుతున్నాయి. వివిధ రసాయానాల కాలుష్యం వాటి అవశేషాల వలన అంతర్జాతీయ మార్కెట్‌లో మన వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పడిపోతోందని ముఖ్యంగా మహిళారైతులు గుర్తించాల్సి వుంది. 1960లో సంభవించిన హరిత విప్లవ ప్రభావంలో విపరీతంగా రసాయనికి ఎరువులు వాడటం వలన భూసారం క్షీణించిపోయింది. వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోయాయి. పురుగుల మందుల్లో పాదరసం సీసం తగరం వంటి విషపూరిత పదార్థాలు శరీరాన్ని కృంగి కృశింపచేస్తాయి. అందువలన ఈ రకం ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతిసిద్ధమైన ఆకులు పశువుల పెంట వర్మికల్చర్ పద్ధతులను మరికొన్ని ప్రత్యామ్నాయ పద్ధతులను పాటించినట్టైతే ఆరోగ్యరీత్యా, అభివృద్ధిరీత్యా మహిళలు వ్యవసాయ రంగంలో విజయాలను సాధించగలుగుతారు.

## మహిళారైతులకు కొన్ని సూచనలు :

మహిళలు పండించిన పంటకు లాభాలు ఎక్కువగా సాధించాలంటే అక్షరాస్యులు కావాలి. స్వంతంగా వార్తాపత్రికలు చదివి టీవీల్లో విని మార్కెట్ రేట్లను తెలుసుకుని దళారుల మీద ఆధారపడటం తగ్గించుకోవాలి. మెట్టప్రాంతంలో పొలంగట్ల పరిమాణాన్ని పెంచాలి. గట్లమీద పళ్ళచెట్లను నాటాలి. మహిళలు కమిటీలుగా ఏర్పడి చేపలు కూరగాయల మార్కెట్ డైరీఫారమ్ ఫ్యాక్టరీల వద్ద లభ్యమయ్యే వ్యర్థ పదార్థాలను ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు చేరవేయాలి. ప్రతిగ్రామంలో పశువుల బాధ్యతను స్వయంగా స్వీకరించాలి. వ్యవసాయానికి పశువులు ఎంతగా సహకరిస్తాయో అందరికీ తెలుసు. అందువల్ల తప్పనిసరిగా ఎన్నో కొన్ని అయినా పశువులను మహిళలు ప్రతిగ్రామంలో ఉమ్మడిగానూ ఇంటింటికీ వుండేలా చూసుకోవాలి. వాటిని తప్పక సంరక్షించుకోవాలి. వీటి మేతకు కావలసిన గడ్డిని ఊరిచెరువులు, కుంటలు, పొలంగట్లపైన పెంచుకోవాలి. ప్రభుత్వం మహిళల కోసం ఏర్పాటు చేసిన "పశుక్రాంతి పథకం" ద్వారా వివరాలను తెలుసుకోవాలి. వ్యవసాయరంగానికి తోడ్పాటునిచ్చే పరపతి బ్యాంకుల గురించి అవగాహనను ఏర్పడివుండాలి. వారిచ్చే సదుపాయాలను "కిసాన్‌శక్తియోజన పథకం, కిసాన్‌గ్రీన్‌కార్డు పథకం" వంటి వాటి గురించి గ్రామాలలో మహిళాసంఘాల ద్వారా వ్యవసాయదారులకు తెలియజేయాలి.

వ్యవసాయరంగంలో అధిక దిగుబడిని సాధించి భూసారాన్ని పరిరక్షించుకోవాలంటే కౌలుకిచ్చిన యజమానులు తమ కౌలుదారులకు సేంద్రీయ వ్యవసాయం గురించి శిక్షణ (ట్రైనింగ్) ఇచ్చి రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గించుకునేందుకు అవగాహన కల్పించాలి. యజమానులు వీటిని ఎప్పుడు పర్యవేక్షిస్తూ శ్రద్ధగా కాపాడుతుండాలి. అంతర్ పంటల విధానాన్ని పచ్చిరొట్ట వ్యవసాయ పద్ధతుల పట్ల మహిళలు అమలు పరచడానికి అంతగా ఉత్సాహం చూపించడం లేదు. గ్రామాలలో సబ్సిడీ విధానాన్ని అమలు పరుస్తున్నా రైతులు సహకరించడం లేదు. ఈ దశలో వారిని కార్యోన్ముఖులను చేయాలి.

భారతీయ మహిళలు 80శాతం గ్రామీణ ప్రాంతాలలో రక్తహీనతకు గురిఅవుతూ బాధపడుతున్నారు. 45 సం॥ వయసుకే ఆరోగ్యం క్షీణిస్తోంది. పౌష్టికాహారం మహిళలు తీసుకునేలా వారిలో అవగాహన కల్పించాలి. అందుబాటులో వుండేలా తక్కువ ధరలకు ఆహారాన్ని సమకూర్చాలి. స్వయం సహకార బృందాల ద్వారా వీటి గురించి చర్చించుకుంటూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. నిజానికి పల్లెలలో పండించిన పంటలు వారికే అందుబాటు ధరల్లో వుంటాయి. స్వచ్ఛత నాణ్యతా కలిగి వుంటాయి. కాబట్టి శ్రద్ధతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నిన్నటితరం మహిళలు దృష్టి సారించకపోయినా, నేటితరం విద్యా అవగాహనలో ముందుకు వచ్చారు. వారిద్వారా మెలకువలు తెలుసుకుంటే ఆరోగ్యం ఆనందం వారి స్వంతం అవుతుంది. నగర మహిళలకు ధీటుగా తమ రంగాలలో విజయాలను స్వంతం చేసుకోగలుగుతారు. అమ్మాయిలకు చదువులు చెప్పించి వారి భవిష్యత్‌కు బంగారుబాటలు వేయగలుగుతారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని వ్యవసాయ రంగంలోని మహిళలు స్వయం సమృద్ధిని సాధించగల సత్తాగల వారనడంలో సందేహం లేదు. 2020 నాటికి 40శాతం ఆహార ధాన్యాలకు డిమాండ్ పెరిగే సూచనలు సమృద్ధిగా కనబడుతున్నాయి. కనుక మెట్టభూములను వ్యవసాయ యోగ్యంగా చేసి పెరుగుతున్న జనాభాకు సరిపడా ఆహారాన్ని అందించేలా కృషి చేయాలి. లేకుంటే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతారు. ఇప్పటికే 20 శాతం ఆహార ధాన్యాల ద్రవ్యోల్బణంతో భారతదేశం సమస్యలను ఎదుర్కొంటుంది. ఆహారంతోబాటు నీటికొరత కూడా మరింత పెరుగుతోంది. 21వ శతాబ్దానికి దేశజనాభా 150 కోట్లకు చేరుకోబోతున్నట్టు అంచనా వేస్తే దేశం ఎంతటి నీటి కొరతకు గురి అవుతుందో ఊహించగలం కాబట్టి మహిళలు ఇంటిని చాకచక్యంతో తీర్చిదిద్దగలిగినట్టుగానే వ్యవసాయరంగంలోనూ దేశాన్ని సౌభాగ్యవంతం చేయగలరు. ఇది మహిళలకు సాధ్యమే. ఇది ఎవరూ కాదనలేని నిజం! ❍

# ఆంధ్ర – తెలంగాణ సమస్యను వచ్చే కొన్ని వారాల్లోనే పరిష్కరించాలి: లోక్‌సత్తా

రాష్ట్ర విభజనకు అనుకూలంగా, వ్యతిరేకంగా డిమాండ్ల మధ్య ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికపై లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ స్పందిస్తూ... భాగస్వాములందరూ విజ్ఞతను, సామరస్య ధోరణిని ప్రదర్శించి ఏకాభిప్రాయానికి వచ్చినప్పుడే అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చే సంతృప్తికరమైన పరిష్కారం సాధ్యమని లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ చెబుతున్న వాదనను పునరుద్ఘాటించారు.

రాష్ట్ర, దేశ విశాల ప్రయోజనాల దృష్ట్యా ఆంధ్ర– తెలంగాణ సమస్యను వచ్చే కొన్ని వారాల్లోనే శాశ్వతంగా పరిష్కరించాలి.

కమిటీ ఎంతో శ్రమకోర్చి రూపొందించిన నివేదికను అందరూ లోతుగా పరిశీలించాలి. కమిటీలోని సభ్యుల విశ్వసనీయత, నిష్పాక్షికత సందేహాలకు అతీతం. వారికి స్వప్రయోజనాలను ఆపాదించాల్సిన పనిలేదు.

కమిటీ నివేదిక ప్రారంభం, ముగింపులో పేర్కొన్న రెండు ఉటంకింపులు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో 1960లో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసంగంలోని ఒక కొటేషన్‌తో రిపోర్టు ప్రారంభమవుతుంది. "అందరూ సమానంగా విజయం సాధించినదే, ఎవరికీ ఓటమి లేనిదే అసలైన విజయం అని ఎన్నో యుగాల పూర్వం భరతమాత గర్వించదగ్గ బిడ్డ బుద్ధుడు చెప్పాడు. ఈవేళ్టి ప్రపంచంలో అదొక్కటే వాస్తవిక విజయం. అది తప్ప మరేదైనా వినాశానికి దారితీస్తుంది" అని నెహ్రూ అన్నారు.

భారతదేశపు తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చెప్పిన మాటలతో రిపోర్టు ముగుస్తుంది. "నిజాల్ని విస్మరించటం ఘోరతప్పిదమవుతుంది. నిజాల్ని నిర్దిష్టంగా, సక్రమంగా ఎదుర్కోకపోతే అవి తమదైన ప్రతీకారాన్ని తీర్చుకుంటాయి" అని పటేల్ చెప్పారు.

... ఆధునిక భారతదేశానికి పునాదిరాళ్లు వేసిన ఆ ఇద్దరు రాజనీతిజ్ఞుల సలహాల్ని అన్నివర్గాల ప్రజలు పాటించాలి. "ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చలకు, ఇతర అభిప్రాయాలకు విలువనివ్వటానికి మించిన ప్రత్యామ్నాయం లేదు. కాబట్టి అన్నివర్గాల ప్రజలూ కలిసికట్టుగా, సామరస్యంతో, పరిణతితో వ్యవహరించి పరిష్కారం కోసం ప్రయత్నించాలి".

"భారత్–పాకిస్తాన్, భారత్–చైనా ఒకచోట కూర్చుని చర్చల ద్వారా సామరస్యంగా, శాంతియుతంగా సమస్యల్ని పరిష్కరించుకుంటుంటే, ఒకే దేశం, ఒకే భాషకు చెందిన ప్రజలు తమ సమస్యల్ని చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు పరిణతిని చూపకపోవటం ఘోరతప్పిదమవుతుంది". ❍

# భారతదేశ చరిత్ర రెండు భాగాలు ఒకటి ఆర్‌టిఐ ముందు మరొకటి తరువాత

సామాన్య ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరచేందుకు ఇటు ప్రభుత్వాన్ని, అటు మీడియాను అనుక్షణం అప్రమత్తం చేస్తూ ఒక ఆర్‌టిఐ కార్యకర్తగా క్షేత్రస్థాయి వాస్తవాల పట్ల పూర్తి అవగాహన గల వ్యక్తి శ్రీ సుభాష్ చంద్ర అగర్వాల్. ఆయనతో ఇంటర్వ్యూ...

**ఎలా మొదలుపెట్టారు? ఇది మీకు ఆర్థికంగా సహాయం చేస్తుందా?**

ఈ పని నన్ను మానసికంగా, మేధోపరంగా ఉత్తేజితుణ్ణి చేస్తుంది. నాది టెక్స్‌టైల్స్ వ్యాపారం. నా అన్ని ఆర్‌టిఐ పనులు ఉదయం మరియు సాయంకాలాల్లో చేస్తుంటాను. సెంట్రల్ ఇన్‌ఫర్మేషన్ కమీషన్ సమావేశాలకు, మాత్రమే పగటిపూట హాజరవుతుంటాను. ఇది ఒక ఆసక్తి కాని Self - Indulgent hobby కాదు ఎందుకంటే ఇది ఇతరులు పరిశోధన చేయడానికి అవకాశాలను కల్పిస్తుంది.

ఇది 43 సంవత్సరాల క్రితం నేనోఉత్తరం వ్రాయడంతో మొదలయ్యింది. యూనివర్సిటీలో బస్‌కండక్టర్ విద్యార్థులతో కుమ్మక్కు కావడం చూసి నేనో వార్తాపత్రికకు ఉత్తరం రాశాను. మరుసటి రోజు బస్సు యాజమాన్యం వారు మా కాంపస్‌కి వస్తే నాకు భయమేసి పారిపోయాను. నిజానికి వాళ్ళు నాకు క్షమాపణ చెప్పించేందుకు బస్‌కండక్టర్‌ని తీసుకువచ్చారు. అది ఒక చక్కని పాఠం. ఒక చిన్న వ్యక్తి మార్పుకి దోహదం కాగల ఆ చిన్ని సంఘటన నుండి నేను ఆర్‌టిఐ పిటీషన్‌లు వేసే స్థాయికి చేరుకున్నాను.

**ఆర్‌టిఐ గురించి ఏమనుకుంటున్నారు?**

చాలాసార్లు చరిత్రకారులు భారతదేశ చరిత్రని గాంధీముందు, తరువాతగా విడదీస్తారు. కాని నా ఉద్దేశ్యంలో అది ఆర్‌టిఐ కి ముందు, తరువాతగా భావిస్తాను. పేరున్న చాలామంది ప్రస్తుత చరిత్రకారులు ఈ చట్టాన్ని విస్మరిస్తున్నారు. నిజానికి ఇది స్వాతంత్రం తరువాత వచ్చిన అత్యంత ప్రభావవంతమయిన చట్టం. ఆర్‌టిఐ చట్టం యొక్క గొప్పతనం ఏమిటంటే ఒక శాసన సభ్యునికి వున్న ప్రశ్నించే అధికారాన్ని ఇది మామూలు పౌరుడికి కట్టబెడుతుంది.

ఇంకా చాలా వుంది. 2 పార్లమెంటు సభ్యుడికి చుక్కపెట్టిన ప్రశ్నకి వ్రాతపూర్వక సమాధానం రాబట్టేందుకు ఒకే అవకాశం వుంటుంది. కాని మనకు మరో రెండు సంస్థలు వున్నాయి. ముందు సెంట్రల్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ అధికారి, ఆ తరువాత ఆ సంస్థ హెడ్ (ఉన్నతాధికారి) ఆ తరువాత సెంట్రల్ ఇన్‌ఫర్మేషన్ కమీషనర్. ఇది చాలా మంచి చట్టం. చాలా వరకు ఇది సెంట్రల్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్లు వినియోగదారుల పట్ల చూపే స్నేహభావం వల్ల బాగా పనిచేస్తుంది. అయితే పాటించాల్సిన విధానాల ఇంకా మెరుగు పరచుకోవలసిన అవకాశం ఎప్పుడూ వుంటుంది.

**ఏం మెరుగులు దిద్దవచ్చు?**

కొద్ది సలహాలకు మాత్రమే నేను పరిమితమవుతాను. 27 మరియు 28 సెక్షన్లు రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రభుత్వరంగ సంస్థలకు తమ నియమనిబంధనలు తామే రూపొందించుకునే అధికారాల నిస్తున్నాయి. ఇది ఒక్కోసారి చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. ఉదాహరణకి సాధారణంగా 10 రూ॥ ఉండే విన్నపానికి ఢిల్లీ హైకోర్టు 500 రూ॥ రుసుమును విధించింది. ఇప్పటికీ ఈ రుసుము ఐదురెట్లు ఎక్కువగా వుంది. ఇది ఆర్థికపరమైన అడ్డంకి దీనికి తోడుగా ప్రొసీజర్ చాలా జటిలంగా వుంది. ప్రజలు పోస్ట్ ఆఫీసుకి వెళ్ళి, పోస్టల్ ఆర్డర్ కొని, పోస్టుచేసి, సమాధానం కోసం ఎదురుచూడాలి. మళ్ళీ పోస్టల్ ఆర్డర్స్‌తో పోస్టుచేయాలి. ఎందుకంటే సాధారణంగా మనం డాక్యుమెంట్స్ అడుగుతాం కాబట్టి ఈ రుసుముల వద్దన చాలా వరకు సరదాకోసం ఆర్‌టిఐ అప్లై చేసే వారిని నిరోధించి నిజమైన ఆర్‌టిఐ అర్జీదారులను గుర్తించేందుకు విధిస్తున్నారు.

అంటే స్పష్టతకు, నాణ్యతకు విలువకు మధ్య ఒక సమతుల్యత రావలసి వుంది. పోస్టాఫీసులో తిరిగి వాడగల ఆర్‌టిఐ స్టాంపు అమ్మకాలు చేపట్టడం ద్వారా ఈ పొడుగాటి ప్రక్రియను తగ్గించవచ్చు. ఇది డబ్బుని కూడా ఆదాచేస్తుంది. 2005లో 10రూ॥ పోస్టల్ ఆర్డర్ తయారుచేసేందుకు 25రూ॥ ఖర్చు అయ్యేది. ఇప్పుడు ఇంకా ఎక్కువ ఖర్చు అవుతుంది. ఇంకో ఉదాహరణ ఏంటంటే సమాచారశాఖ వారు మనల్ని నకలు పేజికి 2 రూ॥ చొప్పున కట్టమని పంపే ఉత్తరానికి 27 రూ॥ పోస్టుఖర్చు చేస్తారు.

ప్రాథమిక రుసుమును 20 రూ॥ కి పెంచి మొదటి పది నకలు పేజీలు ఉచితంగా ఇస్తే ఈ సమస్య కొంత వరకు తేలికగా పరిష్కారమవుతుంది. ఇది డబ్బు ఆదా చేయడమేకాక ప్రాసెస్‌ని తగ్గిస్తుంది. అంతేకాకుండా ఈ చట్టం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి. ఎందుకంటే ఇంకా చాలమందికి ఈ చట్టం గురించి తెలియదు. ఇంకా చాలా మంది పై అధికారులకు అప్పీలు చేసుకోవచ్చన్న విషయం తెలియదు. ❍

**టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో...**

# 35 ఏళ్ళ అసమర్థత వల్లే నష్టపోయాం ...

## ఇకనైనా రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు పకడ్బందీ వ్యూహం కావాలి: కృష్ణా ట్రైబ్యునల్ తీర్పుపై జేపీ

చాలాకాలం విచారణ తర్వాత కృష్ణానదీజలాల పంపిణీపై ట్రైబ్యునల్ ఇచ్చిన ముసాయిదా తీర్పుపై సంయమనంతో వ్యవహరించి న్యాయపరంగానే రాష్ట్రప్రయోజనాలను కాపాడుకోవాలి. ట్రైబ్యునల్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమనే అంశాన్ని గుర్తుంచుకుని ఆచితూచి వ్యవహరించాలి. 1976లో బచావత్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్‌కు చాలా అనుకూలమైనది. అయితే ఈ 35 ఏళ్లలో మన పాలకులు, పార్టీలు ప్రజాప్రయోజనాల కోసం కలిసి పనిచేసే ధోరణితో కాకుండా .. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వివాదంగా మారుస్తూ వ్యవహరించటం వల్ల ఆ సువర్ణావకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నాము. ఆ నీటిని వినియోగించుకున్నట్టయితే ముందు వినియోగం అనే అంతర్జాతీయ సూత్రం ప్రాతిపదికన మనం లాభపడి ఉండే వారం. ప్రస్తుత కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు మీద కూడా అలా సంకుచితంగా వ్యవహరించకుండా కలిసికట్టుగా పకడ్బందీ వ్యూహంతో వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి.

బచావత్ ట్రైబ్యునల్ అప్పట్లో 75శాతం నీటిలభ్యతను (డిపెండబిలిటీని) అంచనావేసి నిర్ణయం తీసుకోవటం వల్ల దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ లాభపడింది. ఇప్పుడు బ్రజేష్ మిశ్రా ట్రైబ్యునల్ ఆ డిపెండబిలిటీని 65శాతానికి తగ్గించి తీర్పు వెలువరించటం వల్ల మన రాష్ట్రానికి నష్టం. దానికి తోడు పెంచిన 147 టీఎంసీల ప్రవాహ జలాల్లో కూడా మనకు వాటా తగ్గించి 38 టీఎంసీలే ఇవ్వటం అసంతృప్తికరం. గతంలో మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛ మనకు ఉండేది. ఇప్పుడు వాటాను పంచి హక్కుగా చేయటం వల్ల ఆ మేరకు మనకు వచ్చే జలాలు తగ్గుతాయి. 1001 టీఎంసీలకే పరిమితమవ్వాల్సి వస్తుంది. అలాగే ఆల్మట్టి ఎత్తును 524.25 మీటర్ల ఎత్తునకు పెంచేందుకు అనుమతించి, అదేసమయంలో మనకు జూన్, జులై నెలల్లో అక్కడ్నుంచి 10-15 టీఎంసీల నీటిని విడుదల చేస్తామనటం హాస్యాస్పదం. అయితే ఇన్నాళ్లూ పాలకులు ముందుచూపులేకుండా వ్యవహరించటం వల్ల తలెత్తిన ఈ పరిస్థితిని చాకచక్యంగా, సంయమనంతో, ఇతర రాష్ట్రాలతో సానుకూలంగా వ్యవహరించుకోవటం మినహా మార్గం లేదు. బాగ్లిహార్ జల వివాదాన్ని భారత్, పాకిస్తాన్ అంతర్జాతీయ మధ్యవర్తి ద్వారా సామరస్యంగా పరిష్కరించుకున్నప్పుడు, కృష్ణా బేసిన్‌లో వివాదాన్ని ఆంధ్రప్రదేశ్-కర్ణాటక- మహారాష్ట్ర కూడా స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవచ్చు.

ముఖ్యమంత్రి వెంటనే అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి నిపుణులతో కూడా చర్చించి మనకున్న అభ్యంతరాలను సహేతుక వాదనలతో నిర్దిష్టంగా ట్రైబ్యునల్ ముందు ఉంచాలి. ఈ విషయాన్ని సీఎం కార్యాలయానికి, ఇరిగేషన్ కార్యదర్శికి కూడా ఇప్పటికే తెలియచేశాము. ప్రభుత్వం తక్షణం ఈ దిగువ అంశాలను పరిగణలోకి తీసుకుని చర్యలు చేపట్టాలి.

1. నికరజలాలుగా భావించి 65శాతం డిపెండబిలిటీని చేయటం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కాబట్టి నీటి లభ్యతను 75శాతానికి పెంచాలి. 47ఏళ్ల అంచనాలు కాకుండా 113 ఏళ్ల అంచనాలను తీసుకోవాలి.
2. వర్షాలు కొంత ఆలస్యమైనా ఖరీఫ్‌లో తగిన ఏర్పాట్లు చేయాలి. 10-15 టీఎంసీల నీటి విడుదల చాలదు. సాగునీటి అవసరాలకు జూన్, జులైలో ఎక్కువ కేటాయింపులు వచ్చేలా గట్టిగా పోరాడాలి. ప్రస్తుతం చేస్తున్నట్టు మన రిజర్వాయర్లను ముందుగానే ఖాళీ చేయకుండా వచ్చే ఏడాది ఖరీఫ్ పంటకు కూడా నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
3. నదీజలాల కేటాయింపులు తప్ప ఇప్పటి వరకూ కంట్రోల్ అథారిటీ లేదు. పూర్తి స్వయంప్రతిపత్తిగల అలాంటి నియంత్రణ అథారిటీని వెంటనే ఏర్పాటు చేయాలని కోరాలి. అది మనకు ఎంతో అవసరం, మన హక్కు కూడా.
4. ఆల్మట్టిలో అదనపు నీరు కేవలం జలవిద్యుత్ కోసమనే చెబుతున్నారు. ఎత్తు పెంచుతున్నారు కాబట్టి మనకు కేటాయించిన నీటిని ఆల్మట్టి నుంచే తీసుకుంటే గురుత్వాకర్షణ వల్ల తేలిగ్గా, తక్కువ ఖర్చుతో మన పట్టణాలకు, గ్రామాలకు తాగునీరు అందించవచ్చు.
5. గతంలో గోదావరి నుంచి కృష్ణా డెల్టాకు నీరు మళ్లించినట్టయితే ఆ నీటిని కూడా పంచుకోవాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం వాటాలు పంచారు కాబట్టి దిగువన గోదావరి నీటిని కృష్ణాకు మళ్లిస్తే కృష్ణా నీటిని చాలామేరకు తెలంగాణ, రాయలసీమ, కోస్తా మెట్ట ప్రాంతాల్లో సాగుకు వినియోగించవచ్చు. గోదావరి జలాలను మన రాష్ట్రంలోనే, మన వ్యయంతోనే మళ్లిస్తున్నాం కాబట్టి మన రాష్ట్రానికే ఆ నీరు మనకే దక్కేలా ట్రైబ్యునల్ నుంచి నిర్నిబంధమైన హామీని తీసుకోవాలి. ఇది ఎంతో కీలక అంశం" అని జేపీ అన్నారు. ఈ విధంగా సమగ్ర జలవనరుల విధానాన్ని అమలు చేస్తే తప్ప ఈవేళ రాష్ట్రప్రయోజనాల్ని కాపాడుకోలేమన్నారు. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోకుండా అందరినీ కలుపుకుని పోవాలి.

ట్రైబ్యునల్ ముందు మన రాష్ట్ర వాదన సక్రమంగా లేకపోవటం వల్లే నష్టపోయామన్న వాదనను గురించి పెద్దగా పట్టించుకోవాల్సిన పన్లేదు. మూడు పెద్దరాష్ట్రాలలో ప్రవహించే దక్కన్ పీఠభూమిలోని ఒక పెద్ద జీవనదిపై సుప్రీంకోర్టు స్థాయి ట్రైబ్యునల్ గణాంకాలు ఆధారంగానే ప్రధానంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ❍

# అవినీతిపై పోరుకు కదిలిన విద్యార్థి సంఘాలు

## ఆలోచన, అంకితభావం, సంఘటితతత్వంతో పోరాడితే విజయం తథ్యమన్న జేపీ

అవినీతికి వ్యతిరేకంగా కేవలం నినాదాలు చేస్తూ గుడ్డిగా పోరాడితే ఫలితాలు రావు. లోతైన ఆలోచన, అంకితభావం, సంఘటితతత్వంతో పోరాడి దేశంలో అవినీతిని నిర్మూలించేందుకు కలిసిరావాలి.

లోక్‌సత్తా అవినీతి వ్యతిరేక ఉద్యమానికి మద్దతునిచ్చి రాజకీయాలకతీతంగా ఆ పోరాటంలో పాలుపంచుకునేందుకు యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థి సంఘాల ప్రతినిధులనుద్దేశించి జయప్రకాష్ నారాయణ్ డిసెంబర్ 29న పార్టీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడారు. ఈ ఉద్యమానికి ఐ-ఫోకస్, యూత్ ఫర్ సైన్స్ తదితర సామాజిక సంస్థల ప్రతినిధులు కూడా హాజరై మద్దతును పలికారు.

"2-జీ స్పెక్ట్రం, కామన్వెల్త్ క్రీడలు, సుప్రీంకోర్టు జడ్జీలలో అవినీతి వల్ల సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలచుకుని దేశంలో అవినీతిని అంతం చేసేందుకు విద్యార్థులు, యువత నడుంబిగించాలి. ఈ అవినీతి వల్ల ప్రధానమంత్రి సహా అందరూ సమస్యను గుర్తించి అంగీకరించాల్సి వచ్చింది. సాక్షాత్తూ ప్రధానమంత్రి ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) ముందు హాజరవుతానని ప్రకటించాల్సి వచ్చింది. అవినీతి నిర్మూలనకు ఏం చేయాలి అనే నిర్దిష్ట ఆలోచన, చర్చ మొదలవటం చాలా సానుకూల పరిణామం. ఆలోచన, అంకితభావం గల కొన్ని బృందాల వల్ల అవినీతి పోతుందా అని అధైర్య పడవద్దని, 2-జీ స్పెక్ట్రం కుంభకోణంలో పోయిన డబ్బును తిరిగి తేవాలని, సహజ వనరుల కేటాయింపులో పోటీబిడ్డింగ్‌ను ప్రవేశపెట్టాలని, అవినీతి నిర్మూలనకు బలమైన సంస్థాగత ఏర్పాట్లు చేయాలని ప్రధాని కార్యాలయానికి లోక్‌సత్తా పోస్టుకార్డులు, మనియార్డర్లు, ఈ-మెయిళ్ల ద్వారా చేసిన సందేశాల పోరాటానికి, ఎంపీలకు పంపిన లేఖలకు స్పందన కనిపిస్తోంది. అందుకే కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో ప్రకృతి వనరుల కేటాయింపులో పోటీ బిడ్డింగ్, అవినీతి నిర్మూలనకు వ్యవస్థ వంటి ఏర్పాట్ల గురించి మాట్లాడాల్సి వచ్చింది" అన్నారు. సీపీఎం, సీపీఐ జాతీయ నేతలు ప్రకాష్ కారత్, బర్ధన్‌లను కూడా తాను కలిసి ఇవే అంశాల్ని వివరించానని, వారు కూడా ఆ స్కాం మీద పోరాటంలో ఈ అంశాల్ని కలపటం ఎంతో కీలకమని, తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారని జేపీ అన్నారు.

"అవినీతి నైతికాంశం కాదు. మనం అవినీతిపరులం కావటం వల్లే అవినీతి జరుగుతోందనటం పూర్తిగా అవాస్తవం. వ్యవస్థలోని లోపాలను సరిచేయటం ద్వారానే అవినీతిని కట్టడి చేయటం సాధ్యమవుతుంది. అవినీతికి పాల్పడేవారు తమ అక్రమసంపాదనలను కోల్పోతామని, అవినీతి ద్వారా సంపాదించిన దాని కంటే కూడా ఎక్కువ నష్టపోతామనే భయం ఉండే ఏర్పాట్లు ఉంటే అవినీతి అదుపులో ఉంటుంది. ఇలాంటి వ్యవస్థీకృత ఏర్పాట్లు రాజకీయాల్లో, పాలనావ్యవస్థలో నిర్దిష్టంగా ఉండేలా పోరాడాల్సి వుందన్నారు.

అవినీతితోపాటు భారతదేశం ఎదుర్కొంటున్న నాయకత్వ కొరతను అధిగమించటంపై విద్యార్థి సంఘాలు గట్టి దృష్టి పెట్టాలి. అందుకోసం శిక్షణా తరగతుల్ని ఏర్పాటు చేయాలి.. నాణ్యమైన విద్య, సరైన వృత్తినైపుణ్యాలు లేకపోవటం వల్లే ఈవేళ యువత రోడ్లెక్కుతున్నారు. వారికి తగిన శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాల మెడలు వంచాలి. చైనా 15ఏళ్లలో 14కోట్ల ఉద్యోగాలు కల్పిస్తే మన పాలకులు ఆ సమయంలో కేవలం 30లక్షల ఉద్యోగాల్ని కల్పించటం దారుణ బాధ్యతారాహిత్యం".

ఈ ఎజెండాతో ప్రతి కళాశాలలో విద్యార్థులను సమీకరించి రాజీ లేని, నిర్మాణాత్మక పోరాటం ప్రారంభించాలని జేపీ కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఐడెంటిటీని కాపాడుకుంటూనే అవినీతి నిర్మూలన వంటి ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసికట్టుగా పనిచేసే సంస్కృతి మన సమాజంలో పెరగాలన్నారు. కులం,మతం వంటి అంశాల చుట్టూ అల్పమైన రాజకీయాలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే అంశాల చుట్టూ నిజమైన రాజకీయాలు చేయాలన్నారు. నిజమైన రాజకీయాలంటే పౌరసత్వమేనని, రాజకీయ పార్టీలో చేరాలా, వద్దా అనే అంశంతో సంబంధం లేకుండా పౌరుడు తన బాధ్యతలో భాగంగా రాజకీయాలను పట్టించుకుని తీరాల్సి వుందని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

అవినీతి నిరోధక చట్టం సవరణకు లోక్‌సత్తా రూపొందించిన బిల్లును అసెంబ్లీలో చట్టం చేయాలని, 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దు చేయాలని, తిరిగి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ద్వారా కేటాయించి పోయిన డబ్బును తిరిగి ఖజానాకు రాబట్టాలని, తిరిగి అటువంటి అవినీతి జరగకుండా జాతీయ స్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి వ్యతిరేక కమిషన్ (ఐ.ఎ.సి.సి)ని ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులపై అవినీతి కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేయాలని చేసిన తీర్మానాలను ఆమోదించి, ఆ లక్ష్యాల సాధన కోసం పోరాడతామని విద్యార్థిసంఘాలు ప్రకటించాయి. ❍

# రైతులకు దీర్ఘకాల ప్రయోజనాలు అందించాలి

**అంశాల ప్రాతిపదికన ఏ పార్టీతోనైనా కలిసి పనిచేస్తాం : జేపీ**

**వ్యవసాయరంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి**

**వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలి : జేపీ**

**విజయవాడ :** అంశాల ప్రాతిపధికగా ఏ రాజకీయ పార్టీతోనైనా కలిసి పనిచేసేందుకు లోక్‌సత్తా సిద్ధంగా ఉందని జయప్రకాష్ నారాయణ చెప్పారు. వ్యవసాయ రంగంలో తలసరి ఆదాయం ఏడాదికి ఒక శాతం కూడా పెరగడం లేదు. తాత్కాలిక తాయిలాలతో పాలకులు వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఈ రంగంలో సంక్షోభానికి ప్రకృతి వైపరీత్యాలు మాత్రమే కారణం కాదు. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తిస్తేనే రైతులు నష్టపోకుండా ఉంటారు. ఇప్పటివరకు దేశాన్ని రాష్ట్రాన్ని పాలించిన పలుపార్టీల ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేశారు. వ్యవసాయ రంగంలో సంక్షోభానికి మూల కారణాలను అన్వేషించి వాటిని నివారించే యత్నం చెయ్యాలి. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చెయ్యాలి. ఈ కృషి చేయకుండా రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని రైతులను ప్రభుత్వం బిచ్చగాళ్లగా మారుస్తోంది. పండించిన పంటకు న్యాయమైన గిట్టుబాటు ధర లభిస్తుందన్న భరోసాను, విశ్వాసాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. వర్షపునీరు కాలువల్లోకి పోయే సదుపాయాలను కల్పించకపోవడం వల్లనే పంట నష్టం జరుగుతోంది. అన్ని దేశాల్లో వరదల నుంచి పంటను రక్షించే విధానాలు అమలు జరుగుతుండగా ఇక్కడ అటువంటి విధానాల్లేవు. ఉల్లిపాయ ధర గత మూడు నెలల్లో రూ॥60కి చేరినా రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడం ఆంధోళణకరం. మధ్య దళారులను నివారించి రైతుకు లాభం చేకూర్చే చర్యలకు ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదు. ఉల్లిపాయలో తేమను తొలగించడం లేదా ఉల్లిపాయలను ఫౌడర్‌గా మార్చి నిలవ చేస్తే ధరలు పెరిగినపుడు మార్కెట్‌లో ఈ ఉత్పత్తులను అమ్మవచ్చు. తాత్కాలిక తాయిలాలను పక్కన పెట్టి శాశ్వత ప్రయోజనాలతో రైతులను ఆదుకోవాల్సి ఉండగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కొత్తగా గోడౌన్లు నిర్మించాలి. మారుతున్న సాంకేతిక సమాచార సెంటర్లను ఏర్పాటు చెయ్యాలి. దీనిని పారిశ్రామిక రంగంగా మార్చేందుకు ప్రభుత్వాలు కృషి చెయ్యాలి. లోక్‌సత్తా ఉద్యమంతోనే దేశంలో బియ్యం ఎగుమతులకు అనుమతులు లభించాయి. ఫలితంగా ధాన్యం రేటులో కొద్దిగా పెరుగుదల కనిపిస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చెయ్యాలి. ఉపాధి హామీ చట్టం అమలుతో వ్యవసాయకూలీలకు ఎంత రేటిచ్చినా రైతులకు దొరకని పరిస్థితి ఉంది. ఉద్యోగాల కల్పనలోనూ భవిష్యత్తులో సంక్షోభం ఏర్పడే పరిస్థితి రానుంది. చైనాలో గత 15 ఏళ్లలో 14 కోట్ల ఉద్యోగాలు సృష్టించుకున్నారు. అయినా ఇంకా సంక్షోభంలో ఉన్నామని ఆ దేశీయులు భావిస్తున్నారు. దేశంలో పారిశ్రామిక రంగంలో 3 వేల కోట్ల ఉద్యోగాలే ఉన్నాయి. అని జేపీ అన్నారు.

రైతులకు తాత్కాలిక తాయిలాలతో మభ్యపెట్టకుండా ప్రభుత్వ దీర్ఘకాల ప్రయోజనాలను అందించాలని జేపీ అన్నారు.

1. మంచి రేటుకు తమ ఉత్పత్తులు అమ్ముకునే ఏర్పాట్లు చెయాలి.
2. ఉత్పాదకత పెరిగే నైపుణ్యం రైతుకు కలిగించాలి.
3. శాశ్వత ప్రాతిపదికన ఫార్మర్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చెయ్యాలి.
4 వ్యవసాయ అధికారుల ఆధునిక సాంకేతికతతో అధిక ఉత్పత్తినిచ్చే విత్తనాలు రూపొందించాలి.
5. పరిశ్రమలకు ఇస్తున్న స్వేచ్ఛను వ్యవసాయదారులకు అందించాలి.
6. తక్కువ వడ్డీకి రుణాలు, బీమా సౌకర్యం కల్పించాలి.
7. ప్రకృతి వల్ల నష్టం ఏర్పడినప్పుడు వెంటనే పరిహారం అందించాలి.
8. మార్కెట్ యార్డులో స్టోరేజి సౌకర్యం కల్పించాలి.
9. తాను పండించిన పంటలను అంతర్జాతీయంగా ఎక్కడైనా అమ్ముకునే సౌకర్యం కల్పించాలి.
10. తాను పండించిన పంటకు తానే ధర నిర్ణయించుకునే అవకాశం ఉండాలి.
11. కూరగాయలు, పండ్లకు ప్రాసెసింగ్ యూనిట్లు కల్పించాలి.

ఇక ఇతర దీర్ఘకాల ప్రయోజనాలు కల్పించాలని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. నిర్దిష్టమైన పరిష్కారాల వైపు ప్రభుత్వాలు దృష్టి సారించి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. చైనా, ఇజ్రాయేల్ దేశాలు ఆధునిక సాంకేతికతతో వ్యవసాయ రంగంలో దూసుకు పోతున్నాయని, వాటిని ప్రభుత్వాలు అధ్యాయనం చేసి దేశంలో కూడా ప్రవేశ పెట్టాలన్నారు. చైనా దేశంలో వ్యవసాయ రంగంలో సంక్షోభం తలెత్తినప్పుడు 14 కోట్ల కొత్త ఉద్యోగాలను పరిశ్రమల్లో సృష్టించి అక్కడి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చించిదన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే కోటి మందికి ప్రతి సంవత్సరం ఉద్యోగాలు కల్పించాలన్నారు. యువత నైపుణ్యం పెంచుకొని ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కామినేని పట్టాభిరామయ్య, బసవేశ్వరరావు, జ్ఞానాంబ, రైతుసమాఖ్య నాయకులు నాగేంద్రనాథ్, చెంగళరెడ్డి పాల్గొన్నారు. ❍

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం

## అనంతపురం

### బాలల భీమా పథకానికి విరాళం

**శింగనమల:** మండలంలోని మూడు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చెల్లించాల్సిన బాలభీమా ప్రీమియం లోక్‌సత్తా నియోజకవర్గ ఇంచార్జి నాగేంద్ర చెల్లించారు. కల్లుమడి, గుమ్మేపల్లి, ఎకులనాగేపల్లి గ్రామాల పాఠశాలల విద్యార్థుల బాలలబీమా ప్రీమియం సొమ్ము అందచేశారు.



### హెచ్చెల్సీ నీటిని విడుదల చేయాలి- చెరువుకు నీరివ్వండి

**శింగనమల:** శింగనమల చెరువుకు హెచ్చెల్సీ ద్వారా నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని లోకసత్తా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరు జనార్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. చెరువు కింద 5 వేల ఎకరాలు ఆయకట్టు ఉందని, గత రెండేళ్ల నుంచి పంట పండకపోవడంతో రైతులు తిండిగింజల కోసం అలమటిస్తున్నారన్నారు. పశువులకు గ్రాసం లేకపోవడంతో అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గం ఇన్‌చార్జి నాగేంద్ర, కార్యదర్శి శ్రీనివాసుబాబు, కోశాధికారి నారాయణస్వామి, శంకర్, రమేశ్‌నాయుడు, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

### రైతుల ఐక్యతాయాత్ర

**గార్లదిన్నె:** మండలంలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో శింగనమల నియోజకవర్గంలో చేపట్టిన రైతు ఐక్యతా యాత్ర గార్లదిన్నె మండలంలోని మర్తాడు, కోటంక, కొప్పలకొండ, యర్రగుంట్ల గ్రామాల్లో జరిగింది. మండలంలో దాదాపు వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగుచేయగా వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయింది. ఇక్కడ రైతులు పండించిన పంటకు మార్కెట్ సౌకర్యం లేని కారణంగా రైతులు కర్నూలు,, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని రైతులు చెప్పారు. పండించిన పంటను దేశంలో ఎక్కడైన అమ్ముకొనే స్వేచ్ఛ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

### వ్యవసాయ పనులకు ఉపాధి వర్తింపచేయాలి

**బుక్కరాయసముద్రం:** మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు వర్తింపజేయాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెడ్డిపల్లి, రోటరీపురం, సిద్దరాంపురం, వడియంపేట, బొమ్మలాటపల్లి, దయ్యాకుంటపల్లి గ్రామాలలో పర్యటించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి కల్లుమడి నాగేంద్ర, కార్యదర్శి శ్రీనివాస్‌బాబు, నారాయణస్వామి, దాసరి సుధాకర్, గోవిందస్వామి పాల్గొన్నారు.

### వరికి మద్దతు ధర కల్పించాలి

**శింగనమల:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని శింగనమలలో రైతు ఐక్యతా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓంకార్ ఆరోపించారు. జిల్లా ఆధ్యక్షులు శ్రీనాథ్ లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి వన్నూరప్ప నియోజకవర్గం ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్ర, కార్యదర్శి శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

## కర్నూలు

### ప్రజాపంపిణిని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

**పత్తికొండ టౌన్ :** ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వ విధానాలు బలహీనం చేస్తున్నాయని లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆనందచారి అన్నారు. ప్రజలు ఆహార కొరతతో కొట్టు మిట్టాడుతుంటే ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాపంపిణి వ్యవస్థ నిర్వహణ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు నాగభూషణం, మాధవరెడ్డి, ప్రసాద్, చాంద్‌భాషా, కాశీం తదితరులు పాల్గొన్నారు.

### డిపో తెరిచేదాకా పోరాటం ఆగదు

**పత్తికొండ :** మూసివేసిన ఆర్‌టిసి డిపోను తిరిగి తెరిచేదాకా పోరాటం ఆగదని లోక్‌సత్తా నియోజకవర్గ కన్వీనర్ కె. ఆనందాచారి తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డిపోను తెరవడానికి చర్యలు చేపట్టాలన్నారు.

# నెల్లూరు





## ప్రజలను ప్రభావితం చేసే విధంగా పనిచేయాలి

**వెంకటగిరి టౌన్ :** మున్సిపాలిటీ పరిధిలోని ప్రతివార్డులో ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి మార్గం చూపుతూ వారిని ప్రభావితం చేసే విధంగా లోక్‌సత్తా కార్యకర్తలు పనిచేయాలి అని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. కార్యకర్తల శిక్షణ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. మధ్యతరగతి, రైతుల సమస్యలపై దృష్టిసారించి పోరాటాలు చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి 15 నాటికి 200 మంది సభ్యులను కొత్తగా చేర్చడం, వార్డుల్లో లోక్‌సత్తా శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభించేందుకు నాయకులు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రచార, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బృంద చర్చలు ఏర్పాటు చేసి పార్టీకి ఉన్న బలాలు, బలహీనతలు, అవకాశాలను బేరీజు వేసుకుని గెలుపు సాధ్యాసాధ్యాలను పార్టీ నాయకత్వానికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు నర్రా శ్రీధర్, యువసత్తా జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు, ఎంఎస్‌మణి, బాలకృష్ణ, మహేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

**నెల్లూరు :** డా॥ జయప్రకాష్ నారాయణ్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో పళ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ ఇంఛార్జి ఎద్దు మహేశ్, యువసత్తా నాయకుడు యు.హరికేశవ డివిజన్ నాయకులు హరికృష్ణ, కదిరివేలు పాల్గొన్నారు.

## రాజకీయ శూన్యతను వినియోగించుకుంటాం

**వెంకటగిరి టౌన్ :** రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ శూన్యతను ఉపయోగించుకొని, లోక్‌సత్తా పార్టీని పటిష్టం చేసుకుంటామని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్గపోరు తెలంగాణ అంశం, అధికారం కోసం టీడీపీ పోరాటాలు, పీఆర్పీ అధ్యక్షుడు ఎమ్మెల్యేలను కాపాడుకోవడంలో తలమునకలు కావడంతో రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని తెలిపారు. సారా, ధన ప్రభావంతో ఓటర్లను మభ్యపెడుతున్న సంప్రదాయ రాజకీయ పార్టీలను ఎదుర్కొనేందుకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తున్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 9 లక్షల ఓట్లు ఉన్న లోక్‌సత్తా 2014 ఎన్నికలు లక్ష్యంగా మున్సిపాలిటీలు, పంచాయతీలపై దృష్టి సారిస్తుందన్నారు. పట్టణప్రాంతాల్లో లోక్‌సత్తాకు గట్టి పట్టున్న కారణంగా అధిక వార్డుల్లో పోటీ చేయనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు నర్రా శ్రీధర్, యువసత్తా జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, వెంకటగిరి నియోజకవర్గ లోక్‌సత్తా పార్టీ ఇంచార్జి ఎంఎస్‌మణి, నాయకులు బాలకృష్ణ, మహేష్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్



## లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అన్నధాన కార్యక్రమం

**వనపర్తి:** క్రిస్మస్ పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని చేయూత అనాథ ఆశ్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనాథ విద్యార్థులమని, మనోనిబ్బరాన్ని కోల్పోకుండా పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని లోక్‌సత్తా నాయకులు ఆకాంక్షించారు. ఇదే సందర్భంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మరోవైపు తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు బి. రాంచంద్రుడు, మహేందర్ అనాథాశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తూర్పుగోదావరి



**లోక్‌సత్తా పార్టీ సభ్యుల పాదయాత్ర :**

**కాకినాడ :** నగర సమస్యలను అధ్యయనం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు 50వ డివిజన్లో లోక్‌సత్తా పార్టీ పాదయాత్ర చేపట్టింది. వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలగడం, రోడ్ల మరమ్మత్తులు, పార్క్ అభివృద్ధి పెండింగ్‌లో ఉందని కాలనీ వాసులు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగర ఇన్‌చార్జ్ డా॥ ఆలూరి విజయలక్ష్మీ, నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, బి.సాల్మన్ బాబు, మహిళాసత్తా అధ్యక్షురాలు శ్రీమతి లీలా సావిత్రి, శంకర్, ప్రకాష్, గంగాధర్, వసంత, పద్మ, రాజేష్‌వర్మ, కిషోర్‌కుమార్, రాజ్‌కిషోర్, వాకాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా




**సభ్యత్వ నమోదు కార్యక్రమము**

**సూర్యారావుపేట :** లోక్‌సత్తా పార్టీ విజయవాడ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో పటమట రైతు బజారు దగ్గర పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, అవినీతిపై ప్రజాబ్యాలెట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు అవినీతిపై ప్రజాబ్యాలెట్‌లో తమ అభిప్రాయాలను తెలియపరచారు. యువసత్తా నాయకులు విజయ్, ప్రసాద్, రాజ్‌మోహన్, వెంకట్ మరియు మహిళాసత్తా అధ్యక్షురాలు వంగర నాగమణి, రాష్ట్ర నాయకులు అనుమోలు గాంధీ, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. రాజమణి, ఉపాధ్యక్షులు యన్.యం.డాంగే, కార్యదర్శి బండారు పూర్ణచంద్రరావు, కార్యాలయ కార్యదర్శి బోజడ్ల సత్యనారాయణరావు, పార్టీ నాయకులు సుబ్బరాజు పాల్గొన్నారు.

**మైక్రోఫైనాన్స్‌పై మహిళలకు అవగాహన సదస్సు**

**విజయవాడ అర్బన్:** మహిళాసత్తా ఆధ్వర్యంలో పంజాసెంటర్ లోని మహాలక్ష్మి వీధిలో మైక్రోఫైనాన్స్ మీద మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళాసత్తా అధ్యక్షురాలు వంగర నాగమణి, అర్బన్ ప్రధాన కార్యదర్శి వి. రాజమణి, మహిళాసత్తా ఉపాధ్యక్షురాలు పి. సరళకుమారి అర్బన్ జిల్లా కార్యదర్శి బి. శోభారాణి పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి



**ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన**

**ఉంద్రాజవరం :** ఉంద్రాజవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఒక్క గింజ ధాన్యం కొనలేదు. ఎమ్‌పిడిఓ రాజేశ్వరరావుతో కలిసి యస్. మనోరమ, కృష్ణచైతన్య, సూర్యనారాయణ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు కేంద్రం స్థితిగతులను ఇందిరాక్రాంతి పథం నాయకుల నుంచి లోక్‌సత్తా బృందం సమాచారం సేకరించింది. ఈ కేంద్రాలు ఆలస్యంగా తెరిచారు. కేంద్రంలో అన్ని వంకలు పెట్టి, ధాన్యం అమ్మలేని స్థితి. రైతులు ధాన్యం వ్యాపారుల నుండి పెట్టుబడికి డబ్బు ముందు తీసుకుంటారు. ఒక రోజు కూడా రైతు ధాన్యాన్ని అమ్మకుండా ఆపలేని స్థితి రవాణ ఖర్చు వల్ల కూడా కేంద్రానికి ధాన్యం తేలేదు. కేంద్రాలు తెరిచే నాటికీ రైతులు కళ్ళం దగ్గర చాలా వరకు అమ్మేసారు.

రైతాంగ సమస్యలు గురించి రైతులతో చర్చిస్తున్న యస్. మనోరమ. గ్రామం మొర్త, ఉంద్రాజవరం మండలం. రైతులు కౌలుదారు సమస్యలను మండల రైతు వేదిక అధ్యక్షుడు ఈద్పుగంటి సత్యనారాయణ వివరిస్తున్న దృశ్యం. కౌలురైతులకు,



సహాయాన్ని అందించే విషయం చర్చించారు. ఈ గ్రామంలో ఇన్‌పుట్ సబ్సిడీ రైతులు కౌలుదార్లకు గవర్నమెంటు ఇచ్చిన చెక్‌లను ఇచ్చివేస్తారు. రైతు వేదిక అజెండాను గ్రామ రైతులకు తెలియచేసారు.

## మెదక్


### 'మైక్రో'లపై మహిళలను చైతన్యపరచాలి

**సిద్ధిపేట :** మహిళా సత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి డిసెంబరు 25న స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో మైక్రో సంస్థల పనితీరుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. స్వార్డ్ సంస్థ ప్రతినిధి శివకుమారి మాట్లాడుతూ మధ్యవర్తులతో నిమిత్తం లేకుండా మహిళలకు బ్యాంకుల ద్వారా నేరుగా రుణాలివ్వాలని సూచించారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన మహిళా సత్తా జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ బలమైన చట్టంతో పాటు పరపతి విధానం, మద్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ప్రతినిధి శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజగిరి సరస్వతి మాట్లాడారు. సమావేశంలో రాంచంద్రారెడ్డి, దేశెట్టి రాజు, రాధమ్మ, సుగుణ, సుధ, ఫర్జాన, పద్మ, నిర్మల, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్


### క్రిస్టమస్, సంక్రాంతి వేడుకల్లో లోక్‌సత్తా

**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లాలో లోక్‌సత్తా, మహిళాసత్తా పార్టీ ఆధ్వర్యంలో క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని పార్టీ స్నేహసొసైటీ వికలాంగుల సంస్థలో క్రిస్మస్ పండుగ వేడుకలు జరిపించడం జరిగింది. శారీరక వైకల్యం ఉన్నప్పటికిని వాళ్ళు మనోధైర్యాన్ని వీడద్దని అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళాలని అందుకు మా సహాయ సహకారాలు ఉంటాయని పిల్లలకు ధైర్యం చెప్పటం జరిగింది. పేద మహిళలకు చీరలు అందించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మాహిళాసత్తా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పండుగను అందరం కలిసిమెలసి బీదసాద కులమత భేదాలు



లేకుండా ప్రతి ఒక్కరం జరుపుకోవాలని మన సంస్కృతిని మరవకూడదని మన ఆటలు పాటలు కరువైపోతున్నాయని టీవీ లాంటి వాటిలో పడి అన్ని మరిచిపోతున్నామని వాటి వల్ల కలిగే లాభనష్టాల గురించి తెలియ చేయటం జరిగింది. పిల్లలు 200 మంది మహిళలు 60 పాల్గొన్నారు. సరస్వతి, శైలజ, లలిత, మంజుల, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం




### రాష్ట్రంలో ఏడాదిగా కుంటుపడిన పాలన

**విజయనగరం:** రాష్ట్రంలో ఏడాదికాలంగా పాలన కుంటుపడిందని, ప్రజా సమస్యలపై దృష్టి తగ్గిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డి.వి.వి.యస్. వర్మ అన్నారు. జనవరి 6న ప్రస్తుతం రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితి కొనసాగుతున్నదని దీనికి పాలకుల స్వయంకృతాపరాధమే కారణం అన్నారు. రాజకీయ పార్టీలు అన్ని సిద్ధాంతాల కోసం కాకుండా ఉనికి కోసం మాత్రమే ప్రజా సమస్యలు ప్రస్తావిస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్టీ చీలికలు అన్నీ పదవుల కోసం జరుగుతున్న చీలికలే అని ప్రజల కోసం కాదన్నారు. ఇంకా రైతులపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్పు చేయాలని, రైతులకు పూర్తి స్వేచ్ఛ అవసరమని అభిప్రాయపడ్డారు. మద్దతుధర ఎక్కడ లభిస్తే అక్కడ రైతు పంటను అమ్ముకునే విధానం అమలు చేయాలని సూచించారు. 50శాతం వరకు రంగు మారిన ధాన్యాన్ని కొంటామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు చేయడంలేదని ఆరోపించారు. ఆ పార్టీ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌కుమార్, బీశెట్టిబాబ్జీ, విష్ణుమూర్తి, పాల్గొన్నారు. ❍

# మున్సిపాలిటీ శిక్షణలో ప్రజలతో


















RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad